సృజన

ఆధునిక సాహిత్య వేదిక

ఫిబ్రవరి – ఏప్రిల్ 1969 **10** త్రైమాసిక

కవిత

ట్రిగర్ మీద వేళ్ళతో

చర్చ

ఫ్రీ-ఫ్రాంక్ వర్స్

యోగ్యతా పత్రము

సాంస్కృతిక విప్లవ స్వాగత పత్రం

ఫోకస్

సి. విజయలక్ష్మి - కారుచీకటిలో కాంతిరేఖ

ప్రచురణ: సాహితీ మిత్రులు 80 పేజీలు ఒక రూపాయి

సృజన

ఆధునిక సాహిత్య వేదిక

(త్రైమాసిక)

10

ఫిబ్రవరి 1969

నిర్వహణ

'సాహితీ మిత్రులు'

సృజన

త్రైమాసిక ఫిబ్రవరి—ఏప్రిల్ 1969 10

అన్న తమ్ముని యింట పగవాడా?

తెలుగు జాతికి పిచ్చి పట్టిందా?

....

అన్నదమ్ములనడుమ అన్యోన్యమేపొడమ
కానివానికి కన్ను కుట్టిందా?

తెలుగు చెట్టుకు చీడ పట్టిందా?
తెలుగు దివ్వెకు గాలి కొట్టిందా?
ఆంధ్రచరితములోన హాలాహలపువాన
ఆరిపోపని చిచ్చు పెట్టిందా?

బడుగు పేదలతల్లి తెలగాణము
బాధ పొందిన చెల్లి తెలగాణము
విసిగిపోయిన తల్లి వేసరిల్లిన చెల్లి
విషబోధనలు చెవిని పెట్టిందా?

తెలగాణమే కేక పెట్టిందా?
పలుబాధలే తెలియచెప్పిందా?
పదవి మరగినవాళ్లు మదము పెరిగినివాళ్లు
అదిమిపెడితే బెడిసి కొట్టిందా?

బక్క చిక్కిన గొడ్డు అరిచిందా?
బిక్కచచ్చిన నోరు తడిసిందా?
ఒక్క ధనికుడులేచి పెక్కుమందిని దోచి
చిక్కపెడితే విషము పుట్టిందా?

ఉద్యోగము ప్రశ్న మొలచిందా?
విద్యార్థిలోకాన్ని కలచిందా?
స్వంతలాభముకోరి, వింతపశువులుచేరి
ఉద్యమం పెడత్రోవ పట్టిందా?

దురభిమానము కత్తి కట్టిందా?
దుష్టశక్తుల రెచ్చగొట్టిందా?
పొట్టకూటికి వెదుకు పొరుగూరిలోబ్రదుకు
మూగజీవుల పొట్ట కొట్టిందా?

అన్న తమ్ముని యింట పగవాడా?
ఉన్నవూరును విడిచిపోవాలా?
కంట నెత్తుటి కరుణ నోచని జనము
కాందిశీకుల బాట పట్టిందా?

స్వార్థ భావన కచ్చ కట్టిందా?
స్పర్ధానలము మిన్ను ముట్టిందా?
శ్రీలుపొంగినగడ్డ పాలుపారే గడ్డ
సిద్ధాన్నమే కుక్కముట్టిందా?

దేశమందున పరిభుత చచ్చిందా?
రోషాలకే చోటు ఇచ్చిందా?
ప్రాణభయమే పెరిగి మానభంగముకలిగి
పరిపాలనే గడ్డ కట్టిందా?

రౌడీకి సజ్జనులు జడవాలా?
రగడచేస్తే అణగి నడవాలా?
రక్షణ కరువాయె భక్షణే తిరమాయె
రాచరికమే కంపు గొట్టిందా?

తెలగాణ దాశరథి మనవాడు
తెలగాణ ఒకవీణ అన్నాడు
వీణతీగెలు తెంపు వెతల శ్రుతులను నింపు
విపరీత గతి మనకు పట్టిందా!

తెలగాణ పోతన్న ఒకనాడు
దివ్యకావ్యము ఇచ్చి పోయాడు
ప్రాంతీయ భేదాల పామర నినాదాల
భాగవతమే చెదలు పట్టిందా?

ఒక్కతల్లికి మనము పుట్టాము
ఒక్కరక్తము పంచుకొన్నాము
ఒక్క దేహము నేడు ముక్కలగుమూడు
అక్కటా! మననేమి పట్టింది?

ఏమిటీ సప్రాణ దహనాలు?
ఏమిటీ విద్వేష సవనాలు?
గూండాలు చెలరేగి గండాలు జలపూరి
కులములో ముసలమే పుట్టిందా?

విద్వేష మెదవిడిచి పెట్టిందా?
విద్రోహులకు చేట కొట్టిందా?
ఏకోదరప్రేమ ఏకాండమగుకామ
ఎట్టకేలకు తెలివి పుట్టిందా?

ఆరుద్ర.

(ఆంధ్రపత్రిక సౌజన్యంతో)

కథ

చెకా — చేక

వెంచాశా

గోదావరిగట్టు. గట్టునానుకుని ఊరు. చిన్న పల్లెటూరు. ఊరుచివర చిన్న ఇల్లు. ఇంటిముందు చిన్న తోట. ఇంటికి తాళం. అందమైన ఇల్లు. ఆ ఊరు స్నేహితుణ్ణి చూడ్డానికి వెళ్ళేను. స్నేహితుడు మంచివాడు. అఊళ్లో ఒకరోజు ఉండేటప్పటికి ఏంతోచలేదు. వెళ్తానన్నాను. ఉండమన్నాడు. ఈఊళ్లో విశేషం ఉందన్నాడు. ఏవిటి? అన్నాను. చెకా—చేక అన్నాడు. ఆభాష నాకర్ధంకాలేదు. గూట్లోంచి తాళంచెవి తీసి ఇచ్చాడు. తాళంచేతిలో ఏవుంది? అన్నాను. 'ఊరి చివర ఇల్లు' అన్నాడు. 'ఎవరిది?'

ఇంటి యజమాని పిలునామా అది- ఆ ఇల్లు నీవు చదవాలి- ఒక్కడివీవెళ్లు- ఆ ఇల్లు ఏకాంతంగా చదవాలి- మెదడుకు మేత- గట్టునే నడిచి ఓ అరమైలు వెళ్ళి తూర్పువైపు తిరుగు- అక్కడే ఇల్లు- ఎప్పుడూ తాళంవేసి ఉండే ఇల్లు

'నేనక్కడ రెస్టు తీసుకోవచ్చా'

"రెస్ట్ తీసుకోడానికి అది గెస్ట్‌హౌస్‌కాదు.

వెళ్తే నీకే తెలుస్తుంది"

"దయ్యాలుంటాయా"

"దయ్యం అంటే ఏవిటి?"

"ఏమో అది పాడుబడ్డ ఇల్లేమో"

"ప్రతి రెండురోజులకూ ఇల్లు శుభ్రం చేయిస్తాను. ఎవరో మనిషి ఉన్నట్టే ఉంటుంది అక్కడ. వెళ్లు- ఇఖవెళ్లు- వెనక్కు తిరిగిచూడకు—"

మావాడు నన్ను బెదరగొట్టి ఇంటివైపు తరిమాడు— మెదడుకు మేత అన్నాడు.

*   *

ఆచిన్ని తోటలో రకరకాల రంగు రంగుల రోజా పువ్వులు నన్ను ఆహ్వానించినయి. తాళం తీశాను. ఇంట్లో ప్రవేశించి- కొంచెం చీకటిగా ఉండటంచేత కిటికీలు తీశాను. కొట్టవచ్చేట్టు అన్నివైపులనుంచి వెలుతురు దూసుకు వచ్చింది. రెండడుగులు ముందుకువేశాను. డ్రాయింగ్ రూము. అందమైన సోఫాలు. కింద పర్షియన్ కార్పెట్.... సోఫాల వెనకాల గోడమీద పెద్దపులి భయంకరంగా- పళ్ళు బయటికివచ్చి నోరుతెరుచుకుని చర్మం గోడనావరించుకుని- పచ్చని మెత్తటి రంగూ- నల్లచారలూ- కాలి గోళ్లూ- షుమారు పన్నెండడుగులు- నావైపే చూస్తున్నది గోడమీద పులి- పక్కనే వంకెకు 'గన్' వేళ్లాడుతున్నది.

సెంటర్ టేబిల్‌మీద గాజుపలక, పలకమీద పాలరాతి వీనస్ విగ్రహం.... అబ్బ.... ఏం అందం? కార్నర్‌లో చిన్నస్టూల్.... దానిమీద మూడు కోతులు.... మూడు భంగిమల్లో.... ఫ్లవర్‌వేస్‌లో రోజాలు.... సోఫాచేతుల పక్కన యాష్‌ట్రే- వీనస్ విగ్రహాన్ని ఆనుకుని స్పెన్సర్ జావాడాసన్ సిగార్ బాక్స్- మెరుస్తున్న సిగార్ లైటర్- మరోగోడనానుకుని రెండు అద్దాల బీరువాలు. బీరువాల్లో పుస్తకాలు....ఎన్నో పుస్తకాలు.... అవి చూడాలి.... పుస్తకాల పిచ్చోణ్ణి- బీర్వాలో ఒకపక్కగా బుద్ధుని విగ్రహం, విగ్రహం మెళ్లో పూసలదండ, చుట్టూ కొండపల్లి బొమ్మలు- పాముచర్మం. నాగుబాము కళ్ళు- గోడమీద చిన్న మేకు. మేకుకు టెన్నిస్ రాకెట్ వేళ్ళాడుతున్నది ప్రెస్‌లో.

బీరువాలో పుస్తకాలు.... పుస్తకాల వరసలు- గుంగుంపులుగా పుస్తకాలు- ఒక్కొక్క పుస్తకం చేతికి తీసుకుని చూస్తున్నాను.

పైభాగం అంతా దేశచరిత్రలు, హీరో హీరోల జీవితాలు.

ఎరిస్టాటిల్, జూలియస్ సీజర్, చర్చిల్, కెప్టెన్ కుక్, జెంగిస్ ఖాన్, నెపోలియన్, క్లియోపాత్రా, హెలెన్ కెల్లర్, అబ్రహాం లింకన్, గాంధీ.....

రెండో అరలో యుద్ధానికి సంబంధించినవి....

రోమన్ సైన్యం కథ... పుస్తకంలో రకరకాల బొమ్మలు.... బొమ్మలు యుద్ధంలో పరుగెత్తుతున్నయి- కవచాలు ఇనపటోపీలు- కత్తులూ- బల్లేలూ ...రొమ్ముకు రక్షణఇచ్చే లోహపు కవచాలు- ఏ పుస్తకంచూసినా యుద్ధాలే- చర్చిల్స్ వార్ మెమోయిర్స్- కొన్ని తెల్లకాగితాల పుస్తకాలు- పుస్తకాల్లో రాసుకున్న నోట్సు- గీతలు- బొమ్మలు.... తారీఖులూ....

మూడోఅర.... మతాలు.... ఇంకా ఏవిటో?

జూడాయిజమ్, బుద్ధిజమ్, జోరాస్ట్రియానిజమ్, ఇస్లామ్, లామాయిజమ్, షింటో, సిక్కిజమ్, జైనిజమ్, కన్ఫ్యూసియనిజమ్, టావోయిజమ్,....

భారతం, భాగవతం, గీత, బైబిలు, కొరాను- పుస్తకాలలో అక్కడక్కడ రంగుపెన్సిల్‌తో గీతలు— వివేకానంద ఉపన్యాసాలు- ఆయన జీవిత చరిత్ర- అవేచాలా వాల్యూమ్స్ ఉన్నాయి. వివేకానంద పుస్తకాలలో గ్లేజ్‌పేపరుమీద అక్కడక్కడ బొమ్మలు— తలపాగా, కోటూ- ఠీవిగా చూస్తున్నకళ్ళు- ఒకఫోటోలో క్రింద బ్రహ్మచారి, బ్రహ్మచారి— అని రెండుసార్లు రంగుపెన్సిల్‌తో వ్రాసిఉంది. ఒకదానికి ఆశ్చర్యార్థకం! ఒకదానికి క్వెస్చన్ మార్కు?

వుడ్‌హౌస్....నవలలు.... ఒక నవలలో చివరిపేజీమీద నవ్విస్తాయి! అని నీలంరంగు పెన్సిల్‌తో వ్రాసిఉంది. ఎంతహాయి.... అని మరోచోట....

హౌటుప్లే బ్రిడ్జ్.... How to play goul tennis, - గార్డెనింగ్.... బీరువాలో క్రిందిపక్కన బోలెడు వెండి కప్పులు.... కొన్ని చిన్నవీ- కొన్ని పెద్దవీ.... యుద్ధానికి సంబంధించిన బోలెడు మెడల్సు-

డ్రాయింగ్‌రూమ్‌కూ పక్కనున్నగదికీ మధ్యలో- రంగురంగుల డోర్‌కర్టెన్ గాలికి రెపరెపలాడుతున్నది. పలచగా ఉల్లిపొర కాగితం అల్లే వుంది— అది తోసుకుని లోపలికివెళ్తే ...

గదిమధ్యలో చిన్న డైనింగ్‌టేబిల్... ఒక కుర్చీ- టేబిల్‌కు యెదురుగా అల్మైరా.... అల్మైరాలో సీసాలూ.... గ్లాసులూ ... విస్కీ సీసాలూ.... బీర్‌సీసాలూ- వైన్ గ్లాసులూ- బీర్ గ్లాసులూ- డిన్నర్ ప్లేట్సూ— కాఫీ సెట్— ఎగ్స్‌పెట్టుకునే చిన్న చిన్న కప్పులూ.... పళ్ళరసం తీసుకుండేది. హాట్‌వాటర్ బ్యాగ్.... ఐస్‌బాక్సు- థర్మామీటరు- ఇంజక్షన్ పెట్టెలూ.... మందు సీసాలూ.... సిరెంజి పెట్టె.... గోడలమీద అక్కడక్కడా పెద్దపెద్ద పెయింటింగ్స్- లియోనార్డోడావిన్సీ, పేబ్లో పికాసో, రాయ్ చౌదరి, రవివర్మ.... ఆ పెయింటింగ్స్.... కళ్ళుచెదిరేట్టుగా ఉన్నాయి....

అది చిన్న డైనింగ్ హాల్— దాంట్లోంచి మరో చిన్న గది— బెడ్ రూమ్— ఒక బెడ్-- బెడ్‌ని ఆనుకుని చిన్న స్టూల్— దానిమీద టేబిల్ లైట్— కొంచెందూరంలో అల్మైరా—

అల్మైరాలో మిలిటరీ యునిఫారమ్ హాంగర్‌కు వేళ్లాడుతోంది. కోటుమీద 'కల్నెల్' ఇన్‌సిగ్నియా ఉంది. ఒకపక్కగా మిలిటరీ బూట్స్—

అల్మైరాకు ఒకపక్కగా రైటింగ్ టేబిల్. ఒకకుర్చీ. టేబిల్ మీద గాజుపలక. గాజుపలకకింద ఎడమవైపు ఒక కాగితం. కుడివైపు ఒక కాగితం. ఆరెండు కాగితాల మీద ఏదో గిలికిపారేసి ఉంది. ఒకటి తెలుగులో ఒకటి ఇంగ్లీషులో.

ఒక కాగితంమీద— No greatman lives invain.

The History of the world is but the biography of Great Men" అని ఉన్నది మరో కాగితంమీద.

"దుఃఖేష్వనుద్విగ్నమనుస్సు ఖేషు విగతస్పృహః
వీత రాగ భయ క్రోధఃస్థిత ధీర్మునిరుచ్యతే"

అని ఉన్నది.— నీలంరంగు పెన్సిల్‌రాత—

టేబిల్‌మీద చిన్న ఫ్రేములో అందమైన అమ్మాయి ఫోటో—ఫోటోవెనకాల—

"నన్ను మరచిపోండి— మరోజన్మ అంటూ ఉంటే మళ్ళీ కలుసుకుందాం"— అనివుంది. ఆ అమ్మాయి నాజూకుగా— సన్నగా— పసిడి బొమ్మలా ఫోటోలోంచి నవ్వుతోంది.

బెడ్‌కు అటువైపుగా వెళ్లేను. షాక్‌తగిలింది. తొడ సగంనుండి కిందివరకూ పాదాలతోసహా చెక్క—కాలు. పక్కన చేతి-కర్ర!! గిరుక్కున వెనక్కు తిరిగేను. నా భుజంమీద చేయివేసి నవ్వినట్టే ఉంది ఆప్యాయంగా—

తాళంవేసి గట్టువెంబడి బరువుగా నడుస్తూ.... ఇంటికి చేరుకుని తాళంచెవి మావాడికిచ్చేను.

"ఇంత సేపు ఏం చూస్తున్నావ్— ఏం చేస్తున్నావ్— ఆఇంట్లో" అన్నాడు మావాడు.

నాకు నోరు పెకల్లేదు!!

ఆ ఇంటోని ప్రతి వస్తువు ఒకకథ చెప్తోందిమరి!!!

స్కెచ్:

రోడ్

'వి'

మే నెల మధ్యాహ్నం, రెండంతస్థుల మేడమీద, ఫోల్డింగ్ స్టీల్ కుర్చీలో కూర్చుని ఆలోచిస్తున్న కథారచయిత లేచి, కిటికీకి అడ్డంగావున్న తెర తొలగించి రోడ్డును గమనించిన ఆక్షణంలో–

పిల్లవాడి తండ్రి రోడ్డు మలుపుమీద, ఫుట్‌పాత్ పక్కన- రాత్రిళ్ళు మల మూత్రశాలగా వుపయోగింపబడే రాజమార్గాన- పాడుబడ్డ మసీదు ముంగిట గుడ్డపరచు కుని పడుకుని, ఆశతో అతిప్రయత్నంమీద కళ్ళుతెరచి ఖాళీగావున్న గుడ్డనుచూచి, తను పొద్దుటనుండి ఎప్పటికప్పుడు భద్రంచేసిన పైసలు పదికి మించలేదని నిట్టూరుస్తూ మాగన్నుగా కునికిపాట్లు పడుతున్నప్పుడు–

వాడితల్లి ఇదివరలో పక్కనేవున్న ఆంజనేయుడిగుడిముందు బిచ్చమెత్తుతూ వుండి, రోగం నానాటికి ముదరటంవల్ల, పుళ్ళలోంచికారే రసి, చీము వాసన భరించ లేకుండా వుండటంవల్ల, నలుగురూ మక్కెలిరగతంతామని బెదిరించటంవల్ల, అదే మసీదు ఆవరణలో అటుపక్క ఓచెట్టుకిందికి మకాంమార్చి, ఎండ తగలకుండా ఒదిగి కూర్చుని, పుళ్ళపైవాలుతున్న ఈగల్ని తోలుకోలేక అవస్థపడుతూ, రోడ్డునుపాలిస్తున్న ఎండని చూళ్ళేక కన్నులరమూత పడుతున్నప్పుడు–

ఆతల్లిగన్న పిల్లవాడు, పన్నెండేళ్ళవాడు, ఓరోజు గుడ్డివాడుగా, ఓరోజు కుంటివాడుగా, మరికొన్నిరోజులు సినిమా కొట్యాలముందు పాటలుపాడి, డ్యాన్సుచేసి, మరోసారి మరేవో మరేవో పనులుచేసి రోజుకు రూపాయకు తగ్గకుండా సంపాదిస్తూ, పదిపైసలకు తగ్గకుండా బీడీలుకాలుస్తూ, మరోపదిపైసలకు వేరుశెనక్కాయలు కొనుక్కు తింటూ, రోగిష్ఠితల్లికీ, లేవలేని తండ్రికీ హోటళ్ళలో గంజో ఓరొట్టో కొనుక్కొస్తూ, రాజుకుంటున్న బూట్‌పాలిష్‌సెట్ కొనుక్కోవాలనే కోరికను అణచుకోలేక అందులో ఎంతోకొంతడబ్బు మిగులుస్తూ, ఇంకా మిగిలినదానిలో పక్కనేవున్న ఇరానీహోటల్లో చా పోయించుకు వచ్చి, తను కొంత తాగి, తండ్రికీకొంత ఎంగిలిచేయించి మిగతాది

తల్లికిస్తూ, ఈగల్తో వేగలేక మూలుగుతున్న రోగిష్టితల్లి వినోదంకోసం, కొన్నాళ్ళగా ఆ రోడ్డుమీద తచ్చాడుతూ తండ్రి ముంగిటపరచిన గుడ్డమీద పోగైన డబ్బుల్ని దొంగ చాటుగా తీయబోయిన ఓ కుజ్జ బిచ్చగత్తెని తను ఎట్లా అక్కడే నెత్తురొచ్చేదాకా తన్ని, ఎట్లా నోటికొచ్చిన బూతుకూతలంతాకూసి, ఎట్లా తిట్టి, ఎట్లా ఉమ్మేసి, ఎట్లా అవమానించి(?) ఆనందించాడో ఆ ఘనకార్యం వివరంగాచెబుతూ, ఇంకోరోజు ఇంకేదోచెప్పి నవ్విస్తూ, పొద్దుపుచ్చుతున్న కుజ్జవాడు, ఆరోజు పొద్దుటనుండీ తను సంపాదించిందేమీ లేనందుకు విచారిస్తూ, తల్లిదగ్గరున్న అల్యూమినియం గిన్నెను తీసుకుని, తను దాచిన డబ్బులోంచి పావలా నాణెం చేతబట్టుకొని, ఇరానీ హోటల్‌వైపు గబగబా అడుగులు వేస్తున్నప్పుడు—

అప్పుడు, అప్పుడే, వెనకాల, స్మూత్‌గా గాలినికోసుకుంటూ పరుగెడుతున్న కొత్తగా మార్చిన '66 మాడల్ ఫియట్‌లో సేట్‌జీ— మొన్నటి ఎలక్షన్లో చిత్తుగా ఓడిపోయినా, రేసెస్‌లో పాతికవేలు గెల్చిన సంబరంలో తేలిపోతూ, ఇన్‌కంటాక్స్‌గొడవల్లో చితికిపోతూకూడా, కొడుకును స్టేట్స్‌కు పంపడానికి అవసరమైన ఫారిన్‌ఎక్ఛేంజి వ్యవహారం తేల్చుకున్నందుకు తృప్తిపడుతూ, తలమీద అప్పుడప్పుడూ నెరసిన వెంట్రుకలు పొడసూపుతున్నా, ఖరీదైన హెయిర్‌డార్కెనర్ల సహాయంతో సులువుగా రంగు మార్చేసి, నడివయసు దాటినా తనకింకా వయసు మళ్ళలేదని నచ్చజెప్పుకుంటూ, ఊహల్లో— బోట్‌క్లబ్‌లో మిసెస్ మాలిని గులాబీరేకుల్లాంటి చేతుల్లో నలిగిపోతూకూడా, చంచలమైన మనసు రోడ్డుపక్క—

ఏడేళ్ళకిత్రితం— లేచిపోయినవాడితో ఏడాదైనా కాపురంచేయకుండానే కొత్తగూడెం బొగ్గుగనుల్లో వాడు బొగ్గైపోగా, తార్పుడుగత్తెగా కాలం వెళ్ళబుచ్చుతున్న తల్లిముండ పంచన చేరలేక, ఉన్న ఒక్కనలుసుకోసం పొట్టచేతబట్టుకొని, అంటుతోమి వంటచేసి, హోటళ్ళలో పిండిరుబ్బి, నానాచాకిరీచేసి, తనమానానతాను బ్రతుకుతుండగా ఈగల్లా చుట్టూముసిరే మగపురుగుల్ని విదిలించి విదిలించి చివరికి ఓరోజు సారాకొట్టు నర్సిగాని కబంధహస్తాల్లోంచి బయటపడలేక అలసి సోలిపోగా, వాడు అవసరం తీరగానే కుక్కను విసరికొట్టినట్టు అదిలించి వెళ్ళగొట్టగా, ఏడుస్తూ, సర్వస్వంపోగొట్టుకునీ ఉన్నఒక్క నలుసుకోసం— బళ్ళోకెళుతున్న తన ఆరేళ్ళ పిల్లాడికోసం, వాడి 'బంగారు భవిష్యత్తు' కోసం, రెక్కలు ముక్కలుచేసుకుంటూ, మధ్యాహ్నంవేళల్లో గుడిసెలో ఒక్కర్తీ కూర్చోలేక పళ్ళబేరం సాగిస్తున్న పళ్ళమ్మిమీదవాలగా—

'బజారుముండ, దీనికింకా యవ్వనం బిగిసడలలేదేమా' అని ఆశ్చర్యపోతూ, అది పారేసిన పాసింగ్ గ్లాన్స్‌కు మైకంకమ్మి, వజ్రపుటుంగరాలు పొదిగిన

వేళ్ళు స్టీరింగ్ పట్టుదప్పగా, కుదుపుకు తెలివితెలిసి, బ్రేక్ వేస్తూ, కేకవేశాననుకొని మరుక్షణంలో తను నోరుమాత్రం తెరిచాననీ, కేకవేసింది తనకారు ముందరి చక్రాలకింద మృత్యువుతో పోరాడుతున్న ఆపన్నెండేళ్ళ కుర్రవాడనీగ్రహించి, గబగబా కారు దగ్గరికి ఆత్రంగా వస్తున్న పళ్ళమ్మిని గమనించి, కనుబొమలు ముడిచి, కారుతలుపు తెరచి, నెమ్మదిగా మేనెల మధ్యాహ్నపుఎండలో తళతళా మెరుస్తున్న బూటుకాలును జాగ్రత్తగా రోడ్డుమీద మోపాడు.

కారుదిగిన సేట్‌జీ రక్తం మడుగులో బోర్లాపడివున్న కుఱ్ఱవాణ్ణి వెల్లకిలా తిప్పబోయి, ఆగిపోయి, ఖరీదైన చేతివేళ్ళతో శ్వాస పరీక్షించి, అది ఎప్పుడో ఆగిపోయిందని తెలుసుకుని, గాబరాగా పరిసరాలను పరీక్షించి రోడ్డు నిర్మానుష్యంగావున్నదని గ్రహించి, తమాయించుకుని, పళ్ళమ్మినీ, కాస్తదూరంలో బోర్లా పడివున్న అల్యూమినియం గిన్నెనూ, నిర్జీవంగాపడివున్న కుఱ్ఱవాణ్ణీచూస్తూ ఏంచేయాలో దిక్కుతోచక నిల్చున్న సమయంలో—

మసీదు ముంగిట కునికిపాట్లుపడుతున్న కుర్రివాని తండ్రి కళ్ళుతెరచి ఎదురుగా కనిపిస్తున్న దృశ్యాన్నిచూసీ నమ్మలేక, మరోమారు కళ్లునులుపుకుని చూసి, తను కలగనటంలేదని నిర్ధారించుకుని, తూలుతూ లేచివచ్చి బావురుమని ఏడుస్తుండగా—

అదివిని అంతవరకు మసీదు ఆవరణలో ఈగల్తో వేగలేక అవస్థపడుతున్న తల్లి ఏమయిందోనన్న ఆత్రింలో— తన కురుపులనుండి వచ్చే కంపు భరించలేక జనం తంతారేమోనన్న భయంకూడా విస్మరించి లేనిశక్తిని కూడగట్టుకొని కారువద్దకొచ్చి, ఎదురుగా కనిపిస్తున్న కొడుకుశవాన్ని. ఏడుస్తూకూర్చున్న మొగుణ్ణీచూసి, కళ్లుతిరిగి, నిలదొక్కుకోలేక కుప్పలా కూలిపోయి, మెల్లగాతేరుకుని, వాడు తననూ, తనమొగుణ్ణీ ఎలాపోషించుకువస్తున్నదీ పేరుపేరునా ఏకరువుపెడ్తూ, రాగాలుతీస్తూ ఏడుస్తూవుండగా.

పళ్ళమ్మి ఆ దృశ్యంచూసి ఏమీ పాలుపోక బిత్తరచూపులు చూస్తూవుండగా,

సేట్‌జీ అసహనంగా పచార్లుచేస్తూ, వాళ్లకు ఎలా సర్దిచెప్పాలో అర్థంకాక, ఈ అరుపులువిని ఎవరైనా వస్తారేమోనన్నభయంతో మెల్లగా ఉడాయిద్దామన్న ఆలోచనలో వుండగా—

అప్పుడే—

పక్కసందులో దొంగసారాకొట్టు నర్సిగానివద్ద తన 'మామూలు'పుచ్చుకుని మలుపుతిరిగి కానిస్టబుల్, అల్లంతదూరంలో జరిగే గొడవవిని, నిల్చున్నకారునుచూసి,

గబగబా కళ్లుపూపుకుంటూ నడచివచ్చి, కుఱ్ఱవాని శవాన్నీ, కుమిలి కుమిలి ఏడుస్తున్న ముసలి బిచ్చగాళ్ళనూ, బిత్తరపోయిచూస్తున్న పళ్ళమ్మినీ, చిరాకుగా మొహం చాటు చేసుకుని కడుపులో కలవరం బయటపడనివ్వకుండా దర్జాగా చుట్టకాల్చుకుంటున్న సేట్ జీని, అతని పొడుగాటి శిల్కులాల్చీ జేబులో లీలగా కనిపిస్తున్న నోట్లకట్టల్నీ, రక్తంతో తడిసినకారు మడ్ గార్డ్ నూ, చక్రాల్నీ మార్చిమార్చి చూసి పరిస్థితిగ్రహించి, సేట్ జీ లాల్చీజేబువైపు లాగుతున్న తనచూపుల్ని అదుపులోపెట్టుకుంటూవుండగా—

జేబులోని నోట్ బుక్ నూ పెన్సిలునూతీయడానికి ఉద్దేశపూర్వకంగా ఆలస్యం చేస్తున్న కానిస్టబుల్ ఇంగితం అనుభవశాలియైన సేట్ జీ సులువుగా గ్రహించి, సైగచేసి పక్కకుపిలిచి, ఏదోచెప్పాలని నోరుతెరచిన పళ్ళమ్మిని మాట్లాడకుండా తమతో రమ్మని హెచ్చరించి, ముగ్గురూ కొంతదూరం వెళ్ళి కూడబలుక్కొని తిరిగివచ్చి, ఇంకా రాగాలుతీస్తూ పడివున్న కుఱ్ఱవాడి తలిదండ్రులను గద్దించి, కుఱ్ఱవాడే వస్తున్న కారును లెక్కపెట్టకుండా రోడ్డుకడ్డంగా పరుగెత్తి కారుకిందపడ్డాడని పళ్ళమ్మి సాక్ష్యంచెప్పగా, ఆవిషయమే కానిస్టబుల్ వ్రాసుకుని, కుఱ్ఱవాడి తలిదండ్రులను చూళ్ళకఱ్ఱతోఅదలిస్తూ మరోమారు గద్దించి, అంతకుముందే కార్లోకూర్చుని స్టార్ట్ చేయడానికి సిద్ధమైవున్న సేట్ జీకి ఒత్తుగావున్న జేబును తృప్తిగా తడుముకుంటూ సెల్యూట్ చేయగా, సేట్ జీ చిరునవ్వుతో కారుస్టార్ట్ చేసి రివర్సుగేర్ లో కొంతదూరంనడపి, కొళాయిపక్క ఆపి, డిక్కీతెరచి, డబ్బాతీసుకుని, కొళాయిగుంతలో ఆగిన నీటితో రక్తం మరకలు కడగ డానికి మొదలెడుతుండగా, పళ్ళమ్మి గబగబావచ్చి తనే మరకలన్నీ శుభ్రంగాకడిగి డబ్బా అందిస్తున్నప్పుడు ప్రయత్నపూర్వకంగా ఖరీదైన తన మునివేళ్ళు పళ్ళమ్మిచేతికి తాకించి ఆ అనుభూతికి మైమరచి, వెంటనే తెలివితెచ్చుకుని, గిరుక్కున తిరిగి వెళ్ళి పోతున్న పళ్ళమ్మికేసిచూసి నిట్టూరుస్తూ— ఇది సమయంకాదని కారు స్టార్ట్ చేసి, వుంగ రాలు సింగారించుకున్న వేళ్ళతో స్టీరింగ్ వీల్ ను నుతారంగా తిప్పుతూ నెమ్మదిగా కదిలి పోయాడు కారులో సేట్ జీ.

సాబ్ స్టప్:— రోగంతో లేవలేనిస్థితిలోవున్న తల్లినీ, నిస్సహాయుడైవున్న తండ్రినీ, ఇంతవరకు ఎన్నెన్నో వేషాలువేసి, డ్యాన్సులుచేసి, డబ్బుసంపాదిస్తూ ఎలాగో పోషి స్తున్న కుఱ్ఱవాడు, పసివాడు, పన్నెండేళ్ళవాడు, రాజుకుంటున్న బూట్ పాలిష్ సెట్ కొనుక్కోవాలనే కోరిక నెరవేరకముందే— కొత్త '66 మాడల్ ఫియట్ కారుకిందపడి, రేసెస్ లోగెల్చిన పాతికవేల సంబరంకిందబడి, బోట్ క్లబ్ లో మిసెస్ మాలిని గులాబీ రేకుల్లాంటిచేతుల్లో నలుగుతున్నట్లు వూహించే వూహలకిందపడి, పళ్ళమ్మి యవ్వనాన్ని గూర్చిన తలపులకిందపడి, కరుకైన వజ్రపుటుంగరాలూ, నున్నగా తళతళలాడేట్టు

పాలిష్‌చేయబడిన బూట్లూ నడుస్తున్న అపమృత్యువు వాతపడి, సేట్‌జీ లాల్చీజేబులోంచి కానిస్టేబుల్ దఃసరి నిక్కరుజేబులోకీ, పళ్ళమ్మి చిరుగుల జాకెట్ మరుగుకూ బదిలీఅయిన నోట్లకిందపడి, పళ్ళమ్మి చెప్పిన ఒకేఒక అబద్ధంకిందపడి, కానిస్టేబుల్ గద్దింపులకిందపడి, అల్యూమినియం గిన్నె దూరంగా జారిపడినా పావలానాణెం కింద పడిపోకుండా బిగించిన పిడికిలితో అలాగే చనిపోయాడు.

కిటికీవద్ద నిల్చున్న రచయిత కిటికీతెర వేసి వెనక్కువచ్చి ఫోల్డింగ్‌కుర్చీలో కూర్చుని అంతకుముందే తెరచివుంచిన ఫౌంటన్‌పెన్‌తో ఏదో వ్రాయడానికి వుపక్రమించాడు, కాని పాళీ ఎప్పుడో ఆరిపోయింది, విసుగ్గా విదిలించాడు. చారలు చారలుగా సిరా కక్కింది కలం.

కథ

వేళ్ళు

పింగళి రంగారావు.

వార్డు జోగుతూ నిద్రపోతున్నట్లుగావుంది. రాత్రికూడా అట్టేకాలేదు. అరచి అరచి పేషంట్లు మగతగా నిద్రపోతున్నారు. అక్కడో లైటు అక్కడో లైటు మబ్బుగా వెలుగుతున్నాయి. దూరంగా అరగంటకో నర్సు వార్డు ప్రక్కనుంచి అగుపడి మాయమౌతోంది. గతరాత్రిలా వార్డులో అలజడి లేదు. పదిగజాల దూరంలో నుండీ పిల్లలు కొట్లాడుతున్నట్లుగా పిల్లలవార్డునుండి అరుపులు వినొస్తున్నాయి—

నిద్రపోతున్నవాళ్ళెవరో లేపుతున్నారు. అస్పష్టంగా మూల్గులు.

విసుక్కుంటూ లేపేవ్యక్తి "మందు" అంటోంది—

తాను విసుక్కుంటూ ప్రక్కకు తిరిగాడు.

"మందు త్రాగండి."

విషంలా మ్రింగాడు. మళ్ళీ చెదిరింది నిద్ర. అవే ఆలోచనలు. గొంతులో సెగవేస్తున్నట్లుగావుంది. తానింతటి దురదృష్టవంతుడౌతాడని కలలోకూడా అనుకోలేదు.

వసంత ఇంట్లో ఏంచేస్తోందో— ఏంచేస్తుంటుంది, నానిబుజ్జిని గుండెల కత్తుక్కుని ఏడుస్తుంటుంది. దిక్కులేని దేవుళ్ళకు మొక్కుతూ వుంటుంది. వేంకటేశ్వ

రునికి ముడుపుకడుతానంది— కట్టిందో! తెల్లవారేసరికి కొబ్బరికాయలు కొడుతానంది. కొడవటంచగుళ్లో తడిబట్టలతో ప్రదక్షిణాలు చేద్దామంది— చల్లగావుంటే సత్యనారాయణ వ్రతం నోముకుందామంది. వెక్కి వెక్కి ఏడ్చింది,

వసంతను మించిన దుఃఖం తనకొచ్చింది. ఏంచేద్దాం. విధిబలీయం— అనే గుండెనిబ్బరంగాని, ఓపికగాని తనలో లేవు.

ఆ సాయంకాలం తనను చూడటానికి యెందరో వచ్చారు. స్నేహితుల సంఖ్యకు లెక్కలేదు. ఆ రెండుగంటలసేపూ వస్తున్నారు, పోతున్నారు. నవ్వుతూ మందలించేవాళ్లు. తేలిగ్గా పెదవులతో పైపైన్నే అదోరకపు సైగలతో పలకరించేవాళ్లు. బంధువులో!....

వాళ్ళూ వచ్చారు. ఓస్! ఈపాటికే యింత యిదైపోవాలా!

"వాడు మొదటినుండీ పిరికే." అంటున్నారు.

తనతోడుగా జీవిస్తున్న భార్య వెక్కి వెక్కి ఏడుస్తూంది— పదిమంది ఉమ్మడిగా గొంతు ఎత్తి దానిమీద మాటలతో విరుచుకపడ్డారు. అంతకుతగ్గ బొంతే అని యీసడించారు. జారిన తన కన్నీటితో వసంత కన్నీరు ఏకమైనట్లుంది.

గొంతుదాటి రాలేనిమాటలు లోపలికే జారుకుంటున్నాయి. కళ్ళతో మందలిద్దామన్నా కంటినిండా నీరు.

చేతులతో సంజ్ఞచేద్దామనుకుంటే....

ప్చ్. అంత అదృష్టమా!

ఈక్షణంతో తాను ఆ అదృష్టాన్ని కోల్పోయాడు.

తలచుకుంటేనే గుండె చెరిమైపోతోంది.

తన వేళ్ళు!....

"వసంతా! ఈ వేళ్ళతో నీకన్నీటిని ఎలాతుడవను! ఊరుకొమ్మని నీతలను ఎలా నిమురను!"

"అమ్మో"—

వార్డులో అంతా ఉలిక్కిపడ్డారు. తాను ప్రక్కకు తిరిగిచూశాడు.

నర్సు పరుగెత్తుకుంటూ వచ్చింది,

ఉన్నపలంగానే వాంతిచేసుకుంటున్నాడు ప్రక్కబెడ్ వాడు.

నర్సు 'ఇంజెక్ట్' చేస్తోంది. చూడలేక కనులు మూసుకొని తాను పక్కకు తిరిగాడు.

"పక్కబెడ్‌వాడు బ్రతికేనమ్మకం లేదు."

రెండోపక్కవాడు తనతో అంటున్నాడు,

రెండోప్రక్కవాణ్ణి పరికించి చూశాడు.

ముఖమంతా కాలిపోయింది. వాడు అంతకుక్రితమే చెప్పాడు మూకుడులోని నూనె లేచి ముఖంపై పడిందని.

వాడు నవ్వుతున్నాడో, ఏడుస్తున్నాడో కూడా తెలియటంలేదు.

వాడి మాటలవల్ల ఊహించాల్సిందే!

బ్రతికి బైటపడ్డానన్న సంతోషమే అయివుంటుంది—

లేకుంటే, ఆ పళ్లు ఎందుకు యికిలిస్తున్నాయి!

తన్నుచూసి అదృష్టవంతు డన్నాడు,

ఆ మాటకు తాను ఎన్నిసార్లు ఏడ్చాడో!

ముఖంకాలిన వ్యక్తిని చూసి వసంత ఉలిక్కిపడింది. బెరుగ్గా తనవైపు చూసింది. వాడేనయం— అన్నట్లుగా చూశాయి తనచూపులు, వసంతను మళ్ళీ ఏడ్పించాడు తాను!

ప్రక్కకు ఒత్తిగిల్లాడు. కుడిచేతి నరాలన్నీ లాగుతున్నాయి. శారీరకమైన బాధకంటే, తనలో మానసికయుద్ధమే అంతకంతకూ చెలరేగుతోంది.

"ఏడుస్తున్నావురా!" తనకు తోడుగావున్న ఉపేన్ బుజ్జగించాడు,

తలగడలోకి దూరి కుమిలాడు,

చివరిసారిగా వేళ్లను తడుముకున్నాడు,

తన వేళ్ళు!.... ....

*　　　*　　　*

ఆజంజాహి మిల్లుకు టైం అవుతోంది.

హడావిడిగా తయారై మెట్లుదిగుతున్న తన కాళ్ళను రెండుచేతులా వాటేసుకున్నాడు నాని బుజ్జి. ఏమరుపాటులోవుంటే, ఈపాటికి తాను చివరిమెట్టుక్రింద మరో మెట్టులా అడ్డంగా పడిపోయేవాడే. కొద్దిలో తప్పింది. ఎంతకూ చేతులనుసడలించడు బుజ్జి. ముద్దుపెట్టుకొని, అమాంతంగా తన చేతులతో పైకెత్తుకున్నాడు, బుజ్జి భుజం కొరుకబోతే, వాడిని ఆపేప్రయత్నంలో తన వేళ్ళు నానినోటిలో చిక్కాయి. వేళ్ళను కటుక్కున కొరికాడు. కోపంతో, బాధతో తాను బుజ్జివెన్నుపై ఒక్కచరుపు చరిచాడు. పెంకులెగిరిపోయేలా నాని బుజ్జి గొంతెత్తాడు.

వంటింట్లోనుండి ఏదో కొంప మునిగిపోయిందన్నట్లుగానే వసంత పరుగెత్తు కొచ్చింది. అమ్మను చూసేసరికి వానిగొంతు హెచ్చుస్థాయిలోకి వెళ్లింది. ఇల్లంతా తిరుగుతూ బుజ్జగిస్తోంది, చాక్లెట్లడబ్బానే కుమ్మరించింది. ఎన్నో బొమ్మలు ముందు వేసింది. అదే ఏడ్పు! రా అమ్మా– రా నాన్నా– అంటూ తాను చేతులు చాచాడు. ఏడుస్తూనే తన చేతులపై వాలిపోయాడు. బుజ్జిని భుజానవేసుకొని జోకొడుతూ తాను యిల్లంతా తిరిగాడు లయగా తన వేళ్ళు బుజ్జి వెన్నుమీద ఆడుతున్నందుకు ఏడుస్తూ ఏడుస్తూనే కళ్లుమూసుకున్నాడు పిచ్చితండ్రి.

విసుగుతో. కోపంతో కొట్టిన వేళ్ళు–
లాలిస్తూ ప్రేమగా బుజ్జిని నిద్రపుచ్చే వేళ్ళు–
తనవేళ్ళు!— —
"మిల్లునుండి ఎప్పుడొస్తారు."
అంది వసంత కైముడిని సవరిస్తూ–
"రాత్రి పదింటికి "
ఊ– అంది బుంగమూతి పెడుతూ.
"ఏం! పెందరాళే రావాలా! నాయిష్టంవచ్చినప్పుడే పోవటం, రావటమా–"
"రావాలనుకుంటే రాగలరు."
"ఏలాగో!"
"నాకళ్ళల్లోకి చూసి చెప్పండి. వస్తారుగా!"

నవ్వుతూ వసంత చెక్కిళ్లను నిమిరాడు. తన వేళ్ళలో ఏం స్పర్శవుందో గోముగా తనమీద వాలింది. తలంటుకొని నొదులుగా ముడివేసుకున్న వసంత వెంట్రుకల్లో తాను మల్లెల మాలను తురిమాడు. ఆప్యాయంగా వసంత తన కళ్లలోకి గుచ్చి చూస్తూ తన వేళ్లను ముద్దుపెట్టుకుంది.

ఆనందాన్ని తట్టుకోలేక వసంత చెక్కిళ్ళపై చిరుదెబ్బవేసిన వేళ్ళు– (ఒకప్పుడు కోపంలో, విసుగులో, గృహసమస్యలతో– వసంత చెక్కిళ్లను గట్టిగా మందలించిన వేళ్ళే–)

మిల్లుకు హడావిడిగా బైటపడుతూ కూడా మాటి మాటికి తన యింటి మూల మలుపు తిరిగేదాకా, వసంతా, బుజ్జిలు కడపలో నిల్చుంటే బై బై చెప్పుతూ గాలిలో చేయి ఊపాడు.

చల్లని వేళ్లు, ప్రేమతో బుజ్జగించే వేళ్లు–
తనవేళ్ళు!.... ....

బస్‌స్టాండ్‌లో బస్సు ఆగింది. అరగంటకో బస్సుగాని రాదు. మనస్సు, మనిషి శరీరం మొత్తం బస్సుకోసమే త్రొక్కులాడుతుంది. వేరే ఆలోచనలే వుండవు. ఎప్పుడో ఒకప్పుడుగాని బస్సురాదు. కురుక్షేత్రం జరుగబోతున్నట్లుగా రద్దీ– ఒకర్నొకరు తోసుకోవడం– మళ్ళీ మామూలు, బస్సు వెళ్ళుతుంది. అయినా తీరిగ్గా ఊపిరి తీసుకొనే వీలుందా. తొడుక్కున్న చెప్పులను మనకు తెలియకుండానే లాగివేసే పాలిష్‌చేసే కుర్రాళ్ళు. ఎంత కసురుకున్నా వింటేగా!

బస్‌స్టాండ్‌లో ఎల్లప్పుడూ నిల్చుని బిచ్చమెత్తుకొనే పోశిగాడు. పైస యివ్వకుంటే బస్సుకిందపడి చస్తానంటాడు, వాడంటే తనకు ఎంతోయిష్టం. వాడు రోలరులా తన ఆకారంతో అక్కడినుండి పరుగెత్తుకొస్తున్నాడంటే, అనుకోకుండానే తన చేతులు జేబుల్లోకి వెళ్ళిపోతాయి. (ఆత్మహత్య చేసుకుంటాడేమో అని).

వాడిమీద తనకు అదోరకమైన వెఱ్ఱిప్రేమ. తనకాళ్ళను వంగి ముద్దుపెట్టుకొనే పోశిగాడంటే తనకు జాలి.

తన చేయి దయగలదంటాడు,
పిచ్చిగా దినం తన చేతివేళ్ళను ముద్దుపెట్టుకుంటాడు–

ఆఫీసులోకి అడుగుపెట్టగానే మొట్టమొదటిసారిగా తనకు అగుపించేది శివరావు. తన రాకకోసమే ఎదిరిచూస్తాడేమో! చూపులనిండా విషం!

మనిషి యికిలించి నవ్వుతుంటే, ఒళ్లంతా కదులుతుంది, పెదవులు మోటుగా, లావుగా వుంటాయి. దరహాసమన్నది వాణి ముఖంమీదలేదు. తనమీద శివరావుకు ఎందుకో పగ? మొదటినుండీ గిల్లికజ్జాలే!

ఎన్నోసార్లు తాను శివరావువల్ల నష్టపోయాడు, మానసికంగాకూడా తాను కృంగిపోయాడు, తనమీద ఎన్నో 'కంప్లేంట్స్' చేశాడు, తనదంతా 'మిస్ అప్రాప్రియేషన్'గా దుమారంలేపాడు. ఆ సుడిగాలినుండి తప్పుకోవడానికి తనకు కొన్నివందలైనా అయివుంటుంది....

శివరావ్, నీకిది న్యాయంకాదంటే పళ్ళు బైటపెట్టి ఛ. నేనలాంటివాన్ని కాదోయ్– అంటాడు.

వాడినిచూసేసరికి తన వొళ్లంతా మండుతుంది, ఎన్నడో ఒకరోజు శివరావువల్ల తన ఉద్యోగంకూడా వూడిపోతుంది. తన బ్రతుకు బజారుపాలవుతుంది, తనతో కలసి మెలసి తిరుగుతూనే, తనకిందకి నీళ్ళు తెస్తున్నాడు. 'శివరావ్! నిన్ను ప్రాణాలతో వదులుతానా!'– వాడిముఖం జ్ఞాపకం వచ్చేసరికి ఒళ్లంతా కాగిపోతుంది.

నరనరం పొంగిపోతుంది. తన ఈ చేతులతో శివరావ్‌గొంతు నులిమెయ్యాలి. చిత్రహింసలు పెట్టాలి........ పిడికిలి బిగుసుకపోతుంది. ఆవేశంతో తనవేళ్ళు వొణికిపోతుంటాయి.

ప్రతీకారంకోసం, అవకాశంకోసం వేచివున్న తన చేతులు.... ....

వెక్కి వెక్కి ఏడ్చాడు తాను,

"ఏంరా! భయపడుతున్నావా?" ఉపేన్ అడిగాడు.

లేదంటూ తలవూపాడు మౌనంగా.

"ఛ! ఈమాత్రిందానికే భయపడాలిరా! వేళ్ళ ఆపరేషన్‌కే యింత యిదై పోతే, నీపక్కబెడ్ వాడు ఏమైపోవాలి! మిషన్‌లో నీచేయి పడటమే లక్కీఅనుకో! ఏ కాలో మరేదో యిరుక్కుపోతే ఎలావుండు? 'ఆఫ్టరాల్ ఫింగర్స్'–" అన్నాడు.

"ఒరేయ్! మరేమైనా బాధపడకపోదు. నేను బ్రతికివుండికూడా లాభంలేదు. చచ్చిపోతేనే అదృష్టవంతుణ్ణి.

"మరీ ఇంత పిరికివాడవటోయ్!" అంటున్నాడు ముఖం కాలిన వ్యక్తి.

"చేతివేళ్ళు తెగిపోతున్నందుకే బాధపడుతున్నావ్! జీవితంలో ఎంత మంది ఎంత విలువగలవాటిని కోల్పోయారు. ప్రపంచాన్ని తృప్తిగానైనచూడలేక మధ్యలోనే కళ్ళుపోయిన వాళ్ళున్నారు. మొండికాళ్లతో బ్రతుకుతున్నవాళ్లున్నారు. నిజం చెప్పాలంటే, పురుషత్వాన్ని కోల్పోయికూడా, చావలేక బ్రతుకుతున్న వాళ్ళున్నారు. ఒకప్పుడు నేనెంతో అందగాణ్ణి.... నారూపాన్నిచూసి నేనే మురిసిపోయేవాణ్ణి. కాని, ఈరోజు– ఎలావున్నాను? అసహ్యంగా లేనూ? నీకేకాదు. నామీద నాకే అసహ్యం కలుగుతోంది! అంటూ మరోపక్కకు తిరిగాడు. కన్నీటిని తుడుచుకుంటున్నాడేమో-

వేళ్లు తెగిపోతున్నందుకు తాను బాధపడొద్దా!

ఏదిలేకుంటేనేం, వేళ్లులేకుండా ఎలా జీవించడం!

ఈ వేళ్ళే ప్రతి సృష్టికి రూపాన్నిస్తున్నాయి–

ఈ వేళ్ళే ప్రతి రూపాన్ని నాశనం చేస్తున్నాయి–

శాంతిని ప్రసాదించే చల్లని వేళ్లు!

క్రాంతిని రెచ్చగొట్టే బలమైన వేళ్లు!!

పసివాణ్ణి లాలించే అప్పుడు, సుకుమారమైన గులాబిని భార్య సిగలో పెడుతున్నప్పుడు, కోపంలో బుజ్జగిస్తున్నప్పుడు, ప్రేమతో నిమురుతున్నప్పుడు, కసిలో శివరావుపై ప్రతీకారం తీసుకోవాలనుకున్నప్పుడు– తన వేళ్ళే తనకంటె ముందుగా మమతను, విముఖతను తెల్పాయి!

వసంతా! ఈ ప్రపంచం ఒక్క బ్రతుకటాన్నే నేర్చుకుంది. మొండిగా నైనా జీవించాలట. మనిషికి ఏది లోపించినా లెక్కచేయని లోకం! జీవించటానికి ఏ అడ్డము లేకుంటేచాలు ఈ మనుషులకు— ....

ఈ చేతులను ఎందుకు సృష్టించాడు భగవంతుడు?

అందాన్ని సృష్టించటానికి, మంచిని ఎత్తిచూపటానికి, చెడును నిర్మూలించటానికి కాదూ?

బ్రతికివుంటే బలుసాకు కూర తినొచ్చట!

తన వొక్కనికి లేకుంటేనేం, లోకంలో అందరికీ వేళ్ళున్నాయిగా! అదే ధైర్యమైవుంటుంది లోకానికి!

తెల్లవారింది.

నడిపించుకుంటూ తనను ఆపరేషన్ థియేటర్‌కు తీసుకెళ్లుతున్నారు—

(కాళ్ళులేకుంటె 'స్ట్రెచర్' మీద వెళ్ళకపోదూ!)

వసంతా, నానిబుజ్జి, స్నేహితులు, బంధువులు, శివరావు అంతా వరుసగా నిలుచున్నారు.

అందరి ముఖాలు ప్రశాంతంగా వున్నాయి.

డాక్టర్ క్రిష్ణారావు 'వెరీ మైనర్ ఆపరేషన్' - అన్నాడని మిత్రుడంటున్నాడు.

మైనరా!

సృష్టి ఆగిపోయే సంఘటన!

ప్రపంచం మునిగిపోయే దుస్థితి!

కాదూ.... కాదూ....

అందరి వేళ్ళూ ఒక్కసారిగా తెగిపోనీ! ఆలోచించరేం! యింకా మనం జీవిద్దామనే అంటారా?

భార్యకదూ, ఆడది— అందుకని ఏడుస్తున్నదేమో.

చివరిసారిగా తన తృప్తికోసం నరాలన్నీ ఓవైపు ప్రాణంతీసేలా లాగుతున్నా 'బై' చెప్పుతూ గాలిలో చేయిఊపాడు.

ఆపరేషన్ టేబిల్ మీద పడున్నాడు.

డాక్టర్ చేతుల్లో 'స్కాల్‌పెల్'

అసిస్టెంట్ చేతుల్లో కత్తెరవుంది—

అనెస్థీషియన్ చేతుల్లో ఇంజక్షన్

నర్స్‌చేతిలో గాజ్‌వుంది—

ఎన్ని.... ఎన్ని.... ఎన్ని వేళ్లు!

తనవేళ్ళను తెగ్గొట్టటానికి ఎన్ని వేళ్ళు—?
తనవేళ్లో!
కళ్ళు మూసుకొమ్మన్నారు.
నర్సువేళ్ళతో తన కళ్ళను మూసింది.
ధర్మంగల వేళ్ళు—
నర్సు! నీవి చల్లని వేళ్ళు.

నాకునచ్చిన ఇద్దరు కథకులు

సోదుం రామమోహన్.

ఆంధ్రదేశంలో బోలెడు కథారచయితలు, రచయిత్రులూ వున్నారు. కానీ నాకుమాత్రం ఇద్దరు కథకులే నచ్చారు.

వారు నాకెందుకునచ్చారో తెలిపేందుకు ప్రయత్నిస్తాను.

సాహిత్యం ఒకకళ. కథారచన వివిధ సాహితీ ప్రక్రియల్లో ఒకటి. సాహిత్యం విభిన్న సమకాలీన పరిస్థితుల్ని ప్రతిబింబించితీరాలని నా అభిప్రాయం.

యాంత్రికయుగంలో బ్రతుకుతూ, యాంత్రికయుగ సౌఖ్యాలనీ, సౌలభ్యాలనీ అడుగడుగునా అనుభవిస్తూ పాతకాలపునీతుల్నీ, ఆర్షధర్మాలనీ, ఫ్యూడల్‌యుగ ధార్మిక నైతికవిలువలనీ రచించే కవులన్నా, రచయితలన్నా నాకయిష్టం.

సాహిత్యానికి పలురకాల ప్రయోజనాలని అంటకట్టారు, అంటకట్టుతున్నారు. నా దృష్టిలో సాంఘిక ప్రయోజనాలని సాధించని సాహిత్యం అడవిగాచిన వెన్నెలేఅవుతుంది. సాహితీకారుడు తన కళద్వారా పాఠకుని చైతన్యాన్ని ప్రేరేపించి, సామాజిక సువ్యవస్థకు బాటలువేసేలా చేయడం అత్యవసరం.

సాంఘిక ప్రయోజనాన్ని ఆశించి, రచన సాగించే కథారచయితలను వేళ్ళమీద లెక్కపెట్టవచ్చు. సామాజిక ప్రయోజనాన్ని ఆశిస్తూనే, సిద్ధాంతానికి అనవసర ప్రాముఖ్యతయివ్వకుండా, 'కళ'కు ఎట్టి అంతరాయము కలుగకుండా, రచించేకథకులు ఇద్దరే యిద్దరు వున్నారు నాదృష్టిలో. వారు కొడవటిగంటి కుటుంబరావు, రాచకొండ విశ్వనాథశాస్త్రి.

వీరిద్దరూ వాస్తవిక వాదులు, భౌతికవాదులు. మొదట కుటుంబరావుగారిని గూర్చి చర్చిద్దాం.

వీరి ఏకథల్లోకూడా, అతిశయించిన అసాధారణ శృంగారంకానీ, ఊహాత్మక సమస్యలుకానీ, సాంప్రదాయబద్ధ పాత్రచిత్రణకానీ, ఆదర్శప్రాయులైన నాయకీనాయకులుకానీ, ఆత్మాశ్రియ మానసిక సంఘర్షణలుకానీ గోచరంకావు.

వాస్తవికతను, సమకాలీన పరిస్థితులను, చారిత్రిక దృక్పథంతోనూ, objective దృక్పథంతోనూ పరిశీలించి, శిల్పసమన్వితంగా, చైతన్య ప్రేరేపితంగా కథారచన చేయటంలో ఈయన సిద్ధహస్తుడు.

ఒక సంఘటనను తీసుకొనికానీ, Situation ను తీసుకొనికానీ, లేదా నేటి మధ్యతరగతి జీవనంలోని ఒక సెంట్‌మెంట్‌ను తీసుకొనికానీ మంచినీళ్ళ ప్రాయంగా, శిల్పసమన్వితంగా కథలురాసే పరిణతి ఆంధ్రలో వీరికొక్కరికే వుందనిపిస్తుంది, మధ్యతరగతి జీవనంలోని వెలుగుచీకట్లను వివిధకోణాలనుండి స్పృశిస్తాయి వీరికథలు.

"ఒంటిస్తంభం మేడ" అనేకథలో వీరు మధ్యతరగతిజనుల సంస్కారాన్నీ, నైతికవిలువలనీ, వారి మానసిక ధోరణులనీచిత్రిస్తూ, మధ్యతరగతి జీవుల నీతిమేడకు ఒకే ఒకస్తంభంవుంది, ఆ స్తంభం—డబ్బు అని శిల్ప సమన్వితంగా చెబుతారు. నైతిక విలువలకుకానీ, మరే విలువలకుకాని అస్తిత్వంలేదు, అవి యెప్పుడూ సమకాలీన చారిత్రిక, ఆర్థిక, సామాజిక పరిస్థితులపై ఆధారపడి వుంటాయని ఈ కథద్వారా చెబుతూనే, ఏతత్ మధ్యతరగతి జీవన కుసంస్కారాన్ని (చెహోవ్‌లా సున్నితంగా)మందలిస్తూ పాఠకుని చైతన్యాన్ని ప్రేరేపిస్తాడు. అదీ ఆయనలోవున్నకళ. అదీ ఆయనలో వున్న శిల్పం. అదీ ఆయన సాధించదలచిన సాంఘిక ప్రయోజనం.

'ఉద్యోగం' అనే మరోకథలో (మామూలు కథల్లోలాగా) నాయకీ నాయకులు కానీ, సంఘటన పరంపరకానీ, కన్నీళ్ళ ప్రవాహాలుకానీ, పాత్రచిత్రణకానీ-ఏవీలేవు. నిరుద్యోగుల విచిత్ర మానసిక ధోరణులు, ప్రస్తుత సమాజంలో డబ్బుకున్న విలువ, ఆ డబ్బును సంపాదించేందుకు మనుషులుచేసే విపరీత ఆలోచనలతీరు— ఇవీ ఆ కథలో మనకు దర్శనమిస్తాయి. ఈ కథ చదివినవెంటనే మనకు యీ కథలో కథాతత్వం గోచరించదు. డబ్బు— వ్యాపారధోరణి— నిరుద్యోగులపైన రాసిన ఒక విశ్లేషణాత్మక వ్యాసంలా కనబడుతుంది. కానీ కొంచెం లోతుగా పరిశీలిస్తే యీ కథలో నిక్షిప్తమైన శిల్పం— వివిధవిషయ సాక్షాత్కారం— మనకు అవగాహన అవుతాయి.

'నిరుద్యోగం' అనే వీరి ఇంకోకథకూడా చాలా బావుంది.

ఈ కథలోకూడా, కథాగమనానికికానీ, కథాతత్వానికికానీ ఎట్టి లోపం కలుగకుండనే, ప్రస్తుత సమాజంలోని ముఖ్య సమస్యల్లో ఒకటైన నిరుద్యోగ సమస్యనీ,

మధ్యతరగతి జీవుల self-complccancy నీ, బ్యురాక్రసీని కళాత్మకంగా పాఠకుని కళ్ళముందుంచుతాడు.

"స్వర్గంలో బందీలు" అనే వీరి ఒక కథ యీ మధ్య ఆంధ్రజ్యోతి వార పత్రికలో వచ్చింది

ప్రకాశం అనే ఒకయువకుడు మద్రాసువిడిచి బతికేందుకు బొంబాయివెళ్తాడు. కొన్నాళ్ళకు రిట్రెంచ్‌మెంట్‌మూలాన వుద్యోగం వూడుతుంది. కానీ ప్రకాశంమాత్రం బొంబాయి వదలలేడు. అక్కడున్న ఆకర్షణలు అతన్ని వదలనీవు. అక్కడ వుండి, సౌఖ్యాలు అనుభవించనూలేడు. ఆ పాత్రది ఎంతో దయనీయస్థితి. అతడు స్వర్గం లాంటి బొంబాయికి బందీ.

ఈ కథ చదివినవెంటనే, తెలివైన పాఠకుడెవడైనా నేటి సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులను ఆలోచించకుండా వుండలేడు. అలా పాఠకున్ని ఆలోచింప చెయ్యటం, చైతన్యవంతున్ని చెయ్యటం ఆయన ముఖ్య ఆశయం. ఆయన తన రచన ద్వారా ఆశించే, సాధించే సామాజిక ప్రయోజనం అదే. కుటుంబరావుగారు ఎప్పుడూ సత్యాన్ని కేవలం ఒక అస్తిత్వమున్న 'సత్యం' లా చూడక పోవడమే ఆయన మేధకు తార్కాణం.

ఇక రాచకొండ విశ్వనాధశాస్త్రిగారినిగూర్చి కొద్దిగా చర్చిద్దాం.

రా.వి. శాస్త్రిగారు ప్రతిభావంతులైన కథకులు. వాస్తవికత, మౌలికత, శక్తి వంతమైన శైలి. జీవితాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన అనుభవం— వీరికథల్లో మనకు కన బడే విషయాలు.

"రొట్టెముక్క"అనే కథలో రెండు పేదపాత్రల్ని, నాలుగైదు ధనికపాత్రల్నీ సృష్టించి, ఆ పాత్రల్ని సాపేక్షదృక్పథంతో పరిశీలించి, ఒకగొప్ప Social contrast ను సాక్షాత్కరింపచేశారు—

సమాజాన్ని, విభిన్న పరిస్థితుల్ని objective దృక్పథంతో చూడటం వీరి సహజ ప్రవృత్తి.

ఈ కథ శోకరస ప్రాధాన్యతకలది తిండికి లేక మలమలమాడే యిద్దరు అన్నదమ్ములు భీకరంగా, బాధగా, ఆగ్రహావేశాలతో ఒక రొట్టెముక్కకోసం పోరాడే దృశ్యాన్ని యీకథలో వర్ణించినతీరు నేను మాటల్లో చెప్పలేను.

'మెరుపు మెరిసింది' అనే మరోకథలో ఒక సామాన్య పంతులమ్మ నిరాశా, నిస్పృహా, నిరుత్సాహా, పేలవ జీవితాన్ని చిత్రిస్తాడు. ఆమె జీవితంలో ప్రేమలేదు, సానుభూతిలేదు, వెలుగులేదు, ఆశలేదు. ఉన్నదల్లా మార్పులేని, మార్పురాని రొటీన్‌వర్కు. ఆ రొటీన్ జీవితంలో, ఆ నిరాశా, నిస్పృహ జీవితవర్షంలో ఒక్క

తూరి ఒకేఒక మెరుపు మెరుస్తుంది. ఒకఅబ్బాయి ఆమెకోతూరి కారులో లిఫ్టుయిస్తాడు. ఆ ఆశాపూరిత సంఘటనే ఆమె సాంద్రతమో జీవితానికి వెలుగుగా, ఒక మెరుపుగా భావిస్తాడు రచయిత.

జీవితం చాలామందికి అందంగా, ఆనందంగా, ఉత్సాహంగా, ఆశాజనకంగా లేదని యీకథద్వారా కళాత్మకంగా, చైతన్య ప్రేరేపితంగా చెప్పడంలోనే రా.వి. శాస్త్రి గారి శిల్పకళావైదుష్యం వెల్లడౌతుంది.

వీరి సారాకథలు నేటి పరిభుత్వంపైన, ఆర్థిక అసమానతలపైన, న్యాయ స్థానాలపైన ఎత్తిన ఖడ్గాలు, ఈ కథల్లో పోలీసుల అకరిమవర్తననూ, న్యాయస్థానాల అంధత్వాన్నీ, ధనవంతుల దౌర్జన్యాలనీ, పేదల కష్టాలను, నేరాలను, వారు అనుభ వించే అనుచిత శిక్షలను మన కళ్ళముందు సాక్షాత్కరింపచేస్తాడీయన.

వీరిదే యీమధ్య 'వెన్నెల' అనే ఒక కథ చూచాను. తెలుగు లాక్షణికు లేమంటారో కానీ, నన్నడుగుతే ఇదో Rhapsody అంటాను.

నిజానికి వెన్నెల ఆనందానికీ, సంతోషానికీ చిహ్నం. కానీ రా.వి. శాస్త్రి గారుమాత్రం వెన్నెలను కేవలం ఒక సాధనగా తీసుకొని ప్రస్తుత సమాజంలోని నిరా శను, నిస్పృహను, భయాన్ని, బాధను, కట్నాలను, పెళ్ళిళ్లను, పరీక్షలను, వేడి నెత్తురునీ— ఇలా సవాలక్ష విషయాలను, సమస్యలను కళాత్మకంగా, కవితాత్మకంగా వ్యక్తంచేయడమేకాక, ప్రస్తుత సమాజాన్ని పాఠకులముందు నగ్నంగా సాక్షాత్కరింప చేసి పాఠకుల నిశ్చల చైతన్యసరివంతిని కదిలిస్తాడు.

ఇక వీరిద్దరినీగూర్చి తులనాత్మకంగా రెండుమాటలు: ఇద్దరూ నా దృష్టిలో కథారచయితలుగా బుద్ధివాదులు, హృదయవాదులు కారు. పాఠకుని హృదయాన్ని స్పృశించాలనే ఆశకంటే, పాఠకుని బుద్ధిని వికసింపచేయాలనే ఆశ వీరికి ఎక్కువ.

'శిల్పం' విషయంలో కుటుంబరావుగారు చాలాజాగ్రత్తతీసుకుంటారు. స్వాభి ప్రాయాలకోసం, సిద్ధాంతంకోసం కథాశిల్పాన్ని ఎప్పుడూ భగ్నంచేయరు వీరు. కథలో ఏ సందర్భంలోనూ 'అనవసరత' ను జొప్పించరు. కానీ వీరికథలలో 'ఆవేశత' (Emotion) లుప్తం, అన్నికళలకూ ఆవేశమే ఆయువుపట్టు. ఆవేశలోపంవల్ల యీయన రచనలు సామాన్యపాఠకున్ని అతిత్వరితంగా ప్రభావితం చేయలేవు

రా. వి. శాస్త్రిగారిలో ఆవేశం ఎక్కువ, నిగ్రహం తక్కువ, అందుకే కొన్నికథలు Imbaiancive గా వుంటాయి. బెర్నార్డ్‌షాలా తన భావాల్నీ, అభిప్రా యాలనీ పాత్రలపై రుద్దబంకూడాకద్దు. కాని వీరి ఆవేశపూరిత కవితాత్మక శైలి పాఠకు లను ముగ్ధుల్ని చేస్తుంది.

కుటుంబరావుగారు ఆంటన్ చెహోవ్ అయితే, రా వి. శాస్త్రిగారు మాక్సిమ్ గోర్కీ.

లోచన్ కవితలు రెండు:

ట్రిగర్ మీద వేళ్ళతో

పదనుపెట్టిన కత్తి అంచులమీద
రక్తాక్షరాలు
ఆహ్వానం అందుకో
ఇరవయ్యేళ్ళ అవమానంలో కాలికాలి
పేలుటకు సిద్ధంగా ఉన్నాను
ట్రిగర్ మీద వేళ్ళతో— రా

దశాబ్దాలుగా యీ పొలాల్లో రెక్కలు విరుచుకున్నా
కడుపులో వో కమ్మని తేన్పు పండించుకోలేని కర్షకుల కడగళ్ళని చూడలేని కళ్ళని
ట్రాక్టర్ యజమానుల ప్రొకెక్టర్లని
నీ రెక్కల కష్టాన్ని పేకాటముక్కల్లో లెక్కిస్తూ
నేటి నిజాయితీనీ. రేపటి విశ్వాసాన్నీ
అంతస్తుల అర్థరాత్రినిషాల్లో. మఖమల్ పరుపుల మత్తెక్కిన పొర్లాటల్లో
పరిహసించే పొగరుబోతుల్నీ
రక్తాన్ని పెట్రోలుగా వాడుకుంటూ షికార్లుపోయే కార్లనీ
మధ్యతరగతి మనిషి మస్తిష్కంలో
హైడ్రోఫోబియా పుట్టించే
ఒకటోతేదీ వడ్డీలెక్కల మార్వాడీ వ్యవస్థనీ
పిల్లల్నేకాదు. నిత్యం కొత్తకొత్త కులాల్నికనే యీదేశం దౌర్భాగ్యాన్నీ
మనిషిమీద మనిషి స్వారీచేసే మారాజుతనాన్నీ
బిచ్చగాళ్ళనీ. పిచ్చితనాన్నీ యీనుతూన్న తీర్థయాత్రల్నీ
ఎక్కడికీ తీసికెళ్ళని. ఎన్నటికీ ఎదగనివ్వని
కోట్లకోట్ల అసమర్థుల్ని. అసహాయుల్ని. వెన్నెముకలేని యువకుల్ని
సృష్టించే యీ చచ్చు యంత్రాంగాన్నీ

సంధియుగమని శతాబ్దాలుగా సర్దిచెప్పే మధ్యయుగపు మనస్తత్వంగాళ్ళనీ
బ్రహ్మాండమైన ప్రగతి సాధించామనే బడావ్యాపారస్థులనీ
బ్రతుకుని తినేస్తున్న బజారుధరల్ని ఆపలేని రాజకీయాల్నీ
నల్లబజార్ల పూజార్లనీ
లిప్‌స్టిక్ పెదవుల్లా కాస్మెటిక్స్‌కోసమే తెరచుకొంటున్న కొట్లనీ
నీవెక్కలేని గుట్టల్లావున్న బట్టల మాయాబజార్లనీ
నీ వీ జన్మలో కొనలేని ప్యాకెట్ల సాఫిస్టికేటెడ్ షాపింగ్ మొనగాళ్ళనీ
పాలకుల పర్మిట్‌లిఫ్ట్‌లో. షార్ట్‌కట్స్‌లో కోటికి పడగలెత్తే జూదగాళ్ళనీ
కుక్కల్ని ముద్దెట్టుకుంటూ
చితికిన బతుకుల్ని డొక్కనే హైహీల్స్‌తనాన్నీ
యుగాల వారసత్వంలో వచ్చిన ఔదాసీన్యాన్నీ, కర్మసిద్ధాంతాన్నీ, జానేదోయిజాన్నీ,
నీ రక్తంలో దించినపుల్లల్తో నిన్ను సిప్‌చేస్తూ
లేస్తున్న యీ మేడల నియోఫ్యూడలిజాన్నీ
ఎక్కడికక్కడ కూల్చమంటున్నాను
ముక్కలు చెక్కలుగా చీల్చమంటున్నాను.
ఈ అంటువ్యాధి ముందుతరాలకి తాకకుండా
ఇక్కడే. యిప్పుడే కాల్చమంటున్నాను.

రా

మరోమాట వద్దు
వేరే బాట వద్దు

ఇంకా ఎన్నేళ్ళు కాగితాలమీది సుఖాలకి బలౌతావు
ఎన్నేళ్ళు గుండెల్ని మేసే మొసళ్ళతో మసలుకొంటావు
ఎన్నేళ్ళు ముసలితనంతో, మురికితనంతో రాజీపడతావు

అన్నా
నీలో రాజుకుంటున్న నిప్పురవ్వల్ని
కుండపోతగా కురిసే అందమైన మాటలు, అరనిమిషం సుఖాలు
ఆర్పకుండా చూసుకో

నిజం

ఈసారి నీ సమాధానం
అరిగిన మాటల్లో కాదు

విరిగిన వెకిలి నవ్వులో కాదు
ట్రిగర్ మీద పరుగెత్తే వేళ్ళలోంచి
మండే కనుల్లోంచి
మరిగే గుండెలోంచి
తుఫానుల శ్వాసలోంచి
పరాభూతమైన ప్రతి అణువులోంచి
బులెట్ శబ్దంలోంచి రావాలి
మానవత్వం పలికే నీ రక్తంతో
కొత్త చరిత్ర రాయాలి
అందుకే అంటున్నా
మరో మాట వద్దు
వేరే బాట వద్దు
బయనెట్ పాయింట్ మీద మాట్లాడమంటున్నా
ట్రిగర్ మీద వేళ్ళతో రమ్మంటున్నా.

మనిషి కన్నా ఎక్కువ పెరగకు

ఆదర్శ శిఖరాలపై కూర్చుండి
అలౌకికానుభూతిలో
ఆకాశానికేసి చూసే అన్నయ్యా!
దిగువన దీనులున్నారు
ఆకలి ఉంది అవమానం ఉంది
అశ్రువులున్నాయి అన్యాయం ఉంది

దిగిరా
దగాపడిన తమ్ములచూడు

అసిధారావ్రతంలా సాగే నీ ఆదర్శాలు
అగ్ని కణాలై దౌష్ట్యాన్ని దహించకపోతే

విస్ఫులింగాలై విప్లవాల వెదజల్లకపోతే
ఆదర్శాల ప్రదర్శనశాలలో
జంతువుల్లా బంధిస్తే
నీ ఆదర్శాల సహారాలో సమాధిచేసేయ్
గోబెల్స్ గోతిలో పాతెయ్.

ఆదర్శాలకోసం ఆదర్శాలుకాదోయి
మనిషి కోసం, మమత కోసం
వెతల కోసం, వెలుగు కోసం.

తామరాకుమీది నీటిబొట్టులా నిలిచి
నిన్ను నీవే అమితంగా పలచి
నన్ను ముట్టుకోకు నామాలకాకి అంటూ
మడికట్టుకు తిరగకు
నిర్లిప్తతతో నైరాశ్యం ట్యాంకుల నింపకు
మనిషికన్నా ఎక్కువ పెరగకు

బ్రతుకు బుద్బుదప్రాయమే కావచ్చు
బాధ. బంధం. శాపం మాత్రం కాదు.
బ్రతుకొక స్వేచ్ఛ, ఆనందం, హక్కు
ఆకాంక్ష, అనురాగం, ఆశ
మమకారం, మాధుర్యం, తహతహ.
మసిపూసి మారేడుకాయ చేయడానికేకాదు
మసి తీసి మాణిక్యం చేయాలన్నా
మసి పూసుకోక తప్పదు

ముల్లుని ముల్లుతోనే తీయాలి
అందుకే అన్నా!
ఆదర్శంలో అణుశక్తిని ప్రదర్శించు.

ఇదో యీ జీవన శృంగాటకంలో నిలిచి
రుద్రాగ్ని మహోగ్రజ్వాలగా వెలుగు
అందరినీ ఆహ్వానించు
అగ్ని శిఖల పంచు.
అన్యాయాన్ని దహించు.

టంకశాల అశోక్ కవితలు రెండు:

కళ్ళు తెరువు....

రొడీషియాలోని తెల్లకుక్కల-
—ఆ వార్త విని నవ్వే, తిట్టే
మూతిపళ్లు రాలగొట్టండి—
కన్నా
ఇండియాలోని
నల్లకుక్కలేం తక్కువయ్యాయనీ?
ఎక్కడాలేని, ఈ—
తడికలూ, గీతలూ
చూచి,
లోకమంతా
నవ్వులూ, ఉమ్ములూ
కురిపిస్తున్నదని తెలుసా?
మున్సిపాలిటీవాళ్లు కాల్చివేయకముందే
బిళ్ళ కట్టుకుంటాయనీ
కళ్ళు తెరుస్తాయనీ....

...రా వా లి—

గాలివీచినప్పుడల్లా
అడవిలోని
ఎండుకొమ్మలే ఒరుసుకుని మండుతున్నాయి.

దయ్యపు చెట్లను
విరగదోసే గాలి రావడంలేదు.
నీళ్ళలో నిప్పు
ఇంకా పుట్టడంలేదు.
విరగనంత గట్టితనం
గొడ్డలికీ
ఆరనంత చమురు
అగ్గిపుల్లకీ
కావాలి.

చూడు, నా రక్తపు కొరడా రుచి.

'ఐ'

రక్తంతాగి నవ్వుతున్న
రాక్షసుడా!
నీచుట్టూ
కమ్ముకుని
అంతటనేనై
నీమృత్యువునై
చూపిస్తా
చూడు
నా
రక్తపు కొరడా
రుచి
నీకింక దిక్కులేదు.
నీవొక్కడవై

జబ్బుతో
వేదనతో
మంచంపట్టి
నరాలు పట్టుదప్పి
కళ్ళు పీక్కుపోయి
నాలుక పిడుచకట్టి
బిక్కచచ్చి
గుక్కపట్టి ఏడ్వలేోయి
శక్తిచాలక
చచ్చి పోయి
పుచ్చి పోతావ్.

నిప్పును లేపకండి

ఎన్. గోపి.

ఎవ్వరైతేనేం మమ్మల్ని
మాబువ్వ తిననిస్తే చాలు.
పువ్వులను దోచుకోక. ప్రశాంతి
దివ్వెలు వెలుగనిస్తే చాలు.

ఎవ్వరైతేనేం మా ఆశల
పువ్వులను చిదుమకండి.
గుండె వెనకాల నిల్చి
గుండు సూదుల్తో గుచ్చకండి.

మా చితుల హారతుల వెల్గులో
మజాగా నవ్వకండి.
మాకు కన్నీళ్ళిచ్చి మీరు
మైకంలో ఊగకండి.

చుక్కల నందుకునే మా ఊహలను
ఉక్కు కరాలతో నొక్కకండి,
గళాల్లో మేలుకున్న పాటలకు, ని
గళాల యుగళాలు వేయకండి.

మమ్మల్ని కొవ్వొత్తుల్నిచేసి
మా జీవనరసాన్ని పిండుకోకండి.
తివాసీల్లా మా శరీరాల్ని పరచుకొని
రివాజుగా నడచి తొక్కకండి.

రెప్పలచాటున పడుకున్న
నిప్పును లేపకండి.
తలలెత్తే ఆగ్రహానికి
తలుపులు తీయకండి.

శునకపు సింహాసనము

శ్యాంబాబు

వనంలో స్వేచ్ఛగా తిరుగుతూ,
సజీవ జంతువును స్వశక్తితో, రాజసంగా చంపి;
తినగల్గినంత మాంసాన్ని తిన్నాక;
సింహం వదిలేసిన ఎంగిలి ముక్కల్ని, బొక్కల్ని
తినడానికి వచ్చిన నక్కలు
అదను కనిపెట్టి సింహాన్ని బోనులో దోయించి,
వనంలో 'మృగరాజులుగా' చెలామణి ఔతున్నాయి.

తమ బిరుదును చూపి
నోరులేని జంతువుని
(రోజుకొకటిచొప్పున)

తమకి ఆహారంగా రావాలని
'హుకుం' జారీచేసి రాజ్యమేలుతున్నాయి.

జంతువులారా!
బిరుదులు పంపే ఆజ్ఞలు విని
నక్కల ఆకలికి బలికాకండి.

ఇంతకాలం తలను కడుపులోకి ముడుచుకొని,
బూడిదలో పడుకొని,
ఆకలైనప్పుడల్లా ప్రతి వంటింట్లోకీ జొరబడి
పాత్రల్ని మలినం చేసినట్టి,
ఏ ఇంటికీ కాపలా కాయనట్టి,
ఏ దొంగనూ తరుమనట్టి,
శునకాలు
కనకపు సింహాసనాలు పక్కలుగానే పోయి
వాటిపై అధిష్ఠించి తెగ మొరుగుతున్నాయి.
జనులారా!
ఇప్పుడు వాటి మొరుగుళ్ళను విని మోసపోకండి.
ఇక దొంగ రాడని ఊరుకోకండి.

కవిత్వం కాదిది!

దర్శన్.

డెబ్భైయేళ్ల దిక్కుమాలిన నాయకత్వంతో తిమ్మిరిపుట్టి దిమ్మెక్కి జడంగాపడివున్న జాతి
డబ్బాలూ. తాటాకుల చప్పుళ్లకి........
ఉబుసుపోక ఉపన్యాసాలూ, విన్యాసాలకీ. ఊహావిప్లవ
కాళజ్వాలలకి మేలుకుంటుందన్న దురాశని త్రుంచెయ్!
అధోలోక వ్యథార్తుల హాహాకారాలకి అందకుండానే
రథచక్రప్రళయ ఘోషలూ, రాబందుల రెక్కల చప్పుళ్ళూ

ఆకాశపు దారులంటనే హడావుడిగ వెళ్ళిపోయాయి।
అక్షరరూప జ్వాలాతోరణాలూ, అగ్నిధారలూ, రుధిర జ్వాలలూ,
కాగితపు శ్వేత వస్త్రాలు కప్పుకొని సురక్షితంగా విశ్రమిస్తున్నాయి।
తెరచి చూడబడే మోక్షానికి సైతం మొగం వాచి॥
వెచ్చని పానీయాలవేడిలో వెలువడే
పచ్చి బూతుల్తో ఈ పాడుబడ్డ వ్యవస్థని
బాగుచేస్తానన్న భ్రమనుంచి బైటికిరా।
వైదిక వాఙ్మయంలో వెదికితేగానీ దొరకని వైతరణి
వీధివీధినా వెల్లువలై ప్రవహిస్తున్నది;
వగచి, వాపోయే వాగ్విలాపాల్తో
ఆగదీ మహా ప్రవాహం।
"గామా" కిరణాల లయకారక క్రాంతి కావాలి
నామరూపాల్లేకుండా నాశనంచేయటానికి— ఈ
వైతరణీ ప్రవాహకారకవితరణోదారుల్ని॥
తరతరాల దాస్యజనిత దారిద్ర్యపు చలిని
ఇరవైయేళ్ళ ఇంటోడి పాలనపైర ఇనుమడించింది:
కమ్మని కవితల నెగళ్ళతో వదలదీచలి।
అందుకే చేవచావని ఆశయ జీవివైతే....
రమ్మంటున్నా కలంగిరాటేసి! ఖడ్గసృష్టిచేసి॥
చుట్టూ చూచి, చుట్టపక్కాల్ని జూచి, నిట్టూర్చకు!
తాతలూ, తండ్రులూ, దాయాదుల రక్తపు చిక్కదనమూ, రంగూ, నీ
శక్తిని శంకించి, నిన్ను
కృంగదీస్తే.... కృష్ణుడి పాత్రతో వ్యాసుడు పలికించిన యుద్ధనీతినోసారి నెమరేసుకో।
అవ్యవస్థని గురించి ఆక్రోశించడంగాక, అంతమొందించడమే ఆశయమైతే....
కావ్యాల కాల్పనికలోకాల్నుంచి కార్యరంగంలోకిరా।
ఇప్పటికే ఇరవై యేళ్లు, గప్‌చుప్‌గా గడిపేసావ్।
బేలట్ పెట్టెల్లోంచి తలలు బయటికి పెడుతున్న
తోలుబొమ్మల ఆటల్తో కాలయాపన చెయ్యకు
గాలిలోకి జరిపే కాల్పులకే, నేలకరుచుకుపోయే నిర్వీర్యులు వీళ్లు!
కాగితప్పులుల్ని జూచి గాభరాపడకు
సాగిరా ముందుకు సర్వ సన్నద్ధుడివై॥....

చర్చావేదిక:

ఫ్రీ - ఫ్రాంక్ వర్స్.

ఇందుర్తి ప్రభాకరరావు.

[ఫ్రీవర్స్ వొక కవితా ప్రక్రియగా వచ్చి మూడు దశాబ్దాలు దాటింది. కుందుర్తివంటి కొందరు దీనిని వుద్యమంగాభావించి ఫ్రీవర్స్ ఫ్రంట్ (?!) యేర్పాటు చేసారు. అద్దేపల్లి రామమోహనరావు వచనకవిత ప్రజాస్వామ్య లక్షణమని అంటున్నాడు. సుప్రసన్న, సంపత్ ఛందోపరిణామక్రమంలో వొక మజిలీగా మాత్రమే దీన్ని గుర్తిస్తున్నారు. దాదాపు వీరందరూ కథా కావ్యాలు వస్తే తప్ప ఫ్రీవర్స్‌కు స్థిరత్వం. సంపూర్ణత్వం రాదని భావిస్తున్నారు. చారిత్రిక దృష్టితోచూస్తే ఫ్రీవర్స్ ఆధునిక సామాజిక చైతన్యాన్ని, శాస్త్రీయ ప్రగతివాదాన్ని ప్రతిబింబించడానికి వచ్చింది కనుక ఛందస్సులనూ పాతనియమాలనూ తెంచుకొని స్వచ్ఛందంగా వచ్చింది అని అయితే వస్తునిర్దేశం— అదికూడ ఆధునిక సమాజ చైతన్య సంబంధి— చేసుకుంటేతప్ప కేవలం రూపం వుద్యమం కాజాలదని కె. వి. రమణారెడ్డి, వరవరరావు మున్నగువారు భావిస్తున్నారు. కవిత్వానికి సామాజిక ప్రయోజనాన్ని లక్ష్యంగా యెంచకపోయినా తిలక్ కూడా ఫ్రీవర్స్ యీకాలపు భావాలకూ, విలువలకూ తగిన వాహికగా భావించాడు. తెలుగులో యీ ఫ్రీవర్స్‌ను యేపేరుతో పిలవాలన్న చర్చనుకూడ యీమధ్య వే. నరసింహారెడ్డి, సంపత్కుమార, అనుముల కృష్ణమూర్తి లేవదీశారు. పేరుకూడా ఆయా కవులకు ఫ్రీవర్స్ లక్ష్యంపై లక్షణంపైవున్న దృక్పథాలమీద ఆధారపడి పడుతున్నవి. 'పాపపుట్టింది యేపేరైతేనేం'అని కొందరు. 'యింత పెద్దదయిన పాపకు యిన్ని పేర్లకన్న యేదైనా వొక పేరు స్థిరపరచుకుంటే మంచిదని కొందరూ, (దీనికొరకు సభలు యేర్పాటుచేయాలన్నంత దూరంపోయింది ఆలోచన) రూపాన్నిబట్టి పేరు అని కొందరు స్వభావాన్నిబట్టి అని కొందరూ, అసలు దీని స్వభావమేమిటి? అని అందరూ యిట్లా సమాలోచనలు జరుగుతూనేవున్నాయి. వీనికే యింకా వొక కొత్త ప్రతిపాదన యీ యువరచయిత చేస్తున్నాడు. 'ఫ్రీవర్స్ యెందుకు?' అని ప్రశ్నిస్తున్నవారు, తమలో ప్రశ్నించుకుంటున్నవారు, జిజ్ఞాసాపరులందరూ యీ చర్చలో పాల్గొన వలసిందిగా ఆహ్వానిస్తున్నాము. సం॥]

ఈనాడు వ్రాస్తున్న కవులు, కవులమనిపించుకోవాలని ఉబలాట పడుతున్న వారు, కవిగా పేరుగాంచాలని తహతహలాడుతున్నవారు, ఒక ఉద్యమంగా ప్రకాశిస్తూ బహుజనాదరాన్ని పొందుతున్న వచన కవితా ప్రక్రియను ఆశ్రయించక తప్పడంలేదు. సూత్రికారులు కాదలచుకొన్న కొందరు ఛాందస కవితా ప్రభావాన్ని కల్గినవారు రెండు వాదాల్నీ ఆశ్రియించి. దానితో దీనికి దీనితో దానికి లెంకె వేయాలను కుంటున్నారు. ఛందోబద్ధకవిత ఈ వచనకవితా రూపాన్ని పొందటానికి, పాత కొలమానాలతోనేకొన్ని సిద్ధాంతాల్ని ప్రతిపాదిస్తున్నారు. వారి సిద్ధాంతప్రకారం అసలు ఆధునికతకు ఆధారం లేదు ఆధునికతకు ఆధారం లేదంటూనే ఇది యదార్థవాదనకు ఉన్ముఖం అంటున్నారు. ఈ సూత్రికులను నేనొకటి సూటిగా అడగదల్చుకున్నాను. "యదార్థం" అన్నదాన్ని వీరు విశ్వసిస్తారా? అలా విశ్వసిస్తే దానిలోనే ఆధునికత తప్పక కనిపిస్తుందనేది నా విశ్వాసం. ఎందుకంటే యదార్థాన్ని ప్రతిబింబించాలన్నదే ఆధునికతకాధారం. అదే ఆధునికులు కోరేదీను. గతంలో అనుసరించని కొన్ని క్రొంగ్రొత్త రీతుల్లో, గతంలో తృణీకరించిన అనేక కవితా వస్తువులనుచేపట్టి, వస్త్వైక గుణప్రాధాన్య కవిత్వంగా నేటి వచన కవిత వర్ధిల్లుతున్నది.

ఈ వాదనను వారంగీకరించరనికాదు. వాళ్ల తర్కంలో వీరు కావాలనేది ఈ పరిణామదశకు కారకుడైన యుగకర్తను కాలవిభజనచేత ఒంటివాణ్ణి చేయాలని out dated చేయాలన్నదే వీరి సంకల్పం. ఇలాంటివారి కల్మశయుతమైన తార్కిక సిద్ధాంతాలను గురించి చెప్పేముందు సాహితీ పిపాసులకు ఆధునిక కవితా వ్యాసంగాన్ని చేపట్టే యువకులకు ఒక హెచ్చరిక చేయదలచాను.

దేశంలోని రాజకీయ చైతన్య ప్రభావం అన్నింటా ప్రతిబింబించినట్లే కవులలో కూడావచ్చేసింది. ఈ పద్ధతిలో తాము నమ్మిన సిద్ధాంతాన్ని ప్రచారం చేసుకోవటానికి దానినొక ఉద్యమంగా స్వీకరించి ఎన్నోశ్రమలకోర్చి తమ సిద్ధాంత వికాసానికి తోడ్పడ డం ఒకమార్గం.

రెండవది తమ వ్యతిరేక సిద్ధాంతవాదుల పంచన వారిముద్రే వేసుకొని చేరి వారి సిద్ధాంతానికి కాలక్రిమేణా ఛిద్రత, ప్రమాదం తీసుకురావడం ఒక తరహా. ఈ రెండవ తరహా వారిని నేను Infiltrators అంటాను. వీరు పర్యాయంగా వ్రాస్తున్న విమర్శలు, చేస్తున్న సాహితీ సదస్సులు ఆధునిక సాహిత్యానికి రూపాంతరంచేస్తూ చేస్తూ ఈ సమయానికి చెలామణీ ఔతున్న కవితను 'వచన కవిత' అంటున్నారు, ఆధు నిక కవితారీతుల్ని కాలమానాన్ని సిద్ధంచేసి విభజించి ఇలా చెప్తున్నారు. వీరి పరిశీలన

ప్రకారం గతశతాబ్దం చివర యదార్థవాదం ప్రతీకవాదం రెండూ వచ్చాయి. ఐతే ఈ యదార్థవాదం బహిర్ముఖంగా మానవ జీవితాల్ని చిత్రింపగా అంతర్ముఖ చిత్రిణచేసింది ప్రతీకవాదమట. ఒకవేళ యీ ప్రతిపాదనను ఒప్పుకున్నా ఈ యదార్థవాదం ఆధునిక మైంది కావలసిందే కదా! కాని వీరి దృష్టిలో అలాకాదు. పురాతన కవితా పరిణామ వాదంగాచెప్తూ యదార్థవాదన కుపక్రమించిన కవిని అటు పురాతనకవితకు చివరివాడుగా పేర్కొంటున్నారు.

ఇంకా యదార్థవాదం నుండి ప్రయోగవాదం అంటున్నారు. ప్రయోగవాదం నుండి అభ్యుదయం అంటున్నారు. అలా అంటూనే కవిత సమాజపరిమౌతూ ఆర్థిక సమస్యలవైపు మొగ్గుచూపి Marx ఇత్యాదుల ప్రభావాలకు లోనైందంటున్నారు. వీరి దృష్టిలో అభ్యుదయ కవితవేరు సామ్యవాదాన్నుద్దేశించి, ఆర్థిక సంక్షోభంపై చెప్పబడిన కవిత వేరు. వీరేర్పరచిన యీ సాహిత్యాపు జల్లెడలో నాకు సుస్పష్టంగా కానవచ్చిం దొక్కటే– అభ్యుదయ కవితకు కర్త లేదా ప్రధాన భూమికా నిర్వాహకుడు శ్రీశ్రీకాదు. వారి భావన ప్రకారం వారు యిది నిరూపించుకొంటే మిగతా వారిని బలహీనపరుస్తూ తలోఅందలం చూపవచ్చని వారి దృఢఅభిప్రాయం.

ప్రయోగవాదానికి మొదటివాడు దాదాపు చివరివాడుగా శ్రీశ్రీనిచెప్తూ– అభ్యుదయవాదానికి ఆరుద్ర, రమణారెడ్డి, కుందుర్తి, దాశరధి యిత్యాదులపేర్లను పేర్కొంటున్నారు. ఇది Conservative తత్వం బాగా ప్రబలిపోయిన ఒక దుస్థితి. బ్రిటిష్ పరిపాలనా తత్వం వారసత్వంగా వస్తున్న ఒక జాడ్యం. దీనివల్లే ఈ విభజించి భజించే పద్ధతి రాగలిగింది.

వీరు ప్రస్తావించిన పరిణామ ప్రయోగవాదం అభ్యుదయవాదం యివన్నీ వేరువేరు పదాలతో పేర్కొని ఆధునిక సాహిత్యాన్ని– కవులను– అరలు అరలుగా చేయటమే. న్యాయానికి ఇదంతా ఆధునిక సాహిత్యమే. ఇలాచేస్తూ చివరన వచ్చిన కవితను వచన కవితఅని, దానికి, ఈ వచనకవితా ఉద్యమానికి కుందుర్తి నాయకుడుఅని అంటున్నారు.

వచన కవిత శ్రీశ్రీతో కాక తర్వాతనే వచ్చిందైతే వీళ్లు అంటీ అంటనట్లు పేర్కొంటున్న కాళోజీ స్వీకరించేదే కవిత? ఆయన వచన కవిత వ్రాస్తున్న దెప్పటి నుండి? వచన కవితా సంప్రదాయాన్ని మొదటినుంచీ పాటిస్తున్న 'నిరుద్యమకారుడు' కాళోజీ కదా! ఆయన్ను చెప్పకపోవటంలో అగుపించేదొకటి. నాటినుండి నేటివరకు ఆయన అంటని ముట్టని కవితావస్తువు లేదు. ఈ కాలమానానికి ఆయన కవిత అంద

లేదు, కాలం శ్రీశ్రీని out dated అంటే కాళోజీని అంతేఅనాలి. అలా అనగలుగుతుందా? సాహితీకారులు అనగల్గితే వారి వాదనబలం హెచ్చు తచ్చు వారికే తెలుసు. ఫ్రీవర్స్ ఫ్రింట్‌తో(?) కుందుర్తి వచనకవితా విధానాన్ని ప్రభావితం చేసినమాట వాస్తవమే కాని ఈ ప్రక్రియకితడే కర్త అనుకుంటే ఈ పైజెప్పిన కంపార్ట్‌మెంటలైజేషన్‌ను మనం స్వీకరించినట్లే.

నాదృష్టిలో ఇప్పటివరకు కవితా పద్ధతులు రెండేరెండు. ఒకటి పురాతనం- రెండు అధునాతనం. అధునాతన అన్నప్పుడు కాలపరిమితి ఉంటుందికదా అని తార్కికులు అనవచ్చు. దానికి సమాధానమిది– కవి సమకాలీన సమాజానికి అవసరంలేని కవితా వస్తువుతో, కవితా పద్ధతులతో పరిమితదశలోనే వున్న కవిత పురాతనమైంది. దీనికి భౌతిక కాలమానంకన్న భావనామానం చేయటం ఔచిత్యం. కవిత సమాజపరమై సమాజ శ్రేయోకామియై సమయసందర్భాల ననుసరించి ప్రత్యేక ప్రాధాన్యంకలిగి పురాతన రీతులకు భిన్నంగా వున్న కవిత ఆధునికమైంది. ఈ విధమైన కవిత గురజాడ. శ్రీశ్రీలతో మొదలైంది. ఇలాంటి కవిత ఇంకా వ్రాస్తున్నవారు తెలుగునాట ఎందరో ఉన్నారు. వాళ్లల్లో అగ్రిగాములు కాళోజీ, కుందుర్తి, దాశరధి, వరవరరావు, సి.వి. కృష్ణారావు మొదలైన వాళ్ళందర్నీ చెప్పుకోవచ్చు. ఈ కవితా పద్ధతి ఆవిర్భవించినప్పుడు– భావన– సామాజికమైనట్టిది. ఉద్వేగం అప్పటి కాలప్రిభావానికి అనుగుణమైనట్టిది. చైతన్యం నిత్యనూతనమైనట్టిది. సందేశం సత్యమైనట్టిది. ఇలాంటికవితకు ఉద్దీపన చేసినవాడు శ్రీశ్రీ. అప్పటినుండి పద్యరూపం నుండి పదరూపంలో బయటబడింది. అంటే అప్పటినుండి, ఆధునికత కవితకు వచ్చినప్పటినుండి, దైనందిన నాగరిక సమాజంలో మనం దుస్తులు మార్చుకున్నట్లే కాలానుగుణంగా కవితలో యీ మార్పు వచ్చింది. మనం ధోవతీ లాల్చీలనుండి ప్యాంటు బుష్‌కోట్‌లు వేస్తున్నాం. స్వభావంతో రూపంకూడ మారుతున్నది.

చెప్పొచ్చేదేమంటే పద్యకవితను వీడి అభ్యుదయ కవితను వ్రాస్తున్నప్పుడు, దొర్లిన రూప భేదాలు మాత్రి ఛందస్సు. ముక్త ఛందస్సుతో కూడినవి. అవికేవలం Intermediate Compounds మాత్రిమే. ఉద్యమ కర్తల లక్ష్యం వచన కవితే. మధ్యతరంలో యీ వచన కవితను ఎవరో సృష్టించారు. వారు తమ భుజస్కందాల మీద మోసుకుంటున్నారని ఇతరులు భ్రిమింపజేయ నక్కర్లేదు. కవితకు ఛాందస శృంఖలాలు విడగొట్ట బడిననాడే ఆవిర్భవించిందీ స్వచ్ఛంద కవిత.

ఇలాంటి స్వచ్ఛంద(ఇంకారాలేదనుకోండి) కవితకు కుందుర్తి నాయకుడన్న వారికి సమాధానంగా 'వైతరణి' పీఠికలో ఆయన వ్రాయనే వ్రాశారు. "వచన కవితోద్యమానికి ఒక ప్రత్యేక తత్వమంటూ లేదు. ఇది అభ్యుదయ కవిత్వపు తత్వం కల్గిందే" నని ఆ స్వచ్ఛందత మనలో యింకా రావాలంటాను నేను.

ఈ స్వచ్ఛందత లోపించటంవల్లనేమో ఆధునిక కవితామార్గంలో పయనించిన కొందరు పేరుగాంచిన కవులు ఈ Infiltrators విభజనకు లొంగి మళ్ళీ వెనకడుగు వేస్తున్నారు. ఈ రకంగా, యిటీవలకాలంలో ఈ Infiltrators ప్రభావం కుందుర్తి, సోమసుందర్ వంటి వొకప్పటి ప్రగతి వాదులపై కూడా పనిచేస్తున్నట్లు కన్పిస్తున్నది. ఇప్పుడు అలాంటిది జరిగినా అంతగా బాధపడాల్సింది లేదు. ఎందుకంటే— నాదృష్టిలో వచన కవిత వ్యక్తుల ప్రాబల్యంనుండి దాటి స్థిరపడిపోయింది. ప్రజల్లో నిలిచిపోయింది. అది ఎంతగా నిలదొక్కుకున్నదంటే భావనాపటిమగల్గి వ్రాయగల్గిన ప్రతి తెలుగువాడు ఈ రీతిలో వ్రాయగల్గుతున్నాడు. కవిత వినాలనుకుంటున్నవాడు విని అనుభూతిని పొందుతున్నాడు.

ఈ సమాజంలో కవి ప్రజా జీవితానికి భిన్నుడకాడు. అతను అనుభవిస్తున్నది, చూస్తున్నది సమాజం అనుభవానికి తెచ్చేవిధంగా సుస్పష్టంగా, సరళమైన భాషలో వ్రాసిన కవితే సామాన్యుని కందుబాటులో వుంటుంది. అదే ఎక్కువ జనుల ఆదరాన్నికల్గి ఉంటుంది. అంతేకాదు రచనా దృష్టితో మరే అడ్డంకులు లేనంత స్వేచ్ఛ స్వచ్ఛందంగాను వుంటుంది. ఇలాంటిదే వచన కవిత. ఈ నిర్వచనంలో కూడా ఏవేని అడ్డంకులున్నట్లగుపడితే అవికూడా అడ్డురాకూడనంత ప్రజాస్వామ్యాన్ని సిద్ధించుకున్న కవిత వచన కవిత.

రామాయణాన్ని, భారతాన్ని వచన గేయాల్లో వ్రాయాలనుకోవడం ఆధునికం కాదు అది రూపసిద్ధి మాత్రమే కల్గివుంటుంది. మళ్ళీ భావన పురాతనతమే. ఈ కవితాలక్షణం అనుసరణీయ పద్ధతిలో ఉపయుక్తమైన వస్తువు కల్గివుండటం.

ఎల్లప్పుడూ ఆకలి, చావు, బాధ ఇత్యాదులే వస్తువులు కానక్కరలేదు. దురదృష్టవశాత్తు మనకు ఈరీతి బాధలన్నీ, బానిసభావాలూ శాశ్వతమైనవి. రోజులు మారుతున్న కొద్దీ ప్రక్రియలో యేదోభేదం తేవాలని కొందరు స్వరూపాన్నే పాత మూసలోకి దించే ప్రయత్నంలో వున్నారు. వస్త్వైకదృష్టితో స్వచ్ఛందకవిత వ్రాయబడినప్పుడు భవిష్యదితిహాసానికి, భావనకు అది ఆలంబన ఔతుంది. అలాంటి నిర్దుష్టభావాన్ని

కల్గించేందుకై వచన కవిత సంపూర్ణత్వాన్ని కలిగివుండాలి. సంపూర్ణత అంటే కవి స్వచ్ఛందత (Freeness) మాత్రమే కాకుండా సత్యసంధత (Frankness) ను కూడా కల్గివుండటం అవసరం. ఇక్కడే ఉద్యమం ఒకమలుపు తిరగాలంటాను. ఈ Frankness సర్వేసర్వత్ర వచ్చిననాడు అర్భక సమాజం నవచైతన్యాన్ని పుంజుకో గల్గుతుంది.

ఇంతకూ చెప్పొచ్చేదేమంటే కవిత చదువరి వరకే పరిమితం కాలేదు. విన్నవాడి పరంకూడా ఐంది. వింటున్న వాడు విమర్శకుడై పోతున్న రోజులివి. నిర్భీకమైన స్వచ్ఛంద కవిత Free and frank verse రావాలంటాను నేను.

[నర్సంపేట మిత్రమండలిలో చదివిన వైతరణి, చలినెగళ్ళ సమాలోచనలో చర్చనీయమయిన తొలిభాగమే ప్రచురించనైనది.]

Statement about ownership and other particulars about newspaper

SṚJANA

1.	Place of publication	... ...	Warangal-2.
2.	Periodicity of its publication	...	Quarterly
3.	Printer's Name	... ...	Varavara Rao
	Nationality	... ...	Indian
	Address	... ...	Lecturer, C. K. M. College, Warangal-2.
4.	Publisher's Name	... ...	Varavara Rao
	Nationality	... ...	India
	Address	... ...	(As above)
5.	Editor's Name	... ...	Varavara Rao
	Nationality	... ...	Indian
	Address	... ...	(As above)
6.	Names and addresses of individuals who own the newspaper and partners or shareholders holding more than one percent of the total capital.		—

I, Varavara Rao hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

Sd/- Varavara Rao
Publisher.

గౌరవరావం

మిరియాల రామకృష్ణ

వచ్చీ రాగానే యెగిరిపోతాయి మా జీతాలశకుంతాలు
చిచ్చులాంటి భయంలో గోలెత్తుతాయి మా జీవితాలు
అప్పుదారులు మా కలలదారుల్లో బుసలుగొడతారు
తప్పు తూకాలువేసే విక్రేతలు మాకు ఖాతాలిస్తారు
కూస్తుంది కోడి! కానీ మా కోరికలవాకిటి చీకటి పోదు
మోస్తుంది బరువు! కానీ మా చిక్కుల చిరునామాకు 'చెక్కు' రాదు!

పెళ్ళికెదుగుతుంది పిల్ల— బిల్లుకానీ నిలువలో ఉండడం కల్ల
చెల్లించాలి ఫీజు— పిల్లాడికి రెండు నెలల్లో పెద్దపరీక్ష
ఫస్టుతేదీ వచ్చింది— ఇంటద్దెకు గాలికబుర్లు వస్తున్నాయి
రెస్టు లేదాలోచనకు— రేగుతోంది నిరాశ నిప్పులా.
దురదృష్టమా! మా కష్టసంసారం నీ నల్లపూసలదారం!
చిరవిఫలతా! మా సమస్యలు నీ ప్రియ వయస్యలు.

పెద్దపనులకు మా బలాలు కబళాలయిపోతాయి
పెద్దచేపల్లాంటి మా ప్రతిభలు బెంగల్లో పడిపోతాయి
ఇవి పగులు నావలు! రసానందం ఒడ్డున పారవేసింది విధి
ఇవి ధర్మయుద్ధాలు! సహనాని కవతల విజయశ్రీ ఉంది

మాకూ ఒక గమ్యం స్వాతంత్ర్యంలో స్వామ్యం ఉంది
కేకలు తప్ప కాకలి యెరుగని యువకుల శీలానికి శిక్ష మా నిర్విరామదీక్ష!

అందుకే మా విజ్ఞానం నిరాశనుంచి అద్దరికి మమ్మల్ని చేరుస్తుంది
అందుకే మా సహనంలో బడబాగ్ని దాక్కుని జ్వలిస్తుంది.

విరామ చిహ్నలు

వేగుంట మోహన ప్రసాద్.

పౌడరు డబ్బా
అది లేపిన దుమ్ము
లో కలిసిన జ్ఞాపకాల
కళ్లా వెక్కిళ్లా
అంచేతే నీళ్లా కళ్ళల్లోంచి
గొంతులోంచి వెక్కిళ్లా

సప్పెట్టీ
దాన్నురగలో పొంగిన
జీవితబ్బుడగలూ
చివరికి బుద్బుదాలై

తువ్వాల్తో
చివరికి తుడుచుకునేం
దుకేమీ లేక
మిగిలిన సప్పెట్టీ
పౌడరు డబ్బా వాసనల్రెండూ
కలగా పులగమై ఆ
ఖరికెప్పుడో కా
టుకా తిలకమూ
చెంపిన్నీసులూ వి
చారంలా క్రోధంలా
ముళ్ళల్లా గుచ్చుకుని
రక్తం కారి

అద్దంలో చూచుకుంటే
ఇంకేముందీ
ఒక నిండు లారీ
అర్ధరాత్రి ఒక బక్క
ప్రాణాన్ని నేలమీద నొక్కి
గ్యారుమని అరుచుకుం
టూ పోయినట్లు

నేనూ
అద్దంలో నా ముద్రా
బద్ధకంలో నా నిద్రా
సముద్రపు లోతులోకి
జారిన అద్దంలో నా
జాలిగా రాలిన నీలినవ్వూ
రిక్షాచక్రం పగిలిన గాలినవ్వూ
గొలుసూడిన సంకెళ్ళ కిసుక్కూ
నవ్వూ
గుడిసెలో దీపం
కొండెక్కిన కాళ్ళతీపూ
కాకా హొటేల్లో
ఆఖరి కప్పు చాయీ
పెదాలకి అసయ్యంగా
అంటిన మలాయ్
కొట్టు కట్టేసేప్పటి
చాపచుట్టలా కిందికి
రాలిన ఇనప తలుపూ రాక్షసత్వం
మళ్లెం నేల ఋాడ్చిన
పటుకలోర శబ్దం
మూ
దీర్ఘరాత్రిలో వీధికుక్క
ఆర్తనాదమూ

ఓ
అని
ఢిల్లీనుంచొచ్చే జీటీ
మన చిన్నాళ్లో ఆగని నిర్దయా
అద్దంలా ఊడ్చిన వీధిలో
కారాకిళ్ళీ పరుచుకున్న ఎరుపుమరకా
అందమైన అమ్మాయి
పట్టుపరికిణీ వోణీ
రెండు జళ్ళమ్మాయి వేసిన
ముగ్గుని కాళ్ళతో చెరిపేసిన
రౌడీగాడిద నిరపేక్ష దృష్టి
....
....
ఇవన్నీ గుర్తుకి
కూటీకూర రబ్బా
చిమ్మిన తెల్లపిండి పొగలో
కలిసిన జ్ఞాపకాలు
అ
విరామంగా !

మరణించిన మనిషి

ఎస్. మౌలాలీ

పొయ్యాడు....
పది పైసలకోసం
పది చెప్పులు
కుట్టు కుంటూ
బ్రతికిన మనిషి

రుధిరం రంగరించి
అందరికీ పంచిపెట్టి
జీవితాన్ని ఫుట్‌పాత్‌కు
బలి పెట్టిన మనిషి
కృతజ్ఞత పుణికి
పుచ్చుకున్న మనిషి

ఈ వృత్తిలో యెన్నాళ్ల
అనుభవం జీర్ణించి
చేతుల్లో కాయలుగా
పెరిగిందో
యెన్ని పాయలుగా
హృదయం
రుకుపోయిందో
యెంత యెత్తున
స్పత్తువ పెరిగిందోమరి
వనజ్యోతి కొడిగట్టింది
బతుక్కి దడిగట్టింది.

రిగిన బ్రతుక్కి
ాసిక దొరక్క
తి చలించిందేమో
గుల్లో పెంచిన
రక్తి చేసిన
ఖరి మజిలీ
దేనేమో పాపం!
ంగా చూస్తున్న
రానికి తెలిసుంటే
ప్పులో సగానికిదిగిన
దికి చెప్పేవుంటుంది

కంకాళం
తల్లి గుండెల్లో

గులాబీయై పూచిందో
యేయింటి గుమ్మంలో
నక్షత్రమై మెరిసిందో
నగరంలో రాలిపోయింది

ఆకాశం యేకధాటిగా
యేడుస్తున్నప్పుడు
కన్నీళ్ళను మూటగట్టుకొని
కానుకగా దేవుడికర్పించాలని
దూర దూరంగా వెళ్ళిపోయింది
నిశ్శబ్దంగా అవతలిగట్టుకు
జారిపోయింది.

ఇరుల వెన్నెల

అమ్మంగి వేణుగోపాల్.

సానుభూతి సమావేశాలూ, సంతాప సందేశాలూ
రహస్యంగా రణం సాగిస్తున్నాయి
నిజమైన దుఃఖాన్నీ, సానుభూతినీ
సమాధులమీది గడ్డిపోచలు పోషిస్తున్నాయి

ధర్మం మరణశయ్యమీద
మార్ఫియా మత్తులో మూలుగుతోంది
ద్వేషం పగటివేషాలు వేసుకుని
దేశంలో విషాన్ని వెదజల్లుతోంది.

శాంతిని బలవంతంగా వాంతిచేయిస్తూ
యుద్ధాన్ని ముద్దుపెట్టుకుంటున్న లోకం
మురికిలో మూలుగుతున్న మూగజీవులమీద
సుడిగాలులవల, పిడుగులకాపలా,
పవిత్రరక్తంతో చెమట చరిత్రను రాస్తూ

సరిహద్దుల్లో సమరం సాగించేవాళ్ళ
గొడుగునీడలో నిల్చి చలువజోడులోనుంచి
కన్నీళ్ళను చూసే కవులు
మట్టిలో
వానపడితే చిగురించే ముక్కుపచ్చలారని చిరునవ్వులు
సానపడితే వెలుగులుపూసే సజీవ వజ్రాలు
ఇరుల ఇరుకుల్లోకి మాయమౌతున్న సిరులు
వళ్ళంతా తెల్లని గాయాలతో వెన్నెల
నీ రక్తంతో ఈవెన్నెలను విద్యుదీకరించి
నిన్నటి చల్లదనానికీ తెల్లదనానికీ అదనంగా
ఇరులను ఆవిరిచేసే వేడిని
ఇనుమును దూసుకుపోయేవాడిని కలిగించు
ఈ వెన్నెల
చీకటితో నాగరికతను రాసుకుంటున్న
మా మసిబారిన మనస్సులలోకి మాణిక్యదీపాలుగా రావాలి
ఆ దీపాల వెలుగుపాలవాన
పాపాల రూపాలను మాపివేయాలి
శోకాల ఛాయలుసైతం సోకని
లోకానికి దారిని చూపాలి
ఈవెన్నెల మేఘాలవెన్నులమీద
శాంతిపతాకాన్ని ఆవిష్కరించాలి.
ఆ శ్వేతఛాయల్లో యీ విశ్వం
నిత్యపౌర్ణమిగా మారాలి.

కొత్త గొంతులు:

చలిరాత్రి ఒంటిగంటకు........

'సాలగ్రామ్'

నీరవ నిశీధి పాపాలకు పహరా ఇస్తున్నపుడు,
నిద్రాదేవి జగత్తును తన సొత్తు చేసుకున్నపుడు,

ప్రపంచంమీది పరివేదనతో, నా
నిస్పృహాయత మీది ఆగ్రహంతో,
రెండంతస్థుల మేడ గదిలో,
కదలని కలంతో, తెల్లబోయిచూస్తున్న కాగితంతో– నేను.
కిటికీ అవతల నేను కోరే ప్రపంచాన్ని
కలగంటే తప్ప, కాంచలేను!
కంకర రాళ్ళను కప్పివేసిన తారురోడ్డుమీద,
'గఁయ్'న రాకాసిలా దూసుకువచ్చిన లారీకి,
నల్లత్రాచులా పరుగెత్తుకొచ్చిన కారుకూ,
మధ్య రిక్షనీడలు నలిగి పోయాయ్!
ఆంజనేయుని గుళ్లోవి భక్తబృందం భజనగోలలో
మూలన ముడుచుకున్న కొసప్రాణపు ముసలివాని
మూలుగు కలిసి పోయింది!
మామూళ్ళకోసం గస్తీ తిరుగుతున్న ఎఱ్ఱటోపీతో
మామూళ్లు పంచుకుంటున్న మొనగాళ్లు.
ఎంగిలి విస్తళ్ళ రుచితో శ్రీమంతుల సిరిని
అంచనా వేస్తున్న నేస్తం, బిచ్చగాడు,
కుక్క హెచ్చరిక విని పరుగు లంకించుకున్నాడు.
ఆకలి మరపిస్తూ ఓదార్చే చక్కనికల
చెదరగొట్టినందుకు, చింపిరితల గోక్కుంటూ
విసుక్కుంది దాసీపిల్ల! ....
మనసైన మగువ కౌగిలిలో మైమరచిన
'ప్రజల మనిషి'– మన మంత్రిగారికి
రాత్రి ఒంటిగంట ప్రపంచం కన్పించదు.
శోషిల్లిన పేదప్రజల ఆకలినాదం విన్పించదు.
పగలైతేనా–
అంబాసిడర్ కారు అద్దాల్లోపల,
అమరిన సీటుకి ఒత్తిగిలిన,
రంగు కళ్ళద్దాల మహానాయకునికి–
ఈ లోకం, ఖద్దరుగుడ్డలా, ఎంతచల్లగా
స్వచ్ఛంగా కన్పిస్తుందో మరి! ....

ఆవేదన రగిలించిన ఆవేశంలో
నా కలం కదిలింది!
ఈ ఊహ మెదిలింది.
“మండిపోయే గుండెల్లోంచి
నిప్పురవ్వలు అంతస్తుల బంగళాలపైకి ఎగిస్తే....
ఫైర్ ఇంజన్‌లకు అంటని మంటలు
ఆకాశాన్నంటుతే.... ....
ఎముకలు కొరికే చలి ఎగిరిపోతుంది!
చలిరాత్రి ఒంటిగంటకు,
పట్టపగలు విరుస్తుంది!

సోత్కర్ష

రుక్మాభట్ల కృష్ణమూర్తి.

సమాజం కొలతబద్దల పంజరంలో
బంధింపబడిన పావురాన్ని నేను—
ఆశయాల ఉచ్చులో తగుల్కొన్న
ఆశాజీవిని నేను—
నేటి వెలుగును చూడలేని
గబ్బిలం మనస్తత్వం నాది
అభివృద్ధి సంగీతాన్ని వినలేని
బధిరప్రవృత్తి నాది
నాచుట్టు నిర్మించుకున్న
సంసారపు సాలెగూడులో
స్వర్గసుఖాలనుభవించాలనుకొనే
మిథ్యావాదిని నేను—
సంప్రదాయాల ఊబిలో దిగబడ్డ
శార్దూల స్వభావం నాది—
మతకర్తల గారడీవిద్యా ప్రదర్శనలకు

ప్రేక్షకుణ్ణి నేను–
ఊహాలోకపు దిగంతాలకవతలి
సౌందర్యాన్ని వరించే
విపులకవితల పాఠకుణ్ణినేను–
రాజకీయ నాయకుల హామీల-తమాషా
ఉపన్యాసాల శ్రోతను నేను–
సమాజం కర్రదెబ్బలకు
సగించచ్చిన సర్పాన్ని నేను–
అధికారుల తిట్లను ఆనందంగా
దీవెనలుగా భావిస్తూ, అరువుతెచ్చుకున్న
చిరునవ్వు చిందించే
అమాయకుణ్ణి నేను–
నేనువసించే ఆనందపరిధినిచూచి
అమరసుఖమనుకునే
కూపస్థ మండూకాన్ని నేను–
నేనెవరోకాదు
పదహారణాల (నూరుపైసల)
పచ్చి భారతీయుణ్ణి–

జీవితం వెనుక....!

బషీరానంద్

చీకటి వెలుగులు చిరుతపాపలై ఆడుకుంటున్న
జీవితపు పచ్చిక బయళ్ళలో
కాలం మరుత్తువలె సాగిపోయింది.

జీవిత మంటే:

అనుభూతుల వలయం

ఆనంద బాష్పాలకు, ఆవేదనాశ్రులకు సేతువు.

జీవితం కళ్ళల్లో కావేరులు పొంగి
ఆనందపు గడ్డిపోచల్ని తుడిచిపెట్టుక పోయినవేళ
నిరాశ కరాళ హస్తాలు చాస్తోంది.

కన్నుల్లో కదిలే కాంక్షలు కన్నీటితో సమాప్తమైనట్లు
మిణుగురు పురుగుల్లా మెరిసి
చీకటి ఆవహిస్తోంది జీవితాన్ని.

అందుకే
గడిచిన జీవితపు తెరమీద
ఆనందపు ఛాయా చిత్రాలను చూస్తూ,
అన్వేషణా దృక్కులతో భవిష్యత్తుకై నిరీక్షిస్తున్నాను.

రేపు
నా ఆశా వల్లరి మొగ్గలు తొడగి పూలు పూస్తుంది.
ఆనందంగా కోసుకుంటాను.

ఈ ఆవేదనా హృదయానికి శాంతి లభిస్తుంది.
నా జీవిత కావ్యంలో ఆశా గీతాలు రాయాలని వుంది.
అపుడు నా ఆశల కర్థం వుంటుంది.

సమీక్షలు :

అర్థమనర్థమ్

సాహిత్యంలో దృక్పథాలు (సాహిత్య విమర్శ) ఆర్. ఎస్. సుదర్శనం
ప్రచురణ నవోదయ పబ్లిషర్సు, ఏలూరు రోడ్డు, విజయవాడ–2.
పుటలు 178 వెల సాదాప్రతి రు. 4/- మేలుప్రతి రు. 5/-

తెలుగులో సాహిత్య విమర్శ చాలా తక్కువ. పరిమాణం ఇప్పుడిప్పుడే పెరుగుతున్నది. ప్రమాణం అంతకంతకు తరుగుతున్నది. ఈనాడు తెలుగులో వస్తున్న సాహిత్య విమర్శ ముఖ్యంగా మూడురకాలని చెప్పవచ్చు. ఒకటి "అలంకార శాస్త్రులు" చేసేవిమర్శ. ఈ పద్యంలో ఈ అలంకారం ఉంది, ఈరీతి ఉంది, ఇక్కడ యతి తప్పింది వంటి విమర్శ. రెండవ విధమైన విమర్శ, కావ్యం ఏం చెబుతున్నది

అనిగాక తాము చెప్పదలచుకున్నదాన్ని కావ్యంలో కనుగొనే ప్రయత్నం చెయ్యడం, ఏ నన్నయగారి ఏమీ ఎరగని పద్యాన్నో రెండు మొట్టికాయలువేసి దానిచేత ఏదో పలికించి 'చూదారా ఇందులో ఇంతటి మహాధ్వని యున్నది. ఇది తెలుసుకొనుటకష్టము. నాకు తెలిసెనని మీకసూయ', అనటం ఈ విధమైన విమర్శ. మూడవరకపు విమర్శ- ఇది కావ్యంలోని సిద్ధాంతాలతోనేగాని కావ్యాన్ని ఏమాత్రము పట్టించుకోని విమర్శ.

ఇదీ స్థూలంగా యీనాడు తెలుగులో సాహిత్య విమర్శ. ఇంగ్లీషులో సాహిత్య విమర్శ విపరీతంగా వస్తున్నది పి.ఎచ్.డి పిచ్చిముదిరిన తరువాత విమర్శ ఒక వ్యాపారం. అంటే business అయింది.

సుదర్శనంగారు తమ పుస్తకంలోని చివరి వ్యాసంలో T.S. Eliot ను వివరిస్తూ అంటారు. "ఈ విధంగా తర్జుమాచేసి చెప్పటం టి.ఎస్. ఎలియట్ కవిత్వానికి కేవలం అపచారం చెయ్యటమే అవుతుంది" అని. నిజానికి ఏ విమర్శకూడా కావ్యానికి అపచారమే. ఈ అపచారం అనివార్యమైనంతవరకే చెయ్యడం సహృదయుడైన విమర్శకుని ధర్మం. ఈనాడు ముఖ్యంగా ఇంగ్లీషులో వస్తున్న విమర్శ తొంబదిపాళ్ళు క్షమింపరాని అపచారమే. క్రమంగా తెలుగు సాహిత్యంలోనూ ఈ పరిస్థితి ఏర్పడుతున్నది. అయితే అనుభూతికంటె ఆలోచన, సాహిత్యంకంటె విమర్శ పైచేయిగా ఉండటమనేది పారిశ్రామిక యుగధర్మంగా మనం సరిపెట్టుకోవలసివస్తుంది. జీవితంలో వలనే సాహిత్యంలోకూడా హృదయ వ్యాపారం సన్నగిల్లుతున్నది. పూర్వం కావ్యం లోనుండి ఆలోచన పుట్టింది. ఇప్పుడు ఆలోచననుండి కావ్యం పుడుతున్నది. ఈనాటి విమర్శ అందుకు అనుగుణంగానే సాహిత్యాన్ని సులభంగా మార్చుకోదగిన కరెన్సీలోకి తర్జుమా చేసుకుంటున్నది. సుదర్శనంగారు ఈ ఆలోచనా వలయంలో చిక్కుకున్నారు. అయితే ఆయనకు సంతృప్తి కలిగించగలిగిందేమిటంటే ఆయనకు అక్కడ చాలామంది మేధావులైన విమర్శకులు తోడున్నారు. సుదర్శనంగారి ఈ పుస్తకంలో ఆరు వ్యాసాలున్నాయి. 1. పెద్దన, 2. గురజాడ, 3. విశ్వనాథ సత్యనారాయణ, 4. గోపీచంద్, 5. చలం, 6. ఆధునికసాహిత్యంలో 'కాలం', వైవిధ్యము, వైరుధ్యము ఉన్న ఈ విషయంలో అంతస్సూత్రమైన తమ విమర్శనా విధానాన్ని 'ప్రవేశిక'లో రచయిత ఇట్లా వివరించారు. 'సాంప్రదాయికమైన విమర్శ.... 'కవిదృక్పథం ఏమిటి?' అనే ప్రశ్నకు ప్రాధాన్యం యివ్వదు ఈ ప్రశ్న చాలా ముఖ్యమైనది. కావ్యార్థం కవి దృక్పథంమీదే ఆధారపడిఉంది. 'కవిదృక్పథం' అంటే అతడు వాచ్యంచేసే అభిప్రాయాలే కావు; అతని జీవితానికి, వ్యక్తిత్వానికీ సంబంధించి అతనికి పూర్తిగా అర్థం కాని భాగం: సమకాలీన సంఘ జీవనంలో అతనికిగల పాత్రనూ సంబంధాన్నీ నిర్వ

చించే విషయం. దాన్ని కావ్యంలో దర్శించే ప్రయత్నంచేస్తేనే కావ్యస్వరూపం గోచరిస్తుంది; అప్పుడే హృదయగతమైన కావ్యాస్వాదనము మేధాగతమైన కావ్యార్థ వివరణగా రూపొందుతుంది. కావ్యార్థవివరణ సమగ్రంగా, సవ్యంగా చేయనివిమర్శ సాహిత్య విమర్శేకాదు ... కవిదృక్పథానికీ అతని కావ్యానికీ గల సంబంధం ఎప్పుడూ ఒక నిశ్చిత ప్రమాణమే (a constant) . ఆ ప్రమాణాన్ని ఆధారంచేసుకున్న విమర్శ ఏ దృక్పథంతో, ఏ కాలంలో వ్రాయబడిన పద్యకావ్యాన్నైనా గద్యకావ్యాన్నైనా సరే, దాని అర్థాన్ని వివరించి దానికి న్యాయం చేకూర్చగలదు. ("Nothing can permanently please, which does not contain in itself the reason why it is so, and not otherwise". coleridge) సాంప్రదాయికమైనవిమర్శ కవి దృక్పథానికి, వ్యక్తిత్వానికి ప్రాధాన్యం ఇవ్వనిమాట నిజమే. కాని కవివ్యక్తిత్వానికి అనుగుణమైనరూపమే కావ్యానికి కలుగుతుందన్నది ఆలంకారికులు గుర్తించారు. కవి శృంగారి అయితే అతనికావ్యము రసమయంగాను, విరాగిఅయితే నీరసంగాను ఉంటుందంటాడు ఆనందవర్ధనుడు. కాని కవిదృక్పథాన్ని నిశ్చయించడానికి ప్రమాణం కావ్యమే. కనుక కావ్య స్వరూపాన్నిబట్టే కవిదృక్పథాన్ని అనుమానించవలసిందేగాని కవి దృక్పథాన్నిబట్టి కావ్యస్వరూపం అర్థంచేసుకోవడమన్నది తలక్రిందైన ప్రయత్నం కావ్యేతర ప్రమాణాలతో కావ్యపరమార్థ వినిశ్చయం సాహిత్యవిమర్శ కాదు. జీవితచరిత్ర కావచ్చు. మనస్తత్వశాస్త్రంకావచ్చు. కేవలం కల్పనాసాహిత్యం (fiction) కావచ్చు. ఇంతకూ మనకు ఏదిప్రధానం? కవిదృక్పథమా? కావ్యమా? మొదటిదైనపుడు కావ్యేతర ప్రమాణాలను ఆశ్రయించడంలో తప్పులేదు. కానపుడు కావ్యమే శరణ్యం. కొలరిడ్జ్ అన్నదికూడా అదే. (సుదర్శనంగారు కొలరిడ్జ్‌వాక్యాన్ని ఎందుకు ఉద్ధరించారో తెలియదు)

ఇక 'కావ్యార్థ వివరణ సమగ్రంగా, సవ్యంగా చేయని విమర్శ సాహిత్య విమర్శేకాదు'. అంటున్నారు సుదర్శనంగారు. "అర్థమ"న్న పదానికి చాలా అర్థాలు చెప్పవచ్చు. 'ఈ పద్యభాగమునకు నీతి యేమి?' అని పరీక్షలలో విద్యార్థులను అడుగుతూ ఉంటారు. ఈ "నీతి"కి పర్యాయంగానే అర్థమన్నపదం సాహిత్యవిమర్శలో ప్రచురంగా ఉన్నది. కావ్యం ఇవ్వగలిగిన ఆనందంలో అంచెలున్నాయి. అందులో అర్థం మొదటిది. అందరికీ అందుబాటులో ఉండేదీ అదే. 'ఈకావ్యంయొక్క అర్థం ఇది' అని చెప్పినంతమాత్రాన ఆ కావ్యాన్నిగురించి మనమేమీ చెప్పినట్టుకాదు. ఈ అర్థప్రలోభం దొడ్డది. చెడ్డది. అర్థం ప్రధానమైనపుడు సాహిత్యానికి, బీజగణితానికి భేదముండదు. కనుకనే స్థూలంగా సాహిత్య విషయంలో "అర్థమనర్థమ్" అనవలసి వుంటుంది. అయితే సుదర్శనంగారి విమర్శనా విధానంలో కీలకమైన సంకేతాన్నివారు

'పరివేశ'లో ప్రస్తావించనేలేదు. అదే "ప్రతీక". వారి విమర్శనా విధానాన్ని వివరించనక్కర్లేదు. ఉదహరిస్తేచాలు. "మనోరమ బుద్ధికి ప్రతీక అయినట్లే, విధావసి మనస్సుకూ, కళావతి చిత్తానికీ ప్రతీకలు". (పెద్దన) పుట 26. "సౌజన్యారావు 'సౌజన్యం' అనే ఉన్నతాదర్శానికి ప్రతీక. మధురవాణి లోకంలో చెడ్డతో కలిసి కలగాపులగమై క్రమంగా నిగ్గుదేరి కదలివచ్చిన మంచితనానికి ప్రతీక.... 'జీవితానికి' ప్రతీకయైన గిరీశాన్ని..." (గురజాడ) పుటలు 46, 47.

"ఏకవీర ద్వంద్వాతీతమైన తత్వదర్శనమునకు ప్రతీక అయినచో కుట్టాన్ వ్యవస్థా ధర్మమునకు ప్రతినిధి" (విశ్వనాథ సత్యనారాయణ) పుట 53.

"మరణశయ్యమీదఉన్న పరమేశ్వరశాస్త్రి వైదికసంప్రదాయము." (గోపీచంద్)పు 141

"అమీనా చలంవ్రాసిన నవలపేరేకాదు. ఆ నవలలో అమీనాపాత్ర చలం అంతఃకరణకు ప్రతీకకూడా...." (చలం) పుట 146.

"చతురస్రాన్ని, కాలాన్ని జయించిన మానవుని మనస్సుకు ప్రతీకగా తీసుకుని శ్రీశ్రీ ఈనాటిక వ్రాశాడు." (ఆధునిక సాహిత్యంలో 'కాలం') పుట 171.

ఇంతవిరివిగా సుదర్శనంగారు ఈ "ప్రతీక"ను వాడుకొన్నారు. కాని అసలు ప్రతీకయొక్క తత్వానికి వారి ప్రయోగానికి సంబంధమున్నట్లు కనిపించదు. పాశ్చాత్య దేశాలలో ఆమధ్య ఒక ప్రతీకతా ఉద్యమం (Symbolist movement) వచ్చింది. ఆ సింబలిజానికి ఈ ప్రతీకలకు యెక్కడా పొత్తులేదు. అర్థం నిర్దిష్టంగా ఉండక పోవడము, వ్యంజనావైవిధ్యము ఈ సింబలిజమ్‌యొక్క మూలతత్త్వం. మల్లార్మే ఇందులో అమితవాది. 'ఒక్కటే కొండగుర్తు. అర్థమయితే అది కవిత్వంకాదు' అంటాడు. అయితే సింబలిజమ్ ఈ ఉద్యమంతో పుట్టిందేమీగాదు. అది ఒక పురాతన సాహిత్య ప్రక్రియ. Allegory, symbolism లకు భేదాన్ని వివరిస్తూ మేథిసన్ ("American Renaissance") Allegory మేధాగతమైన శిల్పమని, Symbolism భావనా (imagination) గతమని అంటాడు. అంటే Allegory కి Algebra కు దగ్గరి సంబంధముంటుంది. వ్యంజనావైవిధ్యానికి Allegory లో అవకాశంలేదు. సుదర్శనంగారు Allegory కి సమానార్థకంగా 'ప్రతీక'నువాడినట్లు కనిపిస్తున్నారు. The Divine comedy కి The Facrie Queene కు, Matthiessen కి Edmund Wilson కు ఉన్నభేదమే symbolism కి Allegory కి ఉన్నటువంటి భేదము.

ఇక సుదర్శనంగారి వ్యాసాలు, సాహిత్య విమర్శనుగురించి వారికున్న అభిప్రాయాలేవైనా, ఎన్నుకున్న రచయితలను వారు ఒక కొత్తదృష్టితో చూచారని చెప్పక

తప్పదు. అది సమగ్రదృష్టి. ముఖ్యంగా 'పెద్దన' లో. 'మనుచరిత్ర వేకటివరకు, వసుచరిత్ర చీకటివరకు' అన్న రాయలసీమ లోకోక్తిని ఆయన పట్టించుకోలేదు. ఒక కావ్యాన్ని మొత్తంగా పరిశీలించే ఓర్పులేనపుడు దాన్నిగురించిన అభిప్రాయాలు ఏర్పరచుకోవడం సరికాదు. నచ్చిన ముక్కలను మెచ్చుకోడమే సాహిత్యవిమర్శకాదు. మనుచరిత్రలో ప్రధానరసము శృంగారముకాదని, శాంతమని గుర్తించినపుడే కావ్యార్థం తెలుసుకోగలుగుతాము. అ టూరు, శరీరము భోగాసక్తమౌతుంది. ఆత్మవైరాగ్యంతో పరాఙ్ముఖత్వం వహిస్తుంది. ఈ సమస్యా పరిష్కారమే పెద్దన మనుచరిత్రలో చేసింది. 'ఉదాత్తశృంగారానికి శ్రీకారంచుట్టిన నవ్యకవులకు పితామహుండు పెద్దన', అన్నారు. అయితే నవ్యకవులు బాధపడవలసిన పనిలేదు. ఎందుకంటే ఆయన 'ప్రేమ'ను ప్రచారంలోకితెచ్చినవాడు కాదు. శృంగారానికీ, అది యెంత ఉదాత్తమైన దైనా, ప్రేమకూ సంబంధమేమిటో తెలీదు. శృంగారోన్ముఖంకాని చిత్తస్థితికి ప్రేమ అన్న అనుమానాస్పదమైన పదం అనవసరమనిపిస్తుంది. దయ, కరుణ అన్న పదాలు ఉండనే ఉన్నవి.

పెద్దన కవిత్వాన్ని యెట్లా పట్టించుకోలేదో, గురజాడ నాటకీయతనుకూడా సుదర్శనంగారు అట్లానే పట్టించుకోలేదు. ప్రవేశికలో చెప్పుకున్నారు, 'కావ్య విధే దాట్న గొప్పగా సిద్ధాంతీకరించే విధానం నేలవిడిచిన సాము,' అని. 'కన్యాశుల్కం'లోని గిరీశం పాత్రచిత్రణ, ప్రతీకాప్రతిష్ఠాపనతో ఆగిపోయారు 'ఇదే షేక్స్పియర్‌లో కనిపిస్తుంది' అని ఊరుకున్నారు. ఏదైనా పోలికలుంటే వివరించి ఉండవలసింది. అటు షేక్స్పియరుకు, ఇటు గురజాడకు కొంత సంతృప్తికలిగేది. గిరీశానికి, ఫాల్‌స్టాఫ్‌కు పోలికకూడా తక్కువే. ఏమైనా షేక్స్పియరు ఫాల్‌స్టాఫ్‌ను దేనికీ ప్రతీకగా వాడుకోలేదు. ఒక నాటకీయ ప్రయోజనంకొరకు ప్రవేశపెట్టాడు. ప్రధానమైన చారిత్రిక ఇతివృత్తంలోనికృతకగాంభీర్యాన్ని బయల్పరచడానికి Henry IVలో Falstaff పాత్ర పనికొచ్చింది. ఈ పుస్తకంలోని వ్యాసాలన్నిటిలోను పెద్దది విశ్వనాథ సత్యనారాయణమీదిది. అయినప్పటికి 'పెద్దన'లో చూపిన సమగ్రదృష్టి ఇందులో చూపలేదు సుదర్శనంగారు. (దానికి కొంత విశ్వనాథకూడా బాధ్యులేనని మనం ఒప్పుకోవచ్చు.) ప్రత్యేకమైన కావ్యాన్నేగాక ఒక రచయితయొక్క కావ్యాలనన్నిటిని ఒక మొత్తంగా, ఒక సమగ్రదృష్టితో చూడడం ఉత్తమవిమర్శ. విశ్వనాథను "ఇత్తి"చేసేప్రయత్నంలో ఈ సమగ్రదృష్టికి స్వస్తిచెప్పవలసి వచ్చింది. ప్రతీకతాపద్ధతికి లొంగక మొండికేసే నవలలను పట్టించుకోక, కొన్నినవలలను మాత్రమే ఇందులో చర్చించారు. అయితే ఈ వ్యాసంలో తెలుగువారందరు గర్వించదగిన ఒకటిరెండు observations ఉన్నాయి. " 'ఏకవీర'తో పోల్చదగిన నవల 'నౌకాభంగము'. అందులో భావనాత్మక ప్రేమకంటే

హిందూ వివాహవ్యవస్థ శక్తివంతమైనదంటూ నిరూపించేందుకు రవీంద్రుడు చేసిన ప్రయత్నం యెంత అస్తవ్యస్తంగా పరిణమించిందో, తర్కిస్తే విశదమౌతుంది. 'ఏకవీర'యొక్క తాత్త్వికమైన పటిమ దానికిలేదు. 'ఏకవీర' కావ్యమైన నవల."(పు54) " 'నౌకాభంగము' నుండి 'గోరా' వరకు రవీంద్రుడెన్ని మెట్లు పైకెక్కెనో, 'ఏకవీర' నుండి 'వేయిపడగలు' వరకు విశ్వనాథ అన్నిమెట్లు క్రిందికి దిగెను." (పుట 74) 'ఏకవీర' నవలలో వ్యవస్థ, వైయక్తికధర్మము అన్న ద్వంద్వానికి అతీతమైన సమన్వయాన్ని ప్రతిపాదించిన విశ్వనాథ వేయిపడగలలో ఆ ద్వంద్వంలో ఒకటైన వ్యవస్థనే మూలధర్మంగా ప్రతిపాదించాడు. ఇవి ఆయన దిగినమెట్లు. రవీంద్రుడు యిందుకు విపరీతంగా 'నౌకాభంగం'లో వ్యవస్థాధర్మాన్ని సమర్థించి 'గోరా'లో సర్వ ధర్మాలను పరిత్యజించాడు. ఇవి ఆయన యెక్కినమెట్లు. "ఈ భేదమే రవీంద్రుని విశ్వకవిని చేసినది. ఆయనకంటె ప్రతిభావంతుడైన విశ్వనాథను తెలుగు కవిసమ్రాట్‌గానే నిలిపినది." (పుట 74) 'రవీంద్రునికంటె ప్రతిభావంతుడైన కవి' అనిపించుకున్నవారు చాలామందిలేరు మనదేశంలో. విశ్వనాథకు ఆ కీర్తి వచ్చిందంటే మనమందరము గర్వించదగిందే.

గోపీచంద్ సుదర్శనంగారివంటి విమర్శకులకు పాయసంలాంటి వాడు. సమస్యలను పరిష్కరించటానికి పాత్రలు, సన్నివేశాలు కల్పించినవాడు గోపీచంద్. ఈవిధమైన పరిష్కార వ్యామోహం సృజనాత్మక రచనకే ఆటంకమేమో ఆలోచించ వలసివుంది. Friedric schlegel నిర్వచించిన [1]irony కి గానీ, కీట్సుచెప్పిన [2]negative capabilityకి గాని సాహిత్యంలో స్థానం లేకుండాపోతున్నది. అమీనాను గురించి సుదర్శనంగారు వ్రాసినది చదివినపుడు Allegory ని Symbol గావారు ఎట్లా భ్రమించింది స్పష్టమవుతుంది. ఆ నవలలో అమీనా ఒకపాత్ర. కాని అమీనాపాత్ర అన్న విషయాన్ని మరచిపోయి ఆ పేరు కనిపించినపుడల్లా 'చలం అంతఃకరణ' అనుకుని చదువుకుపోవాలి, అప్పుడు ఆ నవలలోని శిల్పాన్ని మనం మెచ్చుకోగల్గుతాము.

చివరి వ్యాసంలో కాలాన్ని గూర్చిన వైజ్ఞానిక తాత్త్వక జిజ్ఞాస యీనాటి సాహిత్యంలో ఎటువంటి మార్పులు తెస్తున్నది వివరించారు. 'కాలం' అనేది అవిద్యా లక్షణం. అంటే మనస్సుయొక్క ధర్మం. అనంతానికి, ఆద్యంతవంతమైన సృష్టికి మధ్యన ఉన్నది దేశకాల కార్యకారణత్వమనే మనోధర్మము. ఈ మనోధర్మాన్ని అధిగమించడమే అనంతత్వాన్ని చేరుకోవడం. ఈనాటి విజ్ఞానశాస్త్రం దేశకాల కార్య

1. "Irony is a clear consciousness of the infinitely full chaos."
2. "...being in uncertainties, mysteries, doubts, without any irritable reaching after fact and reason."

కరణత్వములు నిత్యములుకావని భ్రమకల్పితములని ఒప్పుకుంటున్నాయి. అయితే ఈ విజ్ఞానశాస్త్రఫలితం, విద్యుచ్ఛక్తిలాగ, అందరికీ పనికివచ్చేదికాదు. అంటే వేదాంతం చెప్పిందీ విజ్ఞానశాస్త్రం ఒప్పుకున్నదీ మనస్సుకు ఈ ధర్మాలున్నవనిమాత్రమే. అయితే ఈ మనోధర్మాన్ని నిర్జించటమన్నది ఏవ్యక్తి కావ్యక్తి చేయవలసినది, లేక ఆదికూడ విజ్ఞానశాస్త్రమే చేయగలుగుతుందేమొ చెప్పలేము. ఏదోవిధంగా యీ అవిద్య తొలగినపుడు, మనసుమాయమై, మాయ మాసినపుడు సాహిత్యం యెక్కడ ఉంటుంది? ఈ అన్వేషణా ఫలితం సాహిత్య రాహిత్యమేనా? "The end of socialism is the ending of socialism" అని Ernest Barker అన్నట్లు 'The end of literature is the ending of literature" అనవలసివస్తుందా? రావచ్చు. లేక సాహిత్యం సాహిత్యంగానే వుంటూ యీ అతీత మానసికస్థితికి యెంత చేరువగా రాగలదు? అన్నది రాబోయే సాహిత్యం తేల్చవలసిన ప్రశ్న.

సుదర్శనంగారి పుస్తకం ఆలోచనలను రేపుతుంది. అంటే అవసరమయిన పుస్తకమన్నమాట. అచ్చులో readability లోపించింది. త్రిదశులకే చత్వారం వస్తున్న ఈ రోజుల్లో అచ్చు స్థూలదృష్టికి అందేదిగా ఉండడం ముదావహం. పుస్తకములో విషయసూచిక లేదు. అచ్చు అలవాట్లు కొన్ని తికమకపెట్టేవిగా ఉన్నవి. "తన గొప్పతనం గుర్తించనివారిమీద రాడీలను2 వురికొల్పేందుకైనా వెనుదీయడు."(పుట66) 'రాడీలను2' రాడీశబ్దానికి ద్వివచన రూపమేమొ అనుకున్నాను. "2" అధోసూచికను సూచిస్తుందట.

ఇంతకంటె అందంగా నిర్దుష్టంగా ఉండదగినదీపుస్తకం.

—సూరపరాజు రాధాకృష్ణమూర్తి.

చీకట్లోకి........

"చీకటినుంచి" — నూతలపాటి గంగాధరం

ప్రతులకు: కళాసాహితీ, 83 లేక్‌వ్యూరోడ్, మద్రాసు-33 పుటలు: 100 వెల రూ. 3/-

---

మృత్యువు! మృత్యువు....!!
"అహో! అగమకిరణం
ఆహా! జీవితహరణం
మరోపయనం
సదాశరణం!"

కావ్యమంతా మృత్యుచ్ఛాయలు పరచుకున్నవి. మృత్యు విషవలయంలో పాఠకుణ్ణి చుట్టివేసి ఉక్కిరిబిక్కిరిచేయాలని 'చీకటినుంచి' కావ్యకర్త శ్రీ నూతలపాటి గంగాధరంగారు ప్రయత్నిస్తున్నారు. మృత్యువు విషవలయంకాక మధువలయమైనా మాకొద్దు! మృత్యువు జీవితానికి పరిరక్షణ అయితేకావొచ్చు. ఈకావ్యంలోనిభావాలు, ఆలోచనలు సోక్రటీస్ కాలంనాటివి— సోక్రటీస్‌వి మాత్రంకావు. సోక్రటీస్‌లాంటివారు యేనాడో మృత్యువునికూడా జయించారని రచయితకి తెలీకపోవడం విచారకరం! '1+1= .' శ్రీ శ్రీ నాటిక చదివితే ఈ మృత్యుభయం కొంచెమైనా రచయితలో పోవొచ్చు. మృత్యువుకు దాసోహమ్మనే స్థితిలోలేరు ఈనాటి మానవులు. 'విద్యుత్తు' అనే ఖండికలో విద్యుత్తును మనిషిలోని ప్రాణంగా ఊహిస్తున్నాడు

'ఇప్పుడే ఫోన్‌వచ్చింది ఫ్యాక్టరీకి
విద్యుత్తు కొన్ని క్షణాల్లో ఆగిపోతుందని!
....
....
మృత్యువనేదే లేకుంటే
జీవితంలోని మాధుర్యాన్ని
రుచిచూడలేడు మానవుడు!
అర్ధరాత్రి ఫ్యాక్టరీలో విద్యుత్తు
ఎప్పుడు ఆగిపోతుందో ఎవరికి తెలుసు?
ఒకని విశ్రాంతి
మరొకని పరిశ్రమకు నాంది!'

మృత్యువు ఇతివృత్తంగా ఇంకా 'సృష్టి-స్థితి-లయలు,' 'మృత్యుముఖగహ్వరం' అనే రెండు ఖండికలుకూడా ఉన్నవి.

'ఎంతో ఉత్సాహపడుచు కష్టింతుమౌర!
మృతియెలేకున్న రుచి యేది బ్రతుకులోన?' అన్న

గాలిబ్ గజల్‌ననుసరించి యివన్నీ రాయబడినవి. 'మృత్యువు'ను గురించి యింతగా రాయడానికి 'నీవుకలవు' అనే ఖండికలో జవాబు దొరుకుతుంది. 'దేవుడున్నాడు కనుక మృత్యువున్నది; మృత్యువున్నదికనుక దేవుడున్నాడు' అన్నభావం రచయిత రక్తంలో బాగా పేరుకపోయివుండాలి.

నింగి నేలపైబడక నిలుచుండుటనుగాంచి
కడలి తన వీచికల పుడమి ఔరుపమిగాంచి
నీవుకలవని ఎంతు! నేవనుధ నివసింతు!

అని భగవంతునిపై నమ్మకం ప్రకటిస్తున్నాడు. కానీ ఈ పంక్తులు ఎంతవరకు హేతు వాదానికి నిలబడతాయి. కవిత్వాన్ని హేతువాదంతో కొలవొద్దని ఆంక్షపెడితే— అడ్డుపెట్టేవారెవ్వరూ లేరిక్కడ!

నిత్యం జపతపాలు, సహస్రనామార్చనలు, కుంకుమార్చనలుచేస్తూ గడ్డాలు మీసాలు పెంచుకున్న పరమ భక్తాగ్రిగణ్యులే యీనాడు 'అన్నమో రామచంద్రా' అని అలమటిస్తున్నారు. అతివృష్టి, అనావృష్టికూడా భగవంతునిదయ అనుకొని విరాట పర్వంచదివి శివునికి సహస్రి జలఘటాభిషేకం చేసేవారు చదివితే చదవవచ్చు యీ కావ్యాన్ని!

'మంచితనం మృగ్యమైన ఈనాడు వంచననుచూచి భగవంతుడులేడనే అభి ప్రాయానికి రావలసివస్తుందేమోనని' ఈకావ్యానికి 'ఉషోరేఖలు' వ్రిసరించిన శ్రీ దాశ రథిగారుకూడా ఈ అభిప్రాయాన్నే వ్యక్తంచేశారు.

ఇందులోని మొత్తం 40 ఖండికలలో 'పిచ్చిగీతలు' అనేది ఒకటి. రచయిత ఉద్దేశ్యంలో ఇందులోనివి మాత్రిమే పిచ్చిగీతలయినా, ఈ కావ్యంలోని చాలావంక్తులు పిచ్చిగీతలనే నా అభిప్రాయం! ఈనాటి ఆధునికకవికి భయాలు, ధర్మసందేహాలు ఉండ కూడదు. ప్రతి ప్రశ్నకి జవాబు రెడీమేడ్‌గా ఉండాలి. తాను చెప్పదల్చుకున్నదేదో తనకే తెలియనప్పుడు, సందేహాస్పదమయినవాటిని పాఠకులపై రుద్దడం ఘోరం!

'చీకటినుంచి' అనేగీతంలో
చీకటిని ద్వేషించకు
లేమిని ప్రేమించు బ్రదర్
అప్పుడే
సఫలమవుతుంది, నీజన్మ!

అని అంటేఏమిటి? చీకటిని యెందుకు ద్వేషించకూడదు? చీకటి అంటే అర్థమేమిటి? రచయిత ఉద్దేశ్యంలో మృత్యువా? మృత్యువే ఐతే తప్పక ద్వేషిస్తాం. ఎన్నిచెప్పండి మృత్యువుని ప్రేమించేవాడెవ్వడూ! ఒకవైపు చీకటితెరలు తొలగాలని, భళ్ళున తెల్ల వారాలని కోరుతుంటే— ఈ రచయిత 'చీకటినుంచి' మళ్ళీ పాఠకుల్ని చీకట్లోకి నెట్ట డానికి ప్రియత్నిస్తున్నాడు.

చివరి మజిలీ

రవీంద్రబాబు, వాసు: ఆర్ట్ లవర్స్, హైదరాబాదు; వెల: రు. 1-50

'జీవితం ఒకేసారి వస్తుంది చనిపోయేసరికి; నాజీవితం వృధాకాలేదు అనుకోగల జీవితమే ఉత్తమజీవితం' అని లెనిన్‌సూక్తి. ఇంచుమించు అదేపద్ధతిలో దోపిడీ పూర్తిగా పతనమయ్యేవరకు, అన్నీ అందరికోసం అందేరోజువరకు బ్రతుకుతామని (అంటే బ్రతికినన్నాళ్ళు అంతవరకు కవిత్వం రాస్తామని) చివరి మజిలీ కావ్యకర్తలు రవీంద్రబాబు, వాసుగార్లు ధైర్యంగా అంటున్నారు. వాళ్ళూ వాళ్ళకావ్యమయిన చివరి మజిలీ అంతవరకు బ్రతుకుతుందనికాదు కానీ వాళ్ళలోని ధైర్యాన్ని మెచ్చుకోవాలి. వాళ్ళు వూహిస్తూ, చదువుతూ, అనుభవిస్తూ బ్రతుకులోని సత్యాల్ని ఏతొడుగులు లేకుండా, ఆలంకారికశైలిలోకాకుండా, స్వచ్ఛమైన తేటతెలుగు మాటలలో వివరిస్తున్న తీరును పరిశీలించాలి. రచయితలకి ఈమాత్రం యోగ్యతలుచాలు వాళ్ళని వాళ్ళు అభినందించుకోవడానికి విరహాలు వేధిస్తున్నప్పుడు, తరహాలు గాధిస్తున్నప్పుడు వలపుల తలపులు గిలిగింతలు పెడుతున్నపుడు, చల్లనివెన్నెలలు, తియ్యని సాయంత్రాలు, సన్నని సమీరాలు పెనవేస్తున్నపుడు. వీరి ఆలోచనలకి, అనుభూతులకి అమాంతంగా అడ్డు పడింది 'శ్రీశ్రీఖడ్గం'. ఇది ఈకావ్యపుట్టుకకి హేతువు. అంతేకాదు బారుషాపుల బీరువాలలోంచి సీజనల్‌గా త్రీస్టార్స్ బ్రాందీని దిక్-లరూపంలో ఘాటుగా ముక్కుపుటాలు పగిలిపోయేలా మేధావులకీ, సామాన్యులకీ కవిత్వాన్ని(?) అందిస్తున్న దిగంబరుల(?) మధ్యనుంచి— జరీ అంబారీలు వేసుకున్న మదకరీంద్రముల తొక్కుళ్ళనుంచి నలిగి బయటపడి ఈ కావ్యం చివురించింది వీళ్ళకవిత్వానికి తోడూనీడగావుండి కవిత్వాన్ని రాయించింది దరిద్రసమాజమేనని నిజాయితీతో చెప్పుకుంటున్నందుకు అభినందనీయులు!

'మాతోకవిత్వము' అనే తొలి కవితలోనే నచ్చినవారిని పొగడడం, నచ్చని వారిని తెగడడంచేశారు. శబ్దాల జరీఅంచులమధ్యా, భావాల మత్తువాసనలమధ్యా దేన్నీ దాచి చెప్పేఅలవాటు వీరికిలేదు. చెప్పదల్చుకున్నదేదో నీళ్ళనములుడులేకుండా, శబ్దాడంబరంలేకుండా ముక్కుసూటిగా చెప్తున్నారు. చెప్పేదాంట్లో కవిత్వం వుందా లేదా అని వీరికి అక్కర్లేదు.

ఇందులో మొత్తం లెక్కపెడితే (విషయసూచిక లేదు) ఇరివై ఖండికలు ఉన్నవి. ఆలోచనలకి వికృతరూపాలు ఇవ్వకుండా, ఉన్నది ఉన్నట్టుగానే అక్షరాలా పొందుపరిచారు కాబట్టి ఈకావ్యాన్ని గబగబా గంటలోపల చదివేయవచ్చును. మచ్చుకి వీరికావ్యం ముగింపులోని కొన్ని స్వచ్ఛంద కవితా పంక్తులు—

బారుల్లో లోఫర్లు, గొందుల్లో డాఫర్లు
వెళ్ళగొట్టబడ్డ ఇల్లాళ్ళు, తెచ్చిపెట్టికున్న వెలయాళ్ళు
అందరూ కలిసిపాడారు ఆనందంగా వందేమాతరం!
కవిహృదయం కలతతోపాడింది.
నల్లబజారు తెల్లటోపీలోంచి పాడింది
శుష్కపిప్పియాలు, శూన్యహస్తాలు
వందేమాతరాన్ని వర్ణించి పాడాయి
ఆగష్టు 15 ఆకలితో పాడింది వందేమాతరం
(ఆగష్టు పదిహేను)

ఇదీ వీరి కవిత్వం! వెధవాయత్వం మరపించే పాటపాడి భావికి బాటవేసిన యుగకర్త గురజాడకు అంకితమయిన ఈకావ్యానికి శ్రీ కె. వి. రమణారెడ్డిగారు అభ్యుదయ కవిత్వానికిఉండే ఆగచాట్లను అక్కడక్కడా వివరిస్తూ ఉపోద్ఘాతంగాని ఉపోద్ఘాతం రాశారు.

—జలజాసన.

సాహిత్య ప్రయోజనం యేమిటి?

పై శీర్షికతో కళాశాల విద్యార్థులకు చైతన్య సంస్కృతి, జడ్చెర్ల నిర్వహించిన వ్యాసరచనపోటీ గడువు తేదీ పొడిగించినప్పటికీ తృప్తికరమయిన వ్యాసాలు రాలేదు. వచ్చిన వానిలో

1. టి. ఉదయపర్లు, పి.యు సి. (ఆర్ట్సు)
   వివేకవర్ధని సాయంకళాశాల, హైదరాబాదు.
2. దేవిరెడ్డి వెంకటరెడ్డి, విద్వాన్ చతుర్థ సంవత్సరం
   ఎస్.వి. ఓరియంటల్ కాలెజ్, తిరుపతి.

రాసిన వ్యాసాలు కొంత తృప్తికరంగా కనిపించినవి. బహుమతి నలభై రూపాయలు యీ యిద్దరికీ సమానంగా పంచబడి చెరి యిరవై రూపాయిలపుస్తకాలు పంపబడుతవి. ఈ పోటీ నిర్వహణలో సహకరించిన అందరికీ ధన్యవాదాలు.

జలజం సత్యనారాయణ
కార్యదర్శి, చైతన్యసంస్కృతి, జడ్చెర్ల,
బాలానగర్ పోస్ట్, మహబూబ్‌నగర్ జిల్లా.

సాహిత్యలేఖ :

ఆర్యా!

శ్రీ నిఖిలేశ్వర్ అన్నట్లుగా (సృజన- 9, నవంబరు 1968) 'తార్‌సప్తక్' "ఆనాటి హిందీకవిత బూజుదులిపి నూతన ఉత్తేజాన్ని-బలాన్ని" హిందీ సాహిత్యానికి ఇవ్వకపోగా, 'తార్ సప్తక్' ప్రచురింపబడ్డ పది పన్నెండేళ్ళదాకా (అనగా 1943నుంచి 1953-55 వరకూ) "ఛాయావాద్ లేక స్వచ్ఛందతావాది కవిత్వ"మే తన రాజ్యం చలాయించింది. 'తార్‌సప్తక్' కవులలో ముక్తిబోధ్, రామ్‌విలాస్ శర్మలు తప్ప మిగిలిన వారు 'అభ్యుదయ-ప్రయోగవాది' పద్ధతులను వదలి పరంపరాగత కవిత్వధోరణిలోకి, అంటే రొమాంటిక్, ఛాయావాది కవిత్వాల సీమలలోకి జారిపోయారు. నేడు నేమీచంద్‌జైన్, ప్రభాకర్ మాచివే, అజ్ఞేయ్ ఆధునిక కవులుగా గణింపబడటంలేదు. వీరందరూ క్షణిక, అల్పలాభాలకోసం తమ సిద్ధాంతాలను మార్చుకొని ప్రతియోగాత్మక కవిత్వాన్ని నెత్తికెత్తుకొవటందాకా వచ్చారు. ఈమధ్య మహాసముంద్ అనేచోట ఒక సాహిత్య 'వర్క్-షాపు'లో మాట్లాడుతూ, నేమీచంద్‌జైన్ నవసాహిత్యాన్ని ఒక పార్టీ స్లోగన్లతో పోల్చారు. ఆయన, శ్రీ మాచ్‌వే ముక్తిబోధ్‌ను తన దృక్పథాన్నుంచి తొలగించటానికి ఎంత ప్రయత్నం చేయలేదు? ఇంక, రామ్‌విలాస్‌శర్మ కవిత్వాన్నితగ్గించి కథలవైపు తిరిగారు. (అజ్ఞేయ్ భావకవిత్వ ధోరణిలోకి దిగజారినట్లు నిఖిలేశ్వరే గుర్తించారు.) ఇటువంటి పరిస్థితులలో 'తార్‌సప్తక్' కవులందర్నీ అభ్యుదయ కవులనటం సబబుగా తోచదు.

పైగా 'తార్‌సప్తక్' కవితలలో అభ్యుదయ ప్రయోగవాది తత్వాలు అంతగా కన్పడవు(ముక్తిబోధ్‌లో కొంతవరకు తప్ప). మరి ఆ కవుల విశిష్టత ఏమిటంటేవారు తమతమ కవితా సంకలనాలకి వ్రాసిన ఉపోద్ఘాతాలలో తమతమ కవితలలో అభ్యుదయ ప్రయోగవాది తత్వాలను తే ప్రయత్నం చేస్తున్నట్లు, ఇది పరంపరాగత కవిత్వాన్ని అరికట్టి కవిత్వానికి నవ్యరూపం యిస్తుందని పేర్కొనటమే. ఉపోద్ఘాతాలలో చెప్పిన పటిమ పద్యాలలో కన్పడదు. ఎప్పుడైతే 'తార్‌సప్తక్' అనుకున్న దుమారాన్ని లేపలేకపోయిందో, ఆ కవులంతా (ముక్తిబోధ్ తప్ప) ఉపోద్ఘాతాలలో ఉల్లేఖించిన పద్ధతులను వదలి పరిపరివిధాలపోయారు.

మరి హిందీలో ఈ నయీకవిత ఎప్పుడు ప్రాణంపోసుకుంది అన్న ప్రశ్నకు సమాధానం వేరే ఇవ్వాల్సివస్తుంది,

నిఖిలేశ్వర్ 'దూసరాసప్తక్' గూర్చి వ్రాశారుకాని, అంతకంటే ముఖ్యమైన విషయం 'తార్‌సప్తక్' ద్వితీయ ముద్రణ సంగతి మర్చారు. 1943 నుంచి పూర్తిగా 20 ఏళ్ల తర్వాత 'తార్ సప్తక్' ను రెండోసారిగా 1963లో ముద్రించారు. ఇందులో ప్రథమ ముద్రణలోని ఉపోద్ఘాతాలతో ఆ కవులు 20 ఏళ్ళ తర్వాత కవితాదృక్పథాల గూర్చి తామే వ్రాసుకున్న 'పునశ్చ' భావాలు ముద్రింపబడ్డాయి. ఆ కవుల కవిత్వ సిద్ధాంతాలు 20 ఏళ్ళలో ఎంత మారినాయో, ఎంత నిల్చాయో ఈ రెంటినీ సరిపోల్చితే బాగా తెలుస్తుంది.

అత్యాధునిక హిందీ కవితారంగంలో మంచి కృషిచేస్తున్న కవుల లిస్టుకు శివ్‌కుమార్ శర్మ 'మలయ్' ని కల్పవలసినది. "హాథోఁలియోంకి సముద్ర్" పేరున 1962 లో ప్రచురింపబడ్డ 'మలయ్' కవితా సంకలనం నిఖిలేశ్వర్‌ను ఆకర్షించలేదా?

కె. పి. సారథి.
వరంగల్-1.

ఎంతో ముచ్చటగా వచ్చింది చిత్రం రంగులలో. అంత ముఖ్యమయిన పత్రికకు నా చిత్రం కవరుకి పడడం ఎంతో గౌరవంగా భావిస్తున్నాను

అందులోని రచనలు.... ఎంతో బావున్నాయి. చక్కటి tastes తో కూడు కొని వున్నది పత్రిక. తెలుగులో యింత వున్నత స్థాయిలోవున్న మరొక పత్రిక నాకు తోచదు....

ముందడువేసే మీ పత్రిక చాలామందిని వెంటతీసుక వెళ్తుందని ఆశించడంలో ఏమి విశేషం లేదు నాకు.

పత్రిక భవిష్యత్తు కోరుతూ

బోస్టన్
అమెరికా

....
రామారావు

'మహాప్రస్థానం'కు చలంరాసిన యోగ్యతా పత్రం:

సాంస్కృతిక విప్లవ స్వాగత పత్రం.

శ్రీపతి.

శ్రీశ్రీ కవిత్వానికి చలం సర్టిఫికేట్ యివ్వాడంటే ఆశ్చర్యంగా ఉంటుంది. చెలం నమ్మకాలకీ, శ్రీశ్రీ కవిత్వానికీ సామ్యతకంటే భేదమే ఎక్కువ. అది చెలమే ఒప్పుకున్నాడు. స్త్రీలకోసం మూలుగుతున్నవాడు చెలం. వ్యక్తి ఆత్మవికాసంకోసం, మానసిక స్వేచ్ఛకోసం పోరాటం అతడిమార్గం. స్త్రీని బలిపశువునుచేసిన సంఘంమీద అతడి కసి. సృష్టిలోని మార్మిక సౌందర్యానికి ముగ్ధుడయిన ఆస్తికుడు. భావుకత పదునుపున్నవాడు. సంక్షిప్తంగా చెలం పోరాటం పరిధి అది.

మరి శ్రీశ్రీ అట్లాకాదు. దిక్కుల్ని, దేవుల్ని, అధికారుల్ని ప్రశ్నించాడు. ఊగించాడు. నీళ్లలేక ఎండిపోతున్న గడ్డిపోచ ఆర్తనాదం వినిపించాడు. నూతనయుగ నిర్మాతల కొత్తరక్తాన్ని కదనుతొక్కించి సంగీతాన్ని వినిపించాడు. నవప్రపంచ నిర్మాణ కర్తల ఉత్సాహంతో కంఠం కలిపి పాడేడు. సృష్టినే ప్రశ్నిస్తున్న యువకుల లక్ష కంఠాల్ని ఏకంచేసి పలికాడు.

అట్లాంటి శ్రీశ్రీకి చెలం సర్టిఫికేట్ ఇవ్వటం ఆశ్చర్యమే. కాని శ్రీ శ్రీ ముందుమాట వ్రాయమని చెలాన్ని అడిగాడు. అయితే చెలానికున్న యోగ్యతలేమిటి?

సామాజిక వ్యవస్థమీద ముఖ్యంగా స్త్రీ సమస్యలమీద సొంత సిద్ధాంతాలు ఉన్నవాడు. సాంప్రదాయాల కట్టుబాట్లమీద తిరుగుబాటు చేసినవాడు. బానిసవ్యవస్థలోని కుళ్లను ఎత్తిచూపించే నిశితమైన విమర్శనాశక్తితో ఆనాటి మేధావులనిసైతం గాయపరుస్తున్నవాడు. వర్గశ్రేయస్సుకోసం స్థిరపరచిన నీతితో పోరాటం పెట్టుకుని ఒంటరిగా పోరాడుతున్నవాడు. పాశ్చాత్య దేశాలలోని విజ్ఞానోదయానికి స్వాగతంచెప్పి స్వీకరించిన ధైర్యం ఉన్నవాడు. ఇది చెలానికున్న వస్తుసంపద.

పదునుపెట్టిన కత్తిలాంటివాక్యం, ఆత్మప్రకంపనలని పట్టుకునే కవితావేశం, మైక్రోస్కోప్‌లాంటిచూపు, మేధస్సుని శస్త్రచికిత్స చేయగలిగిన నైపుణ్యం, మందులాంటి

భావాలు, ఆలోచనలు, తోటిమానవునిమీదప్రేమ, వ్యక్తిత్వం వికసించనిదే స్వాతంత్ర్యానికి అర్థం లేదన్న ఆరాటం, సెంటిమెంట్లని తన రచనలతో విరగ్గొట్టుతున్న సాహసం, ఆదర్శాలని ఆచరించగల కర్మణ్యత, ధీరత్వం చెలానికున్న గుణసంపద. ముందు ముందు వచనకవిత్వం అని పేరుపెట్టుకుంటున్న పోకడలలో భాషని సంపన్నంచేసిన గౌరవం ఉన్నవాడు— ఆనాటి భావకవిత్వం గురించి ఆ కవులకంటె ఎక్కువ తెలుసు కున్నవాడు అవటంచేత— తన కవిత్వంలోని మోటివ్‌స్ప్రింగ్స్‌ని ఎనలైజ్‌చేసేశక్తి చెలంకే చేతనవునని ఆ ముందుమాటకోసం అడిగిఉంటాడు శ్రీశ్రీ.

మహాప్రస్థానం యోగ్యతాపత్రింమీద చాలామందికి ఒకే అభిప్రాయముంది గొప్ప పీఠికలని. చెలం అంటే పడనివాళ్ళుకూడా మహాప్రస్థానంకంటే ఆ పీఠిక అద్భు తమైనది అనేవాళ్ళు ఉన్నారు. శ్రీశ్రీ కవిత్వాన్ని చదివినట్టుగానే ఆ చెలంరాసిన వచనాన్ని కంఠతా పెట్టినవాళ్ళున్నారు. ఏ ఆలంకారికులనీ ఉదహరించకుండా, ఏ పాశ్చాత్య సిద్ధాంతాలనీ చర్చించకుండా, వ్యాకరణవేత్తల అయోమయ తర్కానికి పోకుండా, కావ్యలక్షణాల ఛందోగ్రంథాలఊసు ఎత్తకుండారాసిన ముందుమాట తెలుగు కవుల పొగడ్తని సంపాదించింది అంటే దానికి సహజమైన బలం, అందం ఉండటం చేతనే.

సాంప్రదాయకంగా కవిత్వానికి రాసేపీఠికలలో ఆనందవర్ధనుడు చెప్పినట్టుగా విన్నాడుకాబట్టి అనీ, కాళిదాసు చేసినట్టుగా చేసాడనీ, శ్లోకాలనీ, పద్యాలనీ ఎత్తి తెచ్చి చూపి పొగిడి తమ బలహీనపు గొంతుని, అబద్ధపు వాదనని, కవిత్వాన్ని పరిచయం చేయలేని అయోగ్యతని సమర్థించుకుని ఆత్మని వంచించుకోవడం చూస్తాం. కవిత్వానికి కవికీ ఒకేదెబ్బతో చెయ్యాల్సి అపచారం అంతాచేస్తారు- ఆ పీఠికాకర్తలు.

చెలంరాసిన ముందుమాటలో అంతా వస్తువుమీదిచూపుతో కవిత్వపు ప్రయో జనంమీద ఉన్నగౌరవంతో, కవినిజాయితీ మీది విశ్వాసంతో, ఐక్యమై, ఉప్పొంగి, ఉద్రేకపడి శుద్ధమైన అనుభూతిని యథాతథంగా పంచిపెట్టాలన్న ఊపులో రాసిన ఆలో చనల పరామర్శ పరుగు మనకి అక్షరమక్షరంలో కన్పిస్తుంది.

'నమ్మిన కాళ్ళకింద భూమి తొలుచుకుపోతోవుంటే', 'హృదయాలమీది పెంకులు పగిలిపోతున్నాయి', 'ఆత్మలోకంలో దివాలా', 'గాలిదెబ్బలకింద ఎగిరిపడే సముద్రపు తుపాన్ గర్జనం', 'కాలికింద నలిగిన చీమల కాళ్లు విరిగిన చప్పుడు', 'పాత గోరీలకేసి మొహాలు తిప్పుకున్న' లాంటి పదప్రయోగాలతో విమర్శకున్న నిబంధనల్ని మించి ఆత్మకు సూటిగా తాకే వాక్యాలతో కవితాస్థాయిని ప్రకటిస్తాడు.

ఆ మొత్తం పీఠికంతా చైతన్య స్రవంతిలో పరుగెత్తిన కవిత్వతత్వ పరిశోధన. నిర్వచనాలతో, సందర్భాలతో, కథలతో, దృశ్యాలతో, ఆదేశాలతో, సింబల్స్‌తో, ఉద్రేకంతో, ఊపుతో, ఊపిరిపీల్చుకోటానికికూడా విరామమివ్వకుండా తనహృదయంనించి మన హృదయానికి డైరెక్ట్‌గాపంపిన, తనతోపాటు పరుగెత్తించిన అనుభూతిబలం అది, కొత్తలోకాలకి మన చూపునువిప్పే కొత్తప్రయత్నమది.

ఆ పీఠికరాసి ఇప్పటికి ఇరవై ఎనిమిదేళ్ళయింది. అప్పటికింకా యిప్పుడు దేశంగురించి కలలుగంటున్న ఈ యువతరం పుట్టలేదుకూడా. ఏ వెలుగుకోసం ఆనాటి యువతరం కలలుకన్నదో ఆ వెలుగు యింకా దూరమే అయ్యిందికాని దగ్గరకాలేదు. ఆకలి అన్యాయం ఆశ్రిత పక్షపాతం ఇప్పుడూ ఉన్నాయి. కాంతిలేని, ఊపిరిలేని, జవంలేని జీవంలేని యువతరం మనల్ని చుట్టుకునే ఉంది. రాజకీయ నాయకుల వక్రభాష్యాలకీ, రాజ్యాంగవేత్తల సంకుచితవాదాలకీ, ధర్మాలకీ, యుద్ధంలోకి నెట్టుతోంటే పోయేసైనికుల్లాగ అమాయికంగా పిచ్చిగా జనం ఇప్పుడూపోతున్నారు. సొంత ఆలోచనలేదు. ఆరోగ్యకరమైన ఉద్రేకంలేదు గుండెధైర్యంలేదు. పట్టుదలలేదు. కళ్ళముందు జరిగే అన్యాయాన్ని కొరకంచులతో కాల్చలేని, తన కాళ్ళమీద తాను నుంచునే విశ్వాసంకూడాలేని, ఇంకా వారసత్వపు ఆస్తులకోసం తాళాలకోసం బిక్కుబిక్కు చూపులతో కూచునే యీ యువతరం ఆఫీసుల్లో, కార్ఖానాల్లో, రైళ్ళల్లో, బస్సులో నవ్వుముఖాలుకూడాలేకుండా రోగగ్రస్తంగా బతుకు ఈడుస్తోన్న యీ యువతరానికి పదేళ్ళ ఆగి చదవాల్సిన పనికూడాలేదు.

నలభైసంగతి. బాంబులు కురుస్తున్నాయి. మరఫిరంగులు మోగుతున్నాయి, చెరసాలలు నిండుతున్నాయి. విప్లవాలు జరుగుతున్నాయి పాతపద్ధతులు, విశ్వాసాలు ధర్మాలు అన్నీ ఓమూలనించి కూలిపోతున్నాయి. అయినా కవిత్వంలో మార్పులేదు. కవులు భాగ్యవంతులపాలిటి ఈశ్వరుడిమీద స్తోత్రశ్లోకాలు చదువుతున్నారు. వాళ్ళకి సంఘం సంగతి పట్టలేదు. నూతన యుగనిర్మాణం కోసం ధర్మయుద్ధంచేసే శ్రీశ్రీ ఆవిర్భావం సాంస్కృతికరంగంలో విప్లవానికి తొలినినాదమని, సాంఘిక ఆర్థికరంగాలలో విప్లవానికి రణభేరి అని గుర్తింపచేయటం చెలంపని. ఆ భగీరథ ప్రవాహాన్ని దూరానచూసి స్వాగతం చెప్పినవాడు చెలం.

కళకోసం కళ అన్నది పలాయనవాదుల సమాధానం. చెప్పదలచుకున్నదేమిటో ఎవరికో ఎందుకో వాళ్ళకి తెలీదు. అంచేత అర్థ అస్పష్టతని దాచటానికి వాళ్ళకి ఛందస్సుకావాలి. అలంకారాలు కావాలి. కఠినపదాలు కావాలి. దాంతో గంగిరెద్దులా తయారవుతుంది కవిత్వం. అట్లాంటి కవిత్వపుకాలం అంతమయింది. సూటిగా

సులభంగా చెప్పేసి, కార్యాలకి. విజయాలకి వ్యవధినిచ్చి తన ప్రయోజనం తానే ధ్వనింపజేసే కవిత్వం యీరోజు కావాలి. అందువల్లనే అగ్గిపుల్ల, కుక్కపిల్లకూడా కవిత్వమయింది.

చెలం మాటల్లో— తనకీ ప్రపంచానికీ సామరస్యం కుదిరిందాకా కవిచేసే అంతర్ బహిర్ యుద్ధరావమే కవిత్వం. వ్యక్తికీ సంఘానికీ సామరస్యం కుదరాలి. రాజీకాదు. సంఘానికి వ్యక్తి అతీతుడుకాదు. వ్యక్తిత్వవికాసానికి సంఘం ఉరితాడు కాకూడదు. అంతర్యుద్ధంలో ఆత్మసంస్కారం సాధించుకోవాలి. నైతిక క్రమశిక్షణకి కట్టుబడాలి. నిగ్రహం చూపాలి. జీవితరథచక్రాలకింద నలగాలి బహిర్యుద్ధంలో వస్తుగత దృష్టి ఏర్పడాలి. ప్రపంచపు బాధఅంతా తనబాధ అవాలి. ఈ నిబంధనలకి లొంగని దిక్కుల్ని, దేవుల్ని, అధికారుల్ని, ఊగించి ప్రశ్నించే శ్రీ శ్రీ పద్యాలు కొత్త కవిత్వపు కాలానికి మేలుకొలుపులు పాడాయి.

ప్రపంచప్రజలు ఒకరికొకరు దగ్గరవుతున్న ప్రయత్నంలో జీవితపువిలువలు ఈనాడు మారిపోతున్నాయి. సాంప్రదాయాలు వివేకానికీ, విజ్ఞానానికీ అంతుచిక్కడం లేదు. పరిణామశీలతవేగం హెచ్చింది. కొత్త అధికారాలని స్థాపించటంకోసం రాజకీయ శక్తులు ఘర్షణపడ్డాయి యుద్ధమొచ్చింది. మనదేశానికి స్వరాజ్యమొచ్చింది. దేశం చీలిపోయింది. అధికారం దేశీయుల చేతుల్లోకి మారింది. గణతంత్రి రాజ్య మయింది. రాజ్యాంగచట్టం జాతికి బహూకరించుకున్నాం. పౌరసత్వపు హక్కులు దొరికాయి. పరిపాలనా వికేంద్రీకరణ జరిగింది. ఎన్నికలొచ్చాయి. భాషారాష్ట్రాలు ఏర్పడ్డాయి. ధరలు పెరిగాయి. రూపాయివిలువ పడిపోయింది. సరిహద్దుయుద్ధాలు జరిగాయి. మతకలహాలు రగుల్కొన్నాయి. పేదరికం మరింత వ్యాపించింది.

ఈ మార్పులన్నీ సంఘం నమ్మకాలని ప్రశ్నించాయి. ఎదురుతిరిగాయి. నియమాలని ఉల్లంఘించాయి. జీవితపు పరిధిని పెంచాయి. సామాజికవ్యవస్థకి కొత్త అర్థాన్ని చెప్పాయి. ఈరోజు రాజులకు భరణాలు యివ్వాలన్నవాళ్లు వున్నారుకాని మళ్ళీ రాచరికం కావాలన్నవాళ్ళు లేరు. పారిశ్రామికాభివృద్ధీ, హరిజనోద్ధరణ వర్ణ వ్యవస్థని పగలగొట్టుతున్నాయి. డబ్బు సంపాదనకోసం మతమూ, నీతీ, భాషా, కులమూ, ఆచారమూ, సాంప్రదాయమూ అడ్డురావటంలేదు. పదవికోసం చిన్నాపెద్దా భేదాలు మానేసి డబ్బుతోనో, కత్తితోనో, స్త్రీతోనో ధర్మాధర్మాలను మరచిపోయి గమ్యాన్ని చేరుకుంటున్నారు. దేశభక్తి, పౌరధర్మము, ప్రగతి, త్యాగము, ఉద్యోగ ధర్మము, సమాజశ్రేయస్సు విస్మరించి లంచాలు ఇచ్చో, లంచాలు పుచ్చుకునో విద్యావంతులు తమపనులను సాధించుకుంటున్నారు. ఇన్నిమార్పులు కళ్ళముందు కని

పిస్తున్నా ఇంకా సాంప్రదాయానికి వేలాడుతున్నారంటే వాళ్లు అవకాశవాదులుమాత్రమే. ఈ అవకాశవాదుల్ని తుదముట్టించుటయే సాంప్రదాయాలమీది తిరుగుబాటు ఉద్దేశం.

అన్యాయాలు, అధికారాలు, ఏడుపులు, క్షామం, యాచకాలు, క్షుద్ర కవిత్వాలు, శిక్షలు, స్కాండల్స్ ఉండకూడదని లోకం కోసం శ్రీశ్రీ చేస్తున్న బహిర్ యుద్ధంలో ప్రధానశత్రువు సాంప్రదాయం. పాత పదాలు, అరిగిపోయిన డిక్షన్, వర్ణనలు, అలంకారాలు, ఛందస్సు, పద్ధతులు, ఆచారాలు, కవిత్వంలోవీ, జీవితంలోవీ విరగ్గొట్టి కొత్త ఆయుధాలను చేపట్టాడు. మాటలను మంటలుగా ఈటెలుగా మార్చాడు. నెత్తురూ కన్నీళ్లూ కలిపి కొత్త టానిక్ తయారుచేసాడు.

దేవుడు, అధికారాలు, పాతిఘ్లు, సౌఖ్యాలు, నీతులు, స్వర్గం, మర్యాదలు మూటకట్టుకుని కులికేవాళ్ళకి బాధ, మరణం, దరిద్రం, అవిశ్వాసం, అశాంతి అర్థం కాక, అట్లాంటివాళ్ళు శ్రీశ్రీని బహిష్కరిస్తారు. వీటన్నిటినీ చెలం యెత్తిచూపాడు.

ఎప్పుడూ ఏ విప్లవంకూడా ఏ ఒక్కరంగంలోని విజయంతోనో సత్ఫలితాల నివ్వదు. మన స్వాతంత్ర్యపోరాటానికికూడా యీ గుణమే అన్వయించింది. పరస పాలననించి విముక్తికోసం చేసిన రాజకీయ విప్లవం విజయవంతమయింది. స్వరాజ్యం వచ్చింది. కాని సామాజిక శక్తుల ఇరుకుతనంనించి, తిరోగమన మార్గంనించి, కుట్ర నించి, మూఢనమ్మకాలనించి, మారుతున్న జీవితపు విలువలకి నిలబడలేని సంఘ సాంప్రదాయపు పట్టునించి విముక్తికోసం పోరాటం జరుగలేదు. దేశభక్తి ఒక ఉద్రేకంగా పొంగిందే తప్పించి, నిర్మాణాత్మకమైన సంస్కరణగా, సాధనగా సంపన్నం కాలేదు. ఆనాటి దేశభక్తుని మొదటినినాదం తెల్లదొరలని తరిమేయటంవరకే పరిమితమైంది. అదే స్వాతంత్ర్యమనీ, విజయమనీ ఉద్దండులయిన నాయకులు సహితం భ్రమపడ్డారు. అవిద్య, అసమానత, పేదరికం, కులభేదాలు, మతోన్మాదం, దోపిడీ విధానం, ఆలోచనధోరణిలో బానిసత్వం, నూతన పరిశోధనలకి, ప్రయోగాలకి వెలి- మొత్తంమీద జాతి జాతంతా నిజమైన స్వాతంత్ర్యార్జనకి అయోగ్యంగా ఆమడదూరంలో ఉంది. ఈ సాంస్కృతిక విప్లవాన్ని పేధావివర్గం చేపట్టాల్సింది. దీన్ని తెలుగు సాహిత్యంలో కందుకూరి, గురజాడ, గిడుగు, రఘుపతి వెంకటరత్నం నాయుడు పట్టుకుని విజయవంతంగా నడిపారు. వాళ్ళ తర్వాతతరంలో ఈ ఉద్యమాన్ని చేపట్టిన వాళ్ళు తాపీ ధర్మారావు, చెలం, శ్రీశ్రీలు. కాని వీళ్ళు తమఉద్యమాల తొలిదశలోనే ఆగిపోయారు. ఆ తొలిదశలోని సాంస్కృతిక విప్లవంలోని వేడిఅంతా యోగ్యతా పత్రింలో కనిపిస్తుంది. అందులో చెలం, కవిత్వాన్నీ దానితత్వాన్నీ, వస్తువునీ దాని స్వరూప స్వభావాలనీ, శ్రీశ్రీనీ, అభ్యుదయ కవిత్వపు ఉషోదయ కాలాన్నీ, తెలుగు సామాజిక జీవితాన్నీ, మానవ జీవితపు విలువలనీ చర్చించాడు. ఆ ముందుమాట సాంస్కృతిక విప్లవ స్వాగతగీతం. ఆధునిక కవిత్వ విజయాలకి మాగ్నాకార్టా.

ఫోకస్ :

వచన కవిత్వం: 'కారుచీకటిలో కాంతిరేఖ'

రవి.

వచనకవిత్వంలో నేను పరిశీలించే ముఖ్యమైన లక్షణాలుఇవి. వచనకవిత్వం పేరుతో వచ్చే రచన నిజంగా కవిత్వపు లక్షణాలు పొందుపరచుకుని వున్నదా లేక అది తుంటలుగాచేసిన వచనమా అన్నది మొదట చూస్తాను. తర్వాత ఆ రచనలో ఉధృతం, ఉద్రేకం, రచయిత చిత్తశుద్ధీ ఎన్ని పాళ్ళల్లోవుందో— అది ఏ విధంగా సమకాలీన సమాజంలోని కల్మషక్షాళనకు పనికివస్తుందో పరిశీలిస్తాను. అటుపిమ్మట ఆ రచనలో అంతర్లీనమై— పాఠకుని ఆకట్టుకొని— చదువరి అంతరాంతర సీమలలోనికి చొచ్చుకొని పోయి— అతనిలో ఒక పులకరింత, అనుభూతి తెప్పించగల లయ వుందో లేదో చూస్తాను. ఆఖరుకు కవి వుపయోగించే భావచిత్రణ (Imagery) ఎంత సమంజసంగా వుందో— ఎంత భావస్ఫోరకంగా వుందో— వాడిన ఉపమానాలు ఎంత ఔచిత్యం పోషించాయో అన్న విషయం చూస్తాను.

ఈ కవితా సంకలనం వెలువడవలసిన కాలంలోనే వెలువడింది. దేశంలోని ఆర్థిక, రాజకీయ, సాంఘిక, నైతిక విలువలు మహావేగంతో అధఃపతనమౌతున్న ఈనాడు కవులు, రచయితలు జాతికి మార్గదర్శకులుగా నిలువవలసిన అవసరం ఎంతైనావుంది. ఇతర విలువలతోపాటు సాహిత్యపు విలువలుకూడా త్వరితగతిని పడిపోతున్నాయి. ఈనాడు తమ బాధ్యతలుమరచి రచయితలు నిదురపోతే జాతిఅంతా బాగుచేయడానికికూడా పనికిరానంత విధంగా కుళ్ళిపోవచ్చును. 'కుక్కచచ్చిన కంపు గొడుతోంది నేటి తెలుగు సాహిత్యం'— 'చిత్తకార్తికుక్క సాహిత్యం'— కనుక "కళ్ళు తెరవండి కవులూ వాళ్ళువిరవండి రచయితలూ/ బహుపరాక్ పోయట్స్! బీకేర్ ఫుల్ రైటర్స్!" అంటూ హెచ్చరిస్తున్నారు. మహాప్రస్థాన గీతాచార్యుడు, ఆధునిక తెలుగు సాహిత్య ద్రోణాచార్యుడు మహాకవి శ్రీశ్రీకి సి. విజయలక్ష్మి ఏకలవ్య శిష్యులు. కావ్యం ప్రారంభంలో తన ఆచార్యుల బాధ్యతను గుర్తుచేస్తూ— 'నేడు చూపవయ్యా మాకు దారి/ చీకట్లలోకాల్చి చీల్చు రహదారి' అంటు కోరుతున్నారు. తెలుగుజాతిపేరిట తిరిగి కలంపట్టమని శాసించారు. కారణం? "....ధృతరాష్ట్రకౌగిలిలా కుష్టులా/ అవినీతి

జాతి సర్వఅంగాలనూ కావలించుకుంది" గనుక, కావ్యం ప్రారంభలో మనకు కనబడే నిరాశామయమైనస్థితి కావ్యం చివరకు వచ్చేటప్పటికి కనబడదు. ఎంతో విశ్వాసంతో "పండు పున్నమిరేయిలో విరహాలూ, విహారాలూ కృతకంగావర్ణిస్తూ/ అలౌకిక ప్రణయానుభూతంటూ అష్టపదుల పదజాలంలో/ వారపత్రికల్లో పేజీలునింపే పోసుకోలు రాయుళ్ళ"నిండివున్న అంధకారంలోనుంచి; "కొత్త సినిమా మొదటిఆటా, వారపత్రికా జ్ఞానంకంటే/ అడుగు ముందుకివేసేందుకు తిరస్కరించే కారుచీకటినుండి;" కలకత్తా కాళిక నాలికలాంటి వర్తమాన జీవితాన్నిగూర్చి పల్లెత్తుమాటగూడా పలకని/ నేటిపత్రికా సాహితి" వున్న చీకటినుండి; "బాధే బ్రతుక్కి పర్యాయపదంగా పరిగణించిన" నేటి గాఢాంధకార జీవితంనుండి విముక్తి లభించేకాలం త్వరలోనే రానున్నది. అమావాస్య మరుసటిదినాన దర్శనమీయడా బాలచంద్రుడు' అంటూ విశ్వాసంప్రకటించి, 'ఈబాధల గాధల భయంకరకాళరాత్రి అంతమౌతుంది'; కారుచీకటిలోనుండి కాంతిరేఖ ఉదయించి తీర్తుంది!" అంటూ సెలవు తీసుకున్నారు. ఈ ఆశావాదంలోని విశ్వాసం అభ్యుదయ కవిత్వపు ముఖ్యలక్షణం.

సాహిత్యంలో సమకాలీన సమాజం ప్రతిబింబించాలి. ఆసమాజం కల్మషంతో నిండివుంటే, ఆ సాహిత్యంలోనూ ఆ కల్మషమయమైన సమాజం కనబడి తీరుతుంది. సమకాలీన సమాజ చిత్రణలో రచయిత చేయితిరిగినవారు. సునిశిత పరిశీలనాశక్తిగల వారు గనుక కళ్ళకు కట్టినట్లు అన్నివర్గాల వ్యక్తులనూ చిత్రించగల్గారు. ప్రతిదినమూ మనముందు జరిగేవిషయాలే, అన్యాయాలే, మనుష్యుల విచిత్రప్రవర్తనలే చదువరిలో విషాదానుభవం కల్పించగల్గిన ప్రతిభతో వర్ణించారు. 'శోకంలో అశోకనిలయం' లో లాడ్జింగువర్ణన[1].

పాత్రలకు తగినట్లు భాషవాడటంలో రచయిత తెలుగుభాష జనసామాన్యంలో యెలా వాడబడుతుందో బాగా తెలిసినవారు అనిపిస్తోంది. నీచపాత్రల భాష వేరుగా సాక్షాత్కరిస్తుంది.... అశోకనిలయంలోని కాపలాకుక్క చదివినరేటు జాబితా ఈకోవకు

---

1. "అమ్మలేనివాళ్లూ, అయ్యలేనివాళ్లు/ దిక్కులేనివాళ్లూ, కుక్కబతుకువాళ్ళు/ కట్నం డబ్బులు పిగలక పెళ్ళిగాక/ ఉద్రేకం పట్టలేక వూళ్ళకెక్కినాళ్ళు/ విధవలయ్యి వెధవలతో పురికెత్తినవాళ్ళు/ ఎంగిలిస్తరాకు బతుకులీడ్చుతోన్నవాళ్ళు/ అమ్మా అయ్యలు ఎవరో తెలియని కూతుళ్ళు/ ఎదిగినదానికి పెళ్ళినితలపెట్టని దౌర్భాగ్యుల చెల్లెళ్ళు/ అత్తామామల పోరుకు అయ్యగార్ల పొగరుకూ/ తాళలేక నుయ్యి గొయ్యి చేతగాక/ కడుపుకొరకు పడుపువృత్తిచేబట్టిన కోడళ్ళు/ కోటికోట్ల హేతువులచే కులంలేని భోగంవాళ్ళు"—

చెందినదే. "నైటంతా పాతికి; అద్దంరేత్రికి పది; వొక్కసారికైదు/ పాన్‌తో డబల్ రూమ్‌పోరు; లేకండా చింగిల్ రూమ్ రెండు"— 'పాసింజరొచ్చాడు ఏయ్ రండి." సర్కారుజిల్లా గ్రామాల్లో— లేక గ్రామాలవంటి చిన్న పట్టణాల్లో మండపాకమ్మలాంటి భక్తులు యీనాడు కోకొల్లలుగా కన్పడతారు. మండపాకమ్మకు వాడిన భాషలో native idiom ఎంత సహజంగా కనపడుతోందో చూడండి.[2]

నాటకీయ సంభాషణ వచనగేయానికి ప్రాణంవంటిది. వచనగేయం స్టేజిపై చదవాలంటే నాటకీయంగానే చదవాలి. గేయంలో సంభాషణలు ఇమడ్చటం కష్టమైన పని. కాని అది సాధించారు రచయిత.[3]

కారుచీకటిలో కాంతిరేఖ

సి. విజయలక్ష్మి   కవితా సంకలనం.

చేతన సాహిత్య సమితి, పాలకొల్లు, వెల: రెండురూపాయల యాభైపైసలు.

కవి తను చెప్పదలచుకున్నది వాచ్యంగాచెబితే అది కవిత్వం అనిపించుకోదు. తనభావాలను రచనలో వ్యంగ్యంచేయాలి. దాని ప్రభావం పాఠకునిపై గాఢంగా పడుతుంది. వాచ్యంగాచెబితే కవితాలక్షణం లోపిస్తుంది. ఈమధ్య వచనగేయంవ్రాస్తున్న యువరచయితలు ఈవిషయం మరచిపోతున్నారు. కొన్నిచోట్ల— కవిత్వం శూన్యమై— వచనపు తుంటలుగా మిగిలిన సందర్భాలు కనబడతాయి. "నిత్యం జాతిపితని జపిస్తూ/ నిరంతరం నిజాయితీని పారాయణిస్తున్నారు/ మద్యపాన నిషేధంపేరిట తాగుడు నిషేధించి— ఇంటింటా బడ్డీలుపెట్టి సారా సరఫరాచేస్తున్నారు అని చెప్పడంలో కవిత్వం

2. "పసిడిచేతిలోని పాపిస కొసుకులు— మండపాకమ్మ— పుట. 59. జగంమిద్దె బొమ్మెక్కే సత్తెం/ పంచబూతాత్తకమైన ఈద్రేహశరీరం/ కంచంలో బువ్వలాగమాయమయ్యేదే!.... అకిలీ దప్పికా బయంవూ బాదా అంతా మాయే/ వురికొసనిజూచి పాంవనుకొని బయపడతాడు మాయదారినరుడు/ అమ్మాయ్ సుందరీ ఆకలేత్తాంది మినప రొట్టె ఆవకాయా తేవే/ అమ్మోయ్— అదేంటే— సరాసరాపోతాంది— నలికలపాంవే!!"

3. '....అశోకనిలయం': పు. 85. "జైమెంత? తెలీదు. అమ్మానాన్నా? యెవడూ లేడు/ ఏంకులం? బేమ్మర్లం; యెందుకొచ్చావ్; డబ్బిచ్చావూ?/ ఏంటీ బతుకు? యెహె— వొచ్చినపని సక్కాజేసుకపో;/ అవిలిస్తున్నావే? రేత్రి రెండైంది; నిదరొత్తున్నాది;"—

కన్పడుతోందా? ఇదేవిషయాన్ని చదువరికి స్ఫురింపచేయగలిగేశక్తితో రాసిన పాదాలే కవిత్వం కాని, పై పాదాలు కవిత్వం అనిపించుకోవు. మరో ఉదాహరణ-[4]. చెప్పదలచుకున్న విషయం కొద్దిమాటలతో వ్యంగ్యంచేయగల శక్తి యీ రచయితకు లేదు గనుకనే ప్రతిరచనా దీర్ఘమైన వచనగేయంగా సాగిందని నాభావం. వచనగేయం అనగానే సుదీర్ఘంగా వుండాలన్న భావంకూడా స్థిరపడేపరిమాదం కన్పడుతోంది. వచనగేయం ఎదుర్కొంటున్న పరిమాదాల్లో యిది ఒకటి అని గుర్తించాలి.

వచనకవిత్వంలో విరుపు ప్రయోజనం ఆంగ్లంలో టి. యస్. ఎలియట్ గుర్తించి వాడినంత ప్రతిభావంతంగా ఈనాటి వచనగేయకవులు చాలామంది వాడలేకపోతున్నారు. విరుపువల్ల కవి చదువరికి ఒకపాదం చదివినతర్వాత వచ్చే భావావేశం, ఉద్రేకం నిమిత్తం అవకాశం ఇస్తున్నాడన్నమాట. ఒకపాదం పూర్తిచేయగానే పాఠకునిలో ఆ భావంగురించి కొన్ని విషయాలు గుర్తుకువస్తాయి- అలా గుర్తుకువచ్చేట్లు చేయడం. అప్పుడే చదివినపాదంలోని విషయంగురించి మరింత జాగ్రత్తగా ఆలోచింపచేయడం ఈవిరుపు సాధించేప్రయోజనం. అరుణా- అరుణపతాకమా! అన్న రచన శ్రీశ్రీ 'కవితా-ఓకవితా' పోకడలో సాగినరచన. ఐనాకూడా, సి. విజయలక్ష్మిగారి అనుకరణలోకూడ నూతనమైన సొగసులు కన్పడుతున్నాయి. దీనిలో విరుపు ప్రయోజనం బాగా కనబడింది.

తలచి తలచి విలపించిన నామది గది గదిలో
తలపుల బాకులు బాకులు ఘూలాల్ గాయాల్జెస్తోంటే....

రెండవపాదం చివర చుక్కలుబెట్టి వదలిపెట్టడంలో భావం- రచయిత పడినబాధ వూహాతీతమనీ, అంత తీవ్రమైనదీ అనీ సూచించడం. ఒక్క విషయంమాత్రం స్పష్టంచేయాలని వుందినాకు. వచనగేయంలోని విరుపుప్రయోజనంకాని, గేయంలో అంతర్లీనమై వుండేలయకాని తెలిసికోవాలంటే వచనగేయం గొంతెత్తి చదివినప్పుడే సాధ్యం. వచనగేయం పాడటానికి అనువైనది కాకపోవచ్చు. కానీ దానిని నాటకీయ పద్ధతిలో ప్రతిభావంతంగా గొంతెత్తి చదవవచ్చును. Emotional Pause ఉపయోగించుకొని రాసిన మూడు పాదాలు నాకు బాగానచ్చినై, ఇవి యెంతో భావస్ఫోరకంగా వున్నాయి.

---

4. "పెట్టుబడిదారులూ గుత్తవ్యాపారులూ/వేల భూస్వాములూ అక్రమార్జితులు/ మొరార్జీ బడ్జెట్‌కు మొక్కుతూవున్నారు/ సామాన్య సంసార్లు రైతులూ కూలీలు/ పన్నులతో వస్తులతో గీపెట్టుతున్నారు." పుట. 23. కోటిగొంతులువిప్పి ఘోషించండి.

పాపలాబిళ్ళిచ్చి పాటిమీద దాంతో పరియాచకం— ఇచట ఒక చిన్న డాష్— దీనినే Emotional Pause అంటారు. దానితర్వాత ఆ పరియాచకంవలన వచ్చిన ఫలితం చెబుతారు రచయిత 'గనేరియా' అంటూ. అలాగే మిగిలిన రెండుపాదాల్లోనూ ఈ technique వాడారు.

> మురికి కూపాల్లో రొచ్చుగుంటల్లో బతుకు— మలేరియా
> ఎన్నికల్లో గెలిస్తే శ్రీవేంకటేశ్వరుని మ్రోల గుండుగొరుగుడు—
>
> పవర్ మానియా. పుట. 8.

వచనగేయంలో బాహ్యంగా కనిపించకపోయినా, అంతర్గతంగా ఒక లయ భాసిస్తూవుండాలి. ఈ లయ మనకు తరచు అంత్యప్రాసగానూ, భావానుగుణ అనుప్రాసరూపంగానూ, యతులరూపంగాను ప్రత్యక్షమౌతోంది. ఈ లయ ఈ విధంగా వుండాలి అన్న నియమంలేదు. ఇది అనిబద్ధకవిత్వం ఒకే అక్షరం వరుసగా కొన్ని పర్యాయములు వాడితే ఒకరకమైన సంగీతలక్షణం సహజంగావస్తుంది. అంత్యప్రాస అరుదరి అతిగా వాడుకుంటున్నారు. ప్రతి పాదానికి అంత్యప్రాస వేయడము ఒక లోపమేనంటాను. కవిత్వాన్ని 'ఛందోబంధాలనుంచి' తప్పించామని చెప్తూనే మనం మరల దానిని 'అంత్యప్రాస ఛందోబంధాల్లో' పెడుతున్నట్లు నాఅనుమానం. విజయలక్ష్మి గారిరచనలో ఈ లయ ప్రతిరచనలోను వినబడదు కానీ— అక్కడక్కడ కనపడ్తోంది[5].

శ్రీశ్రీ కవిత్వంలోని కొన్నిపాదాలు పూర్తిగా ఈ రచయిత వాడుకున్నారు. ఒక మహాకవి వ్రాసినరచనల్లోంచి కొన్నివాక్యాలు మరోకవి, మరోసందర్భంలో వాడుకోవడం ఒక కొత్తరకం సంవిధానం. టి.యస్. ఎలియట్ ఈ Partial quotation technique తమ 'The waste land' లో ఉపయోగించారు. చైతన్యస్రవంతి సంవిధానంతో వ్రాస్తున్న రచనల్లో ఈ సంవిధానం బాగా పనికివస్తోంది. ఉదాహరణగా ఒకటి పరిశీలిద్దాం, 'మరాటాబంద్' లో ఇలావ్రాసారు విజయలక్ష్మి—"గనుల్లో వనుల్లో కార్ఖానాల్లో ఆఫీసుల్లో పొలాల్లో శ్రమించే కోట్లాది సోదరులారా!"అన్నది ఒకచరణం. ఈ చరణంలోని మొదటిభాగం శ్రీశ్రీ 'ప్రతిజ్ఞ' నుంచి అప్పుతీసికొన్నది. దీనివలన వచ్చిన ప్రయోజనం. శ్రీశ్రీరాసిన "గనిలో వనిలో,కార్ఖానాలో/ పరిభ్రమిస్తూ పరిశ్లమిస్తూ/ ధనికస్వామికి దాస్యంచేసే/ యంత్రభూతముల కోరలుతోమే/ కార్మికధీరుల కన్నులనిండా...." అన్న చరణాలు చదివిన పాఠకునికికల్గే అనుభూతి, 'మరాటాబంద్' లో 'గనుల్లో వనుల్లో కార్ఖానాల్లో' చదివేటప్పుడు మరల అదే అనుభూతి ఆవిష్కారమౌతుంది. ఈవిధమైనఅనుభూతి ఆవిష్కరణానికి వుపయోగించేదే Partial quotation

---

5. 'అరుణా అరుణపతాకమా'

సంవిధానం. ఆమూడుపదాలు చూచినవెంటనే, పాఠకునిలో శ్రీశ్రీ 'ప్రతిజ్ఞ' గుర్తుకి వస్తుంది. ఆగుర్తుతోబాటు అది చదివినప్పటి అనుభూతికూడా మరలవస్తుంది. శ్రీశ్రీ కావ్యంలోనుంచి చాలాచరణాలు యీవిధంగా, ప్రతిభావంతంగా యీ రచయిత వాడుకున్నారు.

సమకాలికులైన తోటికవులను కావ్యాల్లో తూలనాడడం మంచి సంప్రదాయం కాదని ఈ గ్రంథపీఠికలో శ్రీ కె. వి. రమణారెడ్డి హెచ్చరించారు. ఒక కవి- ఇతర కవులగురించి చర్చచేసేటప్పుడు, అతని రచనలపై విమర్శకు పూనుకోవడం సబబు. అంతేకాని— అతను పుట్టిన కుటుంబం, వర్గం, వ్యక్తిగత విషయాలజోలికిపోయి విమర్శించడం బేసబబు. 'సమాధిలోంచి పునరుత్థానం— స్మశానంలో స్వగతం' అన్న రచనలో విజయలక్ష్మిగారు హద్దుదాటి ప్రవర్తించినట్లు కనబడుతోంది స్పష్టంగా. ఆ రచనలో రచయిత స్వర్గీయ డి. బాలగంగాధరతిలక్ వ్యక్తిగతజీవితాన్ని విమర్శించారు. తిలక్ కవిత్వంలో మానవతావాదంలేదు. ఆయనది జీవకారుణ్యవాదం అని విజయలక్ష్మి గారు అంటే నాకు బాధలేదు. కాని కవి వ్యక్తిగతవిషయాలు అనవసరంగా బయటకు లాగి— తిలక్‌ను దుయ్యబట్టడం తెలివితక్కువతనం— ఒకరకంగా పొగరుబోతుదనం. ఇది పక్షపాతదృష్టి ప్రదర్శిస్తున్న కవి సంస్కారం ద్యోతకంచేస్తోంది.[6]

అదేవిధంగా ఆరుద్రను అభిశంసించారు రచయిత.

కొందరు కవులు సమాజంలోని లోపాలు ఎత్తిచూపెట్టడమే తమ బాధ్యతగా తలచి— వాటిని వర్ణించడంతో తమపని పూర్తి ఐందనుకుంటారు. కాని ఋషితుల్యుడైన కవి— సమస్యలకు పరిష్కారమార్గం కూడా చూపగల్గేవాడుగా వుండాలి. విజయలక్ష్మి గారు ఒక రాజకీయసిద్ధాంతాన్ని గాఢంగా నమ్మినవారు. దానికి కట్టుబడినవారు, కుళ్ళు కంపు కొడుతున్న యీ సమాజానికి విముక్తి లభించడానికి 57 వ పుటలో పరిష్కార మార్గం ఇలా సూచించారు.

---

6. పుట. 103.

అందంగా ఆనందంగా జీవించడానికి ఆదినుంచీఅలవాటుపడ్డ సుకుమారరాకుమారుణ్ణి
మానవప్రాణావసరాల్ని అణాపైసలకింద మార్చిన తాకట్ల వ్యాపారిస్తుని కుమారుణ్ణి,
మానవదారిద్ర్యాల్ని/....చక్రవడ్డీల్లోకిమార్చి/ ఊరిబాబులసొమ్మును ఉల్ఫాగా కొట్టేసి
తరతరాలు తిన్నా తరగని ఆస్తిపాస్తుల్ని కూడబెట్టిన నాతండ్రి/
తిన్నతిండి అరక్క తీరిక జోరుకాగా స్వయంకృతాపరాధంలా/
చేజేతులా సృష్టించుకున్న తీవ్ర మానసిక వ్యాధి పీడితుణ్ణి,
పగటిపూట నా బట్టల కొట్టుకొచ్చే కష్టమర్సుకీ— పుట (107)

"వర్గచైతన్యంతో సంఘటితశక్తితో ఓటమెరుగనియట్టి పోరాట పటిమతో
బ్రహ్మజెముడు పొదల్లాంటి ఫ్యూడల్ సమాజ సంప్రదాయ అవశేషాల్ని
అశేష జనతాసందోహం కష్టించి సృష్టిస్తోన్నజాతి నిస్తుల సంపదల్ని
నీటిలోని జలగల్లా కాటిలోని నక్కల్లా పీలుస్తూ కాజేసే
కుక్షింభర అన్నయ్యల అంతం జేసిననాడే-
నేటి దోపిడీపీడనల్ని పునాదులతోబాటు సమాధిజేసిననాడే
ఆర్థిక మిట్టపల్లాల సొసైటీ బాటని
సోషలిస్టు రోడ్డురోలర్‌తో సమంగా సాఫీజేసిననాడే- ఆనాడే....
జీవనం నందనవనంగా ఆనందంగా వర్ధిల్లుతుంది."

వర్తమాన ఆంధ్ర సాహిత్యం ఏ పరిస్థితిలో వున్నదో రచయిత సరిగా వర్ణించారు. 'కుటిల రాజనీతి మోచేతిగంజినీళ్లుతాగే సాహితీ వందిమాగధులూ', నిజమే. మంత్రులకు పుస్తకాలు అంకితం ఇచ్చేవాళ్ళు, భాషరాని మంత్రులచే ఆవిష్కరణలు చేయిస్తున్నవారు కొల్లలు— వీళ్ళు 'ఆధునిక తెలుగు సాహితీ సంస్కృతిని అపరిదిష్టపాల్జే స్తున్నారు.' 'చిత్తకార్తె కుక్క సాహిత్యం' ఆంధ్రదేశంలో ప్రతి యువకునిచేతిలో కిన్పడుతోంది. ఊరికి ఒక పత్రిక చొప్పున నీచమైన విలువలతో- చెత్త శృంగారంతో 'మదన, మన్మథ, చితాంగి' పేర్లతో వెలుస్తున్నాయి. అమ్ముడు పోతున్నాయి. కామాయణ నవలికలకు/ ప్రేమాయణ రంగు పులిమి/ రాసే రచయితలు యెక్కువయ్యారు.[7]

రచయితలు ఒక్కసారి లేచి, వళ్ళు విరిచికొని, అతివేగంగా దేశాన్ని చుట్టుముట్టుతున్న ఈ కల్మషవాతావరణాన్ని తుడిచిపెట్టడానికి ప్రయత్నించాలి. లేకపోతే ఇది నిలదొక్కుకునే ప్రమాదం వుంది. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వమే 'రాగవైశాఖి' ఇంకా అటువంటి రచనలు ప్రచురణ చేయించేస్థితికి— ఇంగ్లండులో రెండవ ఛార్లెస్ నాటి నైతికవిలువలు ఏర్పరిచేస్థితికి- వస్తుందని అనుమానించవలసిన పరిస్థితి వచ్చింది. విజయలక్ష్మిగారు తమ తొలిపలుకులో చెప్పినట్లు, "తమ దుర్మార్గ మార్గాలజోలికిప్రజలు రాకుండా వుండాలంటే, ఈ కృత్రిమ సాహిత్యంలో— ఈ గుడ్డిభక్తిలో జనాన్ని విధిగా వుంచడం— తెగముంచడం పరమావసరం." రచయిత అభిప్రాయంతో పూర్తిగా ఏకీభవిస్తాను నేను.

---

7. 'అభిసారిక, రక్తపంకం, రేరాణి, వాంఛ, తృప్తి, పలకల వెండిగ్లాసూ జుగుప్స కంటే నీచమై ఖూనీకంటే హేయమైన సెక్స్, హంతక మనస్తత్వంతో కుక్కచచ్చిన కంపుగొడుతోంది నేటి తెలుగు సాహిత్యం'

—మహాకవి శ్రీశ్రీకి ఏకలవ్యుని బహిరంగలేఖ, పుట. (6)

ఉపమానాలు వాడటంలో రచయిత ఔచిత్యం చూపించారనేచెప్పాలి- ఒక్క జటాయువు విషయంలో తప్ప.[8] కావ్యవస్తువు సమాజ చిత్రణ. దానికితగ్గ ఉపమానాలు వాడుకున్నారు. అలాగే భావచిత్రణ (Imagery) లోను ఉచితానుచితజ్ఞానం ప్రదర్శిస్తూ- కేవలం రాజకీయమేగాక రాజకీయ కవిత్వం అన్న పేరు నిలబెట్టుకోగల్గారు. "వేసవికాలపు బెజవాడ ఎండలా/ మండుతోన్న పేదాడి గుండెలా/ మగడు పోయిన ఇల్లాలలా/ శవంపెళ్ళిన ఇల్లులా/ అన్నార్తుని ఆకలిమంటలా/ అరవైమూడు కేంద్రి బడ్జెట్ లా/ నిత్యజీవితావసర వస్తువులధరలు ఆకాశాన్ని ఆలింగనం చేసుకుంటున్నాయి. క్రింద గీతపెట్టిన పాదాలలో తప్ప- మిగిలిన ఉపమానాలన్నీ సమాజంలోంచి తీసికున్నవే. సమాజంలోని కల్మషం చిత్రించేవే: వేశ్య, "ఊగిసలాడే ప్రభుత్వ పాలసీలా గాలిలో తేలిపోతోంది/ నేడోరేపో కూలేడామ్‌లా బల్ మజాగా వాలుతోంది/ సోషలిజంపేరిట కాపిటలిజాన్ని అభివృద్ధిజేసే ప్రభుతలా/ వాహణ్ణిచూసి మరొకడికి కన్నుగీటుతోంది." అన్న వర్ణన బహుచక్కగ వున్నది.

నీచపాత్రలచే పలికించినభాషే- కవితానుగా చెప్పేటప్పుడుకూడా కొన్ని చోట్లవాడారు. 'సస్తేచోళ్లేదు'(19); 'గోసిమీదపన్ను'(23); 'రాందోళ్ల రాజ్యమా' (27) బేహారం స్తంభించిన 29; 'గేదెగమ్మార్లంమేం'(33) గాండ్‌గాబరా(62) సంకాలేని పీనిగ(48) మొదలగు ప్రయోగాల్లో రచయితకు కలకసి, ఉద్రేకపు ఉధృతం అభివ్యక్తమౌతున్నాయి. తెలుగు పలుకుబడిపై రచయితకుగల అధికారం గొప్పది.

'పసిడిచేతిలోని బానిసకొడుకులు' అన్న రచన కవికిగల సునిశిత పరిశీలనాశక్తికి నిదర్శనం. రెవెన్యూడిపార్ట్‌మెంట్‌వాళ్ల ఆంధ్రం- ఇంగ్లీషు మణిప్రవాళ భాష మాట్లాడే ఆఫీసర్లూ, క్లర్కులూ. "తేనెమనసుల పక్కపాపిటతీసి/ ప్రేమించిచూడు బ్రాసియర్సువేసి/ కళ్ళకీ కాళ్ళకీ జోడు/ చేతికి నలుచదరం వాచీ అలంకరించి..../ వారానికొహసారి టౌన్‌కి "బయలుదేరే రంగమ్మలూ." టిటోనియా వాచ్ విత్ డేట్, రిమ్‌లెస్ స్పెక్ట్స్, నైలాన్ సాక్స్, బాటాబూట్, ... తిరుపతిగుండుమీద ఈవినింగ్ హ్యాట్ .... బయార్ డూయింగ్ ఇంజనీరింగ్ కంట్రాక్ట్స్" అనగల గజపతిరావులూ- 'సమస్త సినిమా విజ్ఞానానికీ లివింగ్ ఎన్‌సైక్లోపీడియా' లైన సుందరిలాంటి యువతీమణులూ రచయిత చూపు తప్పించుకోలేకపోయారు. 'తత్వవేత్త తరువాత లోకంలో అబ్జర్వర్/ కవికంటె ఎవడూలేడు' అన్నారు రచయిత. నిజంగా ఈ రచయిత అటువంటి గొప్ప అబ్జర్వర్ అని ఒప్పుకొని తీరాలి.

---

8. పీఠిక. 8 పుట. కె. వి. రమణారెడ్డి.

కాని, కె. వి. రమణారెడ్డిగారు హెచ్చరించినట్లు [9] "రాజకీయ కవిత్వం కత్తిమీద సాములాంటిది. ఒళ్లు దగ్గర పెట్టుకోక పోయావో అందులోంచి ముందు హెచ్చరిక ఏదీలేకుండా కవిత్వం తప్పుకుని రాజకీయం మిగులుతుంది. కళాత్మకం చేయనిది యే యితివృత్తంగాని తనంతతానై కావ్యగౌరవానికి యోగ్యత సంపాదించు కోదు." కనుక సహనం ప్రదర్శించి— రచయిత తన గేయాల్లో యికముందుగూడా కవిత్వం ఇతోధికంగా వుండేట్లు రచనా వ్యాసంగం చేస్తారని నమ్ముతున్నాను.

మరి రెండు సమీక్షలు :

బాపురెడ్డి గేయాలు

12+94 పేజీలు, వెల: 3 రూపాయలు,

ప్రతులకు: సుశీలానికేతన్, I. C. 85, ఇరంమంజిల్, హైదరాబాదు.

జె. బాపురెడ్డిగారి 42 గేయఖండికల సంపుటిఇది. బోయిభీమన్నకు అంకిత మీయబడింది. కావ్యానికి 'ఆత్మశ్రుతి' మీటినవారు డా॥ సి. నారాయణరెడ్డిగారు.

అసలు కావ్యానికిముందు డజను పేజీలలో 'కావ్యకళ్యాణం'(అంకితం)కావ్య స్వీకారం, ఆత్మశ్రుతి, ప్రచురణకర్తల 'మామాట' చూడముచ్చటగా, చదువపసందుగా ఉన్నాయి.

బాపురెడ్డి తమ 'కావ్యకళ్యాణం'లో తన కృతిని సీతగాభావించి ప్రచురణకర్త లన్నట్లు 'భీమన్నగారిలో కోదండరాముణ్ణి చూచుకొన్నారు. బో భీ గారూ తన్ను గుర్తించుకొని అంగీకరించారు.

అంతటితో ఆగలేదు ప్ర. కర్తలు. "బాపురెడ్డికవి. ఆయనపలికే ప్రతివాక్కూ ఒక బుక్కు"అనీ బాపురెడ్డి స్వరాట్ అనీ తాను స్వరాట్ అయి బో. భీ. గారిని సమ్రాట్ చేసినాడనీ విలిఖించారు. "ఆధునిక కవితా మహాప్రభువైన డాక్టరు. సి. నారాయణరెడ్డి 'ఆత్మశ్రుతి'లో ఆ విషయం నిరూపించారు'ట. (భీమన్న సమ్రాట్ అయినాడు కనుక సి.నా.రె. మహాప్రభువుగా మాత్రమే ఉండిపోయినాడనుకుంటాను.)

---

9. '....కాంతిరేఖ పరిచయం.' "ఇందులోది ఎక్కువ పచ్చి నిజమేనని నేనే కాదు మీరూ ధృవీకరించగలరు!" షట. 3.

డా॥ సి. నారాయణరెడ్డి తమ 'ఆశుపీఠికా కవిత' లో బాపురెడ్డి రూపాన్నీ, కవితా స్వరూపాన్నీ గానంచేశారు. ("అడిగినవెంటనే అవ్యవధిగా, నిమిషాలమీద, ఈ కృతికి 'ఆత్మశ్రుతి సమకూర్చి యిచ్చిన నారాయణరెడ్డిగారికి మేంబాల కృతజ్ఞులం' అని ప్ర. కర్తలు చెప్పుకొన్నందువల్లా, ఇది కవితామయంగా ఉన్నందువల్లా 'ఆత్మ శ్రుతి'ని నేను ఆశుపీఠికా కవిత అన్నాను.) ఒక్క గీతానికిమాత్రమే 'ఆత్మశ్రుతి'మీటి ఎక్కువయితే ఆత్మస్తుతిగా మారుతుందని మిన్నకున్నారట సి.నా.రె గారు. ఆ ఒక్క గీతంవలెనే అన్నీ ఉంటాయన్న గ్యారంటీ సూచనలభించి అవునేమే అనుకుంటే నిరాశే మిగులుతుంది.

దాదాపు పదేళ్ళ క్రితం 'చైతన్యరేఖలు' ప్రకటించిన బాపురెడ్డి ఇప్పుడీ మూడవ సంపుటిని తమ పేరుమీదుగానే ప్రకటించారు.

బాపురెడ్డిగారి కవితాశక్తినిగూర్చి సి.నా.రె గారు "అదిక్షారక దశను దాటింది; కోరకదశను మీటింది; ప్రసూనదశలో పదంమోపింది." అన్నప్పుడు అతని మూడు పుస్తకాలలో కనిపించిన క్రమపరిణామం వారుద్దేశించిఉంటారు. కాని 'చైతన్యరేఖలు' నాటినించి నేటికీ బాపురెడ్డి ఏమీ ఎదిగినట్లు కనిపించదు.

ఈ సంపుటిలోని ఖండికలు ఏఒక్క భావానికీ చెందినవికావు. కొన్ని భావ కవుల శృంగారమార్గాన నడచినవి, కొన్ని అభ్యుదయ భావనలవి, ఎలిజీలు కొన్ని, కొన్ని గవర్నమెంటు కవితలు, కొన్ని ప్రాదేశిక కవితలు, కొన్ని వ్యాపార కవితలు, (ఆకాశవాణికీ, పత్రికలవారికీ అడిగితే ఇచ్చేవి) ఇట్లా ఉన్నాయి. మొత్తంమీదచూస్తే బాపురెడ్డిలో భావకవుల ప్రణయ కవితావాసనలే ఎక్కువగా గుబాళిస్తున్నవి. అందుకే

'కామినీ విలాస నటన కథనమ్మె భువి చరిత్ర

భామినీ వినూత్న నటన భంగమ్మె ఈ ధరిత్రి' అన్నాడు. స్పష్ట కవితాఛాయలుకూడా అలాంటి శృంగార భావాలలోనే ఎక్కువగా కన్పడతాయి.

"నిన్నే మది నిల్పి చేయుచున్న ప్రేమ తపసున నా
జడలు పడమలంట పెరిగి పోయెనురా" అనీ
"తాపములో నీవు రాని/ కోపములో కారుకుకున్న
నా పెదవులు కుంకుమపూలాయెనురా" అనీ అన్నప్పుడు అందం మెరిసి ఆనందం కల్గుతుంది.

ఉద్యోగధర్మాన చెప్పిన కవితలు గవర్నమెంటు కవితలు.

"ఈ దేశం మనదేశం/ ఎంత మారిపోయెనురా
ప్రజలు కన్న కలలెన్నో/ నిజాలు అయిపోయెనురా. అనీ
ఢిల్లీలో, ప్రతిపల్లెలోరా/ జిల్లె నవనిర్మాణశోభలు
గనులలో క్షేత్రములలో కిం/ కిణులమోగ్రిసెను భాగ్యదేవత" అనీ

అన్నప్పుడు నిజంగానా? దేశంగూర్చి మనమెంత అజ్ఞానులమని ఆశ్చర్యపోవాల్సిందే కాని, కవితకోసం వెదికి ప్రయోజనంలేదు.

కాటిలోన కూడ బ్రతుకు/ బాటవైపు ఆకర్షణ
ఈ జీవన్మరణ సంధ్య/ నెడతెగని ఏదో ఘర్షణ, వంటి అందమైన

వాక్యాలు క్వాచిత్కంగా కన్పిస్తవి.

ఆయా సందర్భాల్ని పురస్కరించుకొని ఏవో కొన్ని రచనలు చేయవలసి వచ్చినా పుస్తకంగా అచ్చువేయాల్సి వచ్చినపుడు అన్నీ వేయాలా అన్నది ప్రశ్న. ఇందులో ఎలిజీలు మరీ ప్రాథమికదశలోఉన్న రచనలుగా కన్పిస్తవి. అట్లే మరికొన్ని గేయాలు. 'అమ్లాన సిమ్లా'లో అచ్చటి సౌందర్యంచూసి ముగ్ధుడై రచనచేసినట్లే అక్కడ కనపడిన ఓ అందమైన పడతిగూర్చీ, ఆమె పయ్యెద జారిపోవటంగూర్చీ– మరో గేయంగా కూర్చటం అవసరమా? ఉదాత్తత కల్గిస్తుందా అని?

సి. నారాయణరెడ్డిగారన్నట్లు బాపురెడ్డి 'కవిపండితుడూ, పండితకవీ' కాక పోవచ్చుగాని 'చేపింతువు' (చేయింతువు అనటానికి) మొ॥ ప్రయోగాల విషయంలో కొంతశ్రద్ధ అవసరమేకాగలదు.

ఏమైనా బాపురెడ్డి మౌలికంగా కొంత ప్రతిభ ఉన్నవాడు. బాంధవ్యానో, పదవినో, మైత్రినో మాత్రమే పురస్కరించుకొని చేసే పొగడ్త అగడ్తలలో పడక, నిజాయితీగా హెచ్చరించే, విమర్శలను నిర్మలంగా గ్రహిస్తే మరింత మంచి రచనలు చేస్తారని నిస్సందేహంగా చెప్పవచ్చు.

—వేమన.

పాఠకులకు, రచయితలకు, పోషకులకు

సృ జ న

సౌమ్య ఉగాది శుభాకాంక్షలు

జ న ధ ర్మ

ద్వైమాసిక సాహిత్యానుబంధము.
తొలిసంచిక జనవరి 1969, ఒకరూపాయి,
జయప్రకాశ్ నారాయణ రోడ్, వరంగల్–2.

జనధర్మ వారపత్రికగా పది సంవత్సరాలుగా వెలువడుతున్నది. పత్రికా నిర్వహణలో శ్రీ ఎం. శ్రీనివాసాచార్యుల దక్షతకు గౌరవసంపాదకులయిన శ్రీసుప్రసన్నగారి సాహిత్య దక్షత తోడయి యీ సాహిత్యానుబంధ ద్వైమాసిక ప్రారంభమయింది. ఇది యెంతయినా సంతోషించదగిన, స్వాగతించదగిన యత్నం.

'సారస్వత విమర్శ ప్రధానంగా పాఠకుడిదగ్గర నుండి ప్రారంభించవలసి వున్నది.' నిజంగాయిది హర్షించదగిన సూచన. 'రచయిత – కవి (రచయిత అన్న మాటలో కవి యిమడడా?) కేవలం సారస్వత స్రష్టమాత్రమే.' (రచయిత పాఠకుడు అసలే కాడా?) 'సారస్వత ప్రయోజనంకూడ పాఠకుడిదే.' సంపాదకీయంలో సూచించిన యీ విలువలతో కొలిస్తే డా. సుప్రసన్నాచార్యులగారి 'అముద్రిత కావ్యంలో తాత్త్విక దృష్టి' అన్న వ్యాసం పాఠకునిదగ్గర ప్రారంభమయిన విమర్శేనా లేక పాఠకుణ్ని (స్వయంగా కవినీ) అయోమయంలో తోసే పాండిత్య ప్రకర్షా? అని అనుమానంవేయక మానదు.

"ఎదురుతిరిగి"అన్న శీర్షికలోని మొదటిపద్యాన్ని పేర్కొని దానికి విమర్శకుల భాష్యం జోడించి, కవి ఇదివరకు నడిచినబాటకు ఒకవిధంగా యెదురుతిరగటమన్నారు. ఇంకా, ఈ శీర్షిక ఈశ్వర స్థిరత్వాన్నిగూర్చి, కర్మ, పూర్వజన్మలగూర్చి కవి ఊహలు స్పష్టంగా తెలిపేకావ్యంగా పేర్కొన్నాడు. స్పష్టంగా ఏమితెల్పేదో పేర్కొనలేదు వ్యాసకర్త. ఈశ్వరుని ఉనికినే స్పష్టంగానూ వ్యంగ్యంగానూ ప్రశ్నించిన ఈ ఖండిక వ్యాసకర్త వెల్లడించినట్లు కుందుర్తి పూర్వ రచనలకు "ఎదురుతిరిగి" అనిగాక– ఆయన సమకాలీన మరియు పూర్వీకుల, కథాకల్పనా, కావ్యాలలోని ఈశ్వర 'విశ్వాసానికి' ఎదురుతిరిగి అని అర్థం చెప్పుకోవల్సి వుంటుంది. 'అముద్రిత కావ్యం'లోని కార్యకారణగతమైన తార్కికవిలువలను విశదంచేసిన విమర్శకులకు, ఉనికినిగురించిన ప్రశ్నలో, ఈశ్వర అస్థిరత్వాన్ని సుస్పష్టంగా కవి వెలిబుచ్చిన అనేకాంశాల మాటేమిటి?

"ఎక్కడో ఆరంభమైన అంతులేని జీవయాత్ర– దాటివచ్చిన దారినిండా యిప్పుడు మహారణ్యాలల్లుకున్నాయి". కేవలం రెండువాక్యాలు కావ్యంనుండి విడదీసి

వీటితో "ఎక్కడిదీ ధర్మపత్ని" అని ఉపయోగించిన పంక్తులను జోడించి, 'కాతేకాంతా కస్తేపుత్రః' అన్న శంకరాచార్యుల సూక్తితో పోల్చి తత్త్వాన్ని అంటగట్టిన, తాత్త్వికదృష్టికి అదే ఖండికలోని పై వాక్యాలవెంటనే వున్న అతిసామాన్య ప్రశ్నలు, "తండ్రికి పున్నామ నరకం తప్పించటానికా? కామాతురుడైన గయ్యాళిభార్య కాళ్ళు పట్టుకోటానికా?" అనే ప్రశ్నలు కనిపించినపుడు, విమర్శకులంటించిన తాత్త్విక దృష్టి, దృష్టిదోషంగా గోచరించడం కాదనగలమా?

భావోద్వేగంతో నడచిన అనేక చరణాలవిడిచి కేవలం తత్వచింతనకోసం వాక్యాలవెంటబడి, కుందుర్తికి ఏదో అంటగిట్టాలన్న తాపత్రయము కుందుర్తి రచనలు చదివినవారికి గ్రాహ్యం కాకపోదు. బహుశా ప్రగతివాద ప్రాచుర్యంకోసం కుందుర్తి పడిన ప్రయాసనంతా, తాత్త్వికదృష్టిని తగిలించి సున్నాచుట్టించాలనే సదభిప్రాయం విమర్శకులకు కలిగివుండవచ్చు.

నగరంలో వానలోని అముద్రితకావ్యంలోని తాత్త్వికదృష్టి ఈశ్వరస్థిరత్వాన్ని ఆపాదించుకున్నదిగాక, వాస్తవమైన హేతువాదబద్ధమైన వ్యంజనతో, ఈశ్వర స్థిరత్వాన్ని ప్రశ్నిస్తున్నదని చెప్పుకోవలసి వుంటుంది.

డా. కె. పి. సారథిగారురాసిన ముక్తిబోధ్ కవిత-పర్యాపలోకన మంచి Informative గా వున్నది.

"ఆధునిక కవిత్వంలో రూపవిప్లవం" అన్న వ్యాసంలో, శ్రీశ్రీ అభ్యుదయ కవితారంగానికి అంకురార్పణ చేసింది మొదలు దిగంబర కవులవరకూ యిదంతా ఒక వుద్యమమనే భావాన్ని కుందుర్తి వెలిబుచ్చారు వచనకవిత-రూపం అనే విషయంలోని అనేకలక్షణాలను కుందుర్తి తమ వ్యాసంలో చక్కగాచూపించారు. అయితే యీ రూప విప్లవం యే ప్రత్యేక లక్ష్యాన్నీ, మాత్రాఛ్ఛందస్సు సాధించలేని ఆధునిక కాలానుగుణమయిన స్వచ్ఛందకావ్య స్వభావాన్నీ సాధించడానికి కాదా? కాకపోతే కుందుర్తి, తదనుయాయులూ రూపవిప్లవంతో తృప్తిపడుతున్నట్లేనా?

'వచన గేయం: అంతస్తత్వం' అన్న అద్దేపల్లి రామమోహనరావు వ్యాసం మిత్రమండలి దశమవార్షికోత్సవాల్లో చదవబడి ఆంధ్రప్రభ దినపత్రికలో వచ్చిందే. ఇందులో యింకా 'వెలుగు వచ్చింది.' అని బుద్ధుని జన్మకుసంబంధించిన వే. నరసింహారెడ్డిగారి రచన, శ్రీ లక్ష్మణమూర్తి, దాశరథి, డా. సి. నారాయణరెడ్డి, మాదిరాజు రంగారావు, ముక్తిబోధ్, టంకశాల అశోక్ కవితలు వున్నాయి. టంకశాల అశోక్ కవిత ప్రత్యేకంగా పేర్కొనదగింది. 'ప్రహేళికలు' గ్రంథసమీక్ష సంపత్కుమార గారు చేశారు

—పాఠకుడు.

అందుకే అంటున్నాను నేను
అందుకో ఆయుధం అని
ఆచరణకి దారితీస్తేనే
ఆవేశం సార్థకమవుతుంది.

అందుకే సృష్టిస్తున్నాను
అధర్మనిధనంచేసే ఈఖడ్గాన్ని
కలంతో సృష్టిస్తున్న ఖడ్గం ఇది
జనంతో నిర్మిస్తున్న స్వర్గం ఇది.

ఈ కత్తి
బూజుపట్టిన భావాలకి
పునర్జయం ఇవ్వడానికి కాదు
కుళ్ళిపోతున్న సమాజ వృక్షాన్ని
సమూలచ్ఛేదం చెయ్యడానికి

దీన్ని
నల్లబజారు గుండెల్లోదించు
దీనితో
కల్ల కపటాలను వధించు

ఇది
సమాన ధర్మాన్ని స్థాపిస్తుంది
నవీన మార్గాన్ని చూపిస్తుంది.

శ్రీశ్రీ

Printed, Published and Edited by varavara rao for 'Sahitheemithrulu'